

అమరవీరులకు అరుణాంజలి
రూ॥ 220/-
పేజీలు: 230
నవచేతన పబ్లిషింగ్ హౌస్
ప్రతులకు:
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ(నాగోల్),
హైదరాబాద్-68, ఫోన్: 29884454/53
Email ID: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
అబిడ్స్, బండ్లగూడ,
హిమాయత్‌నగర్ (హైదరాబాద్)
హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★

సంపుటి 08, సంచిక: 159 | శుక్రవారం | 09-05-2025 | కరీంనగర్

Published from: Karimnagar, Hyderabad, Khammam, Mahabubnagar

పేజీలు: 12+8 | వెల రూ. 5.00



ఆధిపత్య రాజకీయాలను ఐక్యంగా ప్రతిఘటిస్తాం

హెలికాప్టర్ కూలి పైలెట్ సహా ఆరుగురు దుర్మరణం

లోపలి పేజీల్లో






పంజాబ్‌లోని పొల్లాల్లో ఓ క్షిపణి శకలాలను గుర్తించారు. పాక్‌లోని ఉగ్రస్థావరాలపై ఆపరేషన్ సిందూర్ చేపట్టిన వేళ ఈ ప్రదేశంలో భారీ శబ్దం వచ్చిందని, ఆ తర్వాత విద్యుత్ సరఫరా నిలిచిపోయినట్లు స్థానికులు చెబుతున్నారు. ఈ శకలాలను జేతువాల్, మఖాన్ విండి, పంధేర్ వద్ద పొలాల్లో గుర్తించినట్లు వెల్లడించారు. 'పేలుడు తర్వాత చుట్టుపక్కల మొత్తం భయం నెలకొంది. క్షిపణి శకలాలు జేతువాల్‌లోని పొలాల్లో పడ్డాయి' అని ప్రకాశ్ సింగ్ అనే స్థానికుడు చెప్పాడు.

పంజాబ్‌లోని ఫిరోజ్‌పూర్ సెక్టార్‌లో బుధవారం అర్ధరాత్రి పాకిస్థాన్ జాతీయుడు భారత్‌లోకి చొరబడేందుకు యత్నించాడు. చీకట్లో భారత భూభాగంవైపు దూసుకొచ్చాడు. ఇది గమనించి బీఎస్ఎఫ్ బలగాలు వెంటనే అతడిపై కాల్పులు జరపడంతో మృతి చెందాడు. అనంతరం అతడి మతదేహాన్ని పోలీసులకు అప్పగించారు.

భారత్ దాడితో ప్రతిచర్యగా భారత్‌పై ఏక్షణమైనా దాడులు చేసే అవకాశం ఉన్న నేపథ్యంలో భారత్ సరిహద్దు రాష్ట్రాల్లో భద్రతను కట్టుదిట్టం చేసింది. ముఖ్యంగా రాజస్థాన్, పంజాబ్ రాష్ట్రాల్లో హై అలర్ట్ ప్రకటించింది. ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు పోలీసు సిబ్బంది సెలవులను రద్దు చేశాయి. బహిరంగ సభలపై నిషేధం విధించాయి.

### లాహోర్ ఎయిర్ డిఫెన్స్

# నేలమట్టం

## పాక్ దాడులకు భారత్ ప్రతీకార చర్య

- భారత సైనిక స్థావరాలపై డ్రోన్లు, క్షిపణులతో దాడికి పాక్ యత్నం
- సమర్ధంగా తిప్పికొట్టిన భారత బలగాలు
- పాకిస్థాన్ గగనతల రక్షణ రాడార్లు ధ్వంసం చేశాం భారత రక్షణ శాఖ వెల్లడి
- ఎల్‌ఒసి వద్ద కాల్పుల విరమణ ఉల్లంఘనను కొనసాగిస్తున్న దాయాది దేశం
- కాల్పుల్లో 16 మంది భారత పౌరులు మృతి

**న్యూఢిల్లీ:** భారత్ సైనిక స్థావరాను లక్ష్యంగా చేసుకొని డ్రోన్లు, క్షిపణులతో దాడులకు యత్నించిన పాకిస్థాన్‌ను భారత దళాలు మరోసారి దెబ్బతీశాయి. పాకిస్థాన్ గగనతల రక్షణ వ్యవస్థలు లక్ష్యంగా దాడులు జరిపి లాహోర్‌లోని ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థను ధ్వంసం చేశాయి. ఈ మేరకు రక్షణ శాఖ వర్గాలు తెలిపాయి. ఉత్తర పశ్చిమ భారతంలోని 15 ప్రాంతాలు లక్ష్యంగా పాకిస్థాన్ డ్రోన్, క్షిపణి దాడులను తిప్పికొట్టినట్లు వెల్లడించాయి. పాక్ లక్షిత ప్రాంతాల్లో అవంతిపుర, శ్రీనగర్, జమ్మూ, పఠాన్‌కోట్, అమత్‌సర్, కపూర్తలా, జలంధర్, లుధియానా, ఆదంపూర్, భటిండా, చండీగఢ్, నాల్, ఫలోడి, ఉత్తర్‌లై, భుజ్ ఉన్నాయి. ఆ ప్రాంతాల్లోని సైనిక స్థావరాలపై దాడికి బుధవారం రాత్రి పాక్ యత్నిస్తే ఇండిగ్రేటెడ్ కౌంటర్ అన్‌మ్యాన్డ్ ఎయిరక్రాఫ్ట్ సిస్టమ్ (గ్రిడ్ గగనతల రక్షణ వ్యవస్థ)తో సమర్థంగా తిప్పికొట్టినట్లు రక్షణ శాఖ వెల్లడించింది. హెచ్‌క్యూ9 రక్షణ వ్యవస్థలను పాకిస్థాన్ ఉపయోగిస్తున్నట్లు పేర్కొంది. పాకిస్థాన్ దాడులకు రుజువుగా వీటి శకలాలను ఆయా ప్రాంతాల నుంచి

తరువాయి 2లో

### ఫాసిజంపై విజయం 80వ వార్షికోత్సవం



హిట్లర్ ఫాసిజంపై విజయానికి సంకేతంగా సోవియట్ యూనియన్ రెడ్ ఆర్మీ సైనికుడు 1945 మే 9న బెర్లిన్‌లో జర్మనీ పార్లమెంటు భవనం రీచ్‌స్టాగ్‌పై అరుణపతాకం ఎగురవేస్తున్న ప్రసిద్ధ చిత్రం. హిట్లర్ ఆత్మహత్య చేసుకున్నాడు. ముస్సోలినీని జనం కొట్టిచంపారు. రెండవ ప్రపంచ యుద్ధానికి తెరపడింది.

(ప్రత్యేక వ్యాసం 4వ పేజీలో)

# ఉద్రిక్తతలు పెంచింది పాకిస్థానే



- పహల్గామ్‌లో తొలిదాడి చేసింది
- ఆపరేషన్ సిందూర్ పహల్గామ్‌కు ప్రతిచర్య మాత్రమే
- ప్రార్థనాస్థలాల్ని ఉగ్రవాద శిక్షణాకేంద్రాలుగా మార్చారు
- మా యుద్ధ విమానాలు కూల్చేశామనడం దుష్ప్రచారం
- భారత విదేశాంగ కార్యదర్శి మిస్రీ

**న్యూఢిల్లీ:** పహల్గామ్‌లో సామాన్య ప్రజలను కాల్చి చంపడంద్వారా మొదట ఉద్రిక్తతలు పెంచింది పాకిస్థానేనని భారత విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రి చెప్పారు. ఆపరేషన్ సిందూర్‌లో హతులైన ఉగ్రవాదులకు ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారని తీవ్రస్థాయిలో ఆయన అన్నారు. మత ప్రార్థనాస్థలాలను లక్ష్యంగా చేసుకుని భారత్ సైన్యం ఉద్దేశపూర్వకంగా దాడులు చేసిందని పాకిస్థాన్ చెప్పడాన్ని ఆయన తిరస్కరించారు. ఇది పూర్తిగా అవాస్తవమని, ప్రార్థనాస్థలాలను వారు ఉగ్రవాద శిక్షణా కేంద్రాలుగా ఉపయోగించుకుంటున్నారని విమర్శించారు. పాకిస్థాన్ గనుక ఇదేవిధంగా ఉద్రిక్తతలను కొనసాగించేందుకు ప్రయత్నం చేస్తే భారత సాయుధ దళాలు దీటుగా స్పందిస్తాయని ఆయన మరోసారి తెలిపారు. కవ్వింపు చర్యలకు పాల్పడటం, ఉద్రిక్తతలు రెచ్చగొట్టడం భారతదేశ వైఖరి కాదని ఆయన

తరువాయి 2లో

## మా సహనాన్ని పరీక్షించొద్దు

## పాక్ దాడిచేస్తే మా సైన్యం ఊరుకోదు

## రాజస్థాన్-పంజాబ్ సరిహద్దుల్లో హైటెన్షన్

05

### గుడిసెలు తగలబడిన పేదలకు

# రూ.లక్ష ఇవ్వాలి

- ఇందిరమ్మ ఇళ్లను నిర్మించి ఇవ్వాలి
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు విజ్ఞప్తి

ప్రజాపక్షం/హైదరాబాద్



రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం కుంట్లూరు రెవెన్యూ పరిధిలోని సర్వేనెంబర్ 215 నుండి 224 వరకు ఉన్న భూదాన భూములలో 8 వేలకు పైగా గుడిసెలు వేసుకుని 20 వేల మందికి పైగా నిరుపేదలు నివసిస్తున్నారని, వీరందరికి ఇళ్ల పట్టాలను మంజూరు చేయడంతోపాటు ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద ఇళ్లను కట్టించి ఇవ్వాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్‌ఎ కూనంనేని సాంబశివరావు ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు గురువారం కూనంనేని సాంబశివరావు ముఖ్యమంత్రికి లేఖ రాశారు. కుంట్లూరు రెవెన్యూ పరిధిలోని భూదాన భూముల్లో గుడిసెల్లో ఏప్రిల్ 26వ తేదీన అగ్ని ప్రమాదం సంభవించి దాదాపు 200 వరకు గుడిసెలు, అదేవిధంగా నాగోల్ డివిజన్ సాయినగర్‌లో మరో 28 పేదల గుడిసెలు అగ్ని ప్రమాదంతో పూర్తిగా దగ్ధం కావడంతో పాటు అక్కడ నివసిస్తున్న నిరుపేద గుడిసెవాసుల నిత్యావసర వస్తువులు, బట్టలు, ఇతర సామాగ్రి, సర్వం కాలిపోయి బూడిదైందని, వారందరూ నిరాశ్రయులు కావడంతో పాటు వీధిన పడ్డారని కూనంనేని సాంబశివరావు లేఖలో సిఎంకు వివరించారు. వారికి కట్టుకోవడానికి బట్టలు సైతం లేని పరిస్థితి ఏర్పడిందని,

తరువాయి 2లో

### ఆపరేషన్ సిందూర్

# కొనసాగుతోంది

## 100 మంది ఉగ్రవాదులు, వారి సహచరులు హతం

- అఖిలపక్షంలో ఆపరేషన్ సిందూర్‌ను వివరించిన రాజ్‌నాథ్
- పార్లమెంటు ప్రత్యేక సమావేశానికి పార్టీల డిమాండ్
- కీలక తరుణంలో రాజకీయాలకు తావులేదని పార్టీల స్పష్టీకరణ

**న్యూఢిల్లీ:** పాకిస్థాన్‌లో, పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీరులో భారతసేనలు చేసిన దాడుల్లో కనీసం 100 మంది ఉగ్రవాదులు, వారి అనుచరులు హతులయ్యారని రక్షణమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ గురువారంనాడు అఖిలపక్ష సమావేశంలో చెప్పారు. ఆపరేషన్ సిందూర్ కార్యక్రమం ఇంకా కొనసాగుతోందని చెప్పారు. ఆపరేషన్ సిందూర్ కొనసాగుతున్నందువల్ల కొన్ని సాంకేతికపరమైన విషయాలను చెప్పడానికి వీలులేదని రక్షణమంత్రి అఖిలపక్ష సమావేశంలో చెప్పారు. ప్రతిపక్ష నాయకులు ముందుగా విజ్ఞప్తి చేసినాగానీ ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈ సమావేశానికి హాజరుకాలేదు. రాజ్‌నాథ్‌సింగ్ అధ్యక్షతన జరిగిన ఈ అఖిలపక్ష

తరువాయి 2లో



### మన నిజమైన

## శత్రువులు ఉగ్రవాదులే

అఖిలపక్షానికి ఆహ్వానించక పోవడంపై విచారం : సిపిఐ



**న్యూఢిల్లీ :** మన నిజమైన శత్రువులు ఉగ్రవాదులు, మత ఛాందసవాదులేనని, రాజకీయ విభేదాలకు, సరిహద్దులకు అతీతంగా వారిపై అనివార్యంగా ఉమ్మడి పోరాటం చేయాల్సిన అవసరం ఉందని భారతకమ్యూనిస్టుపార్టీ (సిపిఐ) ఉద్ఘాటించింది. భారత్-పాకిస్థాన్ రెండు దేశాలు సంయమనం పాటించాలనీ, సైన్యాలను వెనక్కునెట్టి యుద్ధాన్ని నివారించాలని, దౌత్యమార్గాలను అనుసరించాలని పార్టీ కోరింది. యుద్ధంవల్ల బహుముఖ

తరువాయి 2లో




### దేశంవైపు కన్నెత్తిచూస్తే

# నూకలు చెల్లినట్లే

- భారత్ తలుచుకుంటే పాక్ రేపటి సూర్యోదయాన్ని చూడలేదు
- కానీ భారతీయులు శాంతికాముకులు
- చేతకాని తనంగా భావిస్తే ఆపరేషన్ సిందూర్ సరైన సమాధానం
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెల్లడి ఉగ్రవాదానికి వ్యతిరేకంగా సంఘీభావ ర్యాలీ

ప్రజాపక్షం/హైదరాబాద్

ప్రపంచ ముఖ చిత్రంలోని ఏ దేశమైనా సరే భారతదేశ సార్వభౌమత్వం వైపు కన్నెత్తి చూస్తే వారికి ఈ భూమి మీద నూకలు చెల్లినట్లేనని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి హెచ్చరించారు. పాకిస్థాన్ ఖబర్దార్, భారతదేశం తలుచుకుంటే మీరు రేపటి సూర్యోదయాన్ని చూడలేరన్నారు. కానీ తాము శాంతి కాముకులమని, దానిని ఎవరైనా చేతగానితనంగా భావిస్తే వారికి ఆపరేషన్ సిందూర్ సరైన సమాధానమని సిఎం అన్నారు. భారత సైన్యానికి బాసటగా నిలుస్తూ ఉగ్రవాదానికి వ్యతిరేకంగా రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో సంఘీభావ ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ సచివాలయం నుంచి నెక్లెస్‌రోడ్‌లోని మాజీ ప్రధానమంత్రి ఇందిరా గాంధీ విగ్రహం వరకు ఈ భారీ ర్యాలీ జరిగింది. ఈ సందర్భంగా వీర సైనికులను

తరువాయి 2లో

### తెలంగాణ-ఛత్తీస్‌గఢ్

# సరిహద్దుల్లో ఉద్రిక్తం

- రక్తసిక్తమవుతున్న అడవులు
- ముగ్గురు జవాన్లు మృతి
- కర్రెగుట్టల్లో భారీ గాలింపు
- బిక్కుబిక్కుమంటున్న అటవీ గూడేలు



ప్రజాపక్షం/భద్రాచలం/వాజేడు

తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లో ఉద్రిక్త వాతావరణం చోటు చేసుకుంది. పచ్చని అడువుల్లో నెత్తుటేరులు పారుతున్నాయి.తాజాగా గురువారం తెలంగాణ రాష్ట్రంలోని ములుగు జిల్లాఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లా ఎలిమిడి సరిహద్దు అటవీ ప్రాంతంలో కూంబింగ్ నిర్వహిస్తున్న గ్రేహౌండ్స్ బలగాలపై మావోయిస్టులు మందు పాతర పేల్చారు. ఈ ఘటనలో ముగ్గురు జవాన్లు అక్కడికక్కడే మృతి చెందగా మరి కొంతమందికి తీవ్ర గాయాలు అయ్యాయి. మృతులతో పాటు క్షతగాత్రులను వరంగల్ ఎంజిఎం ఆస్పత్రికి తరలించారు. ఇదే ప్రాంతంలో ఇరు వర్గాల నడుమ ఎదురుకాల్పులు సైతం చోటు చేసుకున్నాయి. ఈ కాల్పుల్లో రూ.1 కోటి రివార్డు ఉన్న మావోయిస్టు నేత చంద్రన్నతో పాటు బండి ప్రకాష్ అనే మరో

తరువాయి 12లో

### వైద్యానికి యేటా ఖర్చు

# రూ.11,482 కోట్లు

- అంతర్జాతీయ ప్రమాణాలతో యంగ్ ఇండియా
- మానవ వనరుల అభివృద్ధికి పటిష్ట చర్యలు
- ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క
- మెడికల్ కళాశాల భవనానికి శంకుస్థాపన చేసిన మంత్రులు తుమ్మల, పొంగులేటి, రాజనర్సింహ



ప్రజాపక్షం/ఖమ్మం

రాష్ట్రంలో మానవ వనరుల అభివృద్ధికి పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నామని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క తెలిపారు. వైద్యానికి ప్రతి యేటా రూ.11,482 కోట్లు ఖర్చు చేస్తున్నామని ఆయన తెలిపారు. సహచర మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, దామోదర రాజనర్సింహాలతో కలిసి ఖమ్మంజిల్లా రఘునాథపాలెం మండలంలో నూతనంగా నిర్మిస్తున్న ప్రభుత్వ వైద్య కళాశాల భవనానికి శంకుస్థాపన

తరువాయి 12లో



## అగ్నిప్రమాద బాధితులకు తక్షణం ప్రభుత్వ సాయం

సిపిఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ డిమాండ్

03



# ప్రపంచం
WORLD NEWS

## పాకిస్థాన్‌కి లొంగి యుద్ధంలో తలదూర్చొద్దు



**కాబూల్ :** భారత్‌తో పాకిస్థాన్ చేస్తున్న యుద్ధంలో పావులుగా మారవద్దని, పాకిస్థాన్‌కు సహకరించవద్దని పష్తూన్ల వర్గానికి తాలిబన్ విజ్ఞప్తి చేసింది. పాకిస్థాన్ ఆడుతున్నఆటలో పావుగా మారవద్దని అఫ్గానిస్థాన్ తాలిబన్ ఉగ్ర వాదసంస్థ సీనియర్ నాయకుడు,పాకిస్థాన్‌లో అఫ్గానిస్థాన్ దౌత్యవేత్తగా పని చేసిన ముల్లా అబ్దుల్ సలామ్ జాయిఫ్ పష్తూన్లకు విజ్ఞప్తి చేశారు. అలాంటి ప్రయత్నాలు జరిగితే తాము వాటిని అడ్డుకుంటామని ఆయన హెచ్చరించారు. జీహాద్ పేరుతో పష్తూన్ వర్గాలను పాకిస్థాన్ ప్రభుత్వం రెచ్చగొట్టే అవకాశం ఉందని, అలాంటి ప్రలోభాలకు గురై యుద్ధంలో తలదూర్చవద్దని పష్తూన్ వర్గానికి ఎక్స్ వేదికగా అబ్దుల్ సలామ్ జాయిఫ్ కోరారు. జీహాద్ పేరుతో పష్తూన్లను పాకిస్థాన్ ప్రభుత్వం రెచ్చగొట్టి తన ప్రయోజనాలకు ఉపయోగించుకునే ప్రమాదం ఉందని ఆయన హెచ్చరించారు. ఈ రాజకీయ ఆటల నుండి మీ పిల్లలను దూరంగా ఉంచం డి అని ఆయన కోరారు. పష్తూన్ వర్గానికి అటు పాకిస్థాన్‌తోనూ, ఇటు భారతదేశం తోనూ చారిత్రకంగా ఎంతో గొప్ప అనుబంధం ఉంది.

# ఆధిపత్య రాజకీయాలను ఐక్యంగా ప్రతిఘటిస్తాం

**మాస్కో పర్యటనలో జిన్‌పింగ్ ప్రతిజ్ఞ**


**రెడ్‌స్క్వేర్ వద్ద నేడు యుద్ధ విజయోత్సవానికి 29 దేశాల నాయకులు**





**మాస్కో:** ఆధిపత్యరాజకీయాల ప్రతిఘటనకు రష్యా,చైనా చేయి చేయి కలిపి ముందుకు సాగుతాయని చైనా అధ్య క్షుడు జీ జిన్‌పింగ్ అన్నారు. ఆయన ప్రస్తుతం మాస్కోలో పర్యటిస్తున్నారు. సోవియట్ యూనిన్ ప్రజలు మాతృదేశ రక్షణకోసం నాజీ మూకలపై చేసిన మహత్తయుద్ధంలో విజయం సాధించి 80 సంవత్సరాలు పూర్తయిన సంద ర్భంగా శుక్రవారంనాడు మాస్కోలో అంగరంగవైభవంగా వేడుకలు జరగనున్నాయి. చరిత్రాత్మకమైన రెడ్‌స్క్వేర్ వద్ద ఈ వేడుకలు, సైనిక కవాతులు జరుగుతాయి. ఈ సందర్భంగా రష్యా తన సైనిక పాటవాన్ని ప్రదర్శించింది. ఈ వేడుకలలో పాల్గొనేందుకు చైనా అధ్యక్షుడు జీ జిన్ పింగ్‌సహా29దేశాల నాయకులు హాజరవుతున్నారు. క్యూ బా, ఇజ్రాయెల్, వెనిజులా, వియత్నాం, అజర్‌బైజాన్, ఈజిప్టు,బ్రెజిల్, జింబాబ్వే, బోస్నియా, ఆర్మేనియా, బెలా రస్, ఖజకస్థాన్,కిర్గిస్థాన్, తజికిస్థిన్, తుర్కిమెనిస్థాన్ తది తర దేశాల నాయకులు పాల్గొంటారు. మయన్మార్ ప్రధా నమంత్రి, సీనియర్ జనరల్ మిన్ ఆంగ్ హ్లేయింగ్ ఇప్ప టికే మాస్కో చేరుకుని సీనియర్ అధికారులతో మంత నాలు జరిపిపారు. ఇప్పటికే మాస్కో చేరుకున్న జిన్‌పిం గ్‌కు మాస్కోలో రష్యా అధ్యక్షుడు వ్లాదిమీర్ పుతిన్ ఘన స్వాగతం పలికారు. మాస్కో విమానాశ్రయంలో జిన్‌పిం గ్‌కు సైనికదళాలు వందనం చేసి స్వాగతం పలికాయి. రష్యాతో ద్వైపాక్షిక సంబంధాల పటిష్ఠతతోపాటు పలు అంతర్జాతీయ,ప్రాంతీయఅంశాలపై చర్చించినట్లు క్రెమ్లిన్ వర్గాలు తెలిపాయి. ఆధిపత్య బెదిరింపులు వస్తున్న తరు ణంలో రష్యాకు చైనా ఎప్పుడూ అండగా ఉంటుందని చర్చల సందర్భంగా పుతిన్‌కు జిన్‌పింగ్ భరోసా ఇచ్చి నట్లు వర్గాలు తెలిపాయి. జిన్‌పింగ్‌ను పుతిన్ రష్యాకు అత్యంత గౌరవనీయమైన అతిథిగా పరిగణించారు. జిన్ పింగ్‌ను పుతిన్ ''ప్రియమైన మిత్రుడా.... అని సంబోధిం చారు. ఏకపక్షవాదం, ఆధిపత్య బెదిరింపుల ప్రవర్తన పెరి గిపోయినపరిస్థితుల్లోదానినిప్రతిఘటించేందుకు రష్యాతో కలిసి చైనా ప్రపంచ బాధ్యతను తన భుజంమీద మోస్తుం దని జిన్‌పింగ్ అన్నారు. చైనా–రష్యామధ్య పరస్పర రాజ కీయ ఆత్మవిశ్వాసం, అవగాహన ఎంతో లోతుగా పాదు కొని ఉందన్నారు. రెండు దేశాలూ చారిత్రక వాస్తవాలను కాపాడుకుంటాయని పుతిన్ ఈ సందర్భంగా అన్నారు. రెండు దేశాలూ నిజమైన మిత్రులుగా, మంచి పొరుగుదే శాలుగా సమగ్ర వ్యూహాత్మక సమన్వయంతో పరస్పర ప్రయోజనాలకోసం రెండు దేశాలూ పాటుపడుతున్నా యని జిన్‌పింగ్ అన్నారు. ఐక్యరాజ్యసమితిలో వీటో అధి కారం ఉన్న శాశ్వతసభ్యదేశాలుగా చైనా,రష్యా రెండో ప్రపంచయుద్ధంలో నాజీలను అదుపు చేయగలిగాయ న్నారు. ప్రపంచయుద్ధం ద్వారా ఏర్పడిన ఫలితాలను కాపాడటానికి, అంతర్జాతీయ క్రమాన్ని రక్షించడా నికి,ఆధిపత్యాన్ని, అధికార రాజకీయాలను ప్రతిఘటించ డానికి, నిజమైన బహుళప్రపంచ విధాన సంరక్షణకు, న్యాయమైన, సమతుల్యతోకూడిన ప్రపంచపాలనావ్యవ స్థను కాపాడటానికి రష్యా–చైనా దేశాలు చేయి చేయి కలిపి ముందుకు సాగుతాయని జిన్‌పింగ్ అన్నారు. ర ష్యాలో విజయోత్సవ వేడుకల సందర్భంగా మూడురోజు లపాటు ఉక్రేన్‌లో దాడులు చేయకుండా రష్యా కాల్పుల విరమణ ప్రకటించింది. కానీ ఉక్రేన్ అధ్యక్షుడు జెలెన్స్కీ మాత్రం రష్యా తను విధించిన కాల్పుల విరమణ ఒప్పం దాన్ని తానే ఉల్లంఘించిందని విమర్శించారు. పుతిన్,జిన్ పింగ్ మాస్కోలో సమావేశం జరుపుతున్న తరుణంలోనే ఉక్రేన్ డ్రోన్లు రష్యాలోని ప్రాంతాలపై దాడులు చేశాయి.

## అమెరికాలో బాలలపై లైంగిక దాడులు : 200 మంది అరెస్టు



**వాషింగ్టన్ :** అమెరికాలో బాలలపై లైంగిక దాడులు చేస్తున్నారన్న ఆరోపణలపై 200మందిని అరెస్టు చేశారు.వీరంతా బాలలపై లైంగిక దాడులు చేస్తున్నారన్న సందేహంలో అరెస్టు చేశారు. వీరిలో విదేశీయులు, వలస ప్రజలు ఎక్కువమంది ఉన్నారు. ''మీరు మా దేశంలో పిల్లలకు హానిచేస్తే మీకు అమెరికాలో ఎలాంటి ఆశ్రయం దొర కదు, వారిని వెంటనే గెంటేస్తాం'' అని ఎఫ్‌బిఐ డైరెక్టర్ కాష్ పటేల్ చెప్పారు. బాలలపై లైంగిక దాడులు చేసేవారిని ఏ విధంగా అరెస్టు చేసిందీ అమెరికా జస్టిస్ డిపార్ట్‌మెంటు ప్రకటించింది. వారిని వలవేసి పట్టుకున్నారు. 55 మంది ఎఫ్‌బిఐ ఫీల్డ్ ఆఫీసర్లు ఈ దాడుల్లో పాల్గొన్నారు. దేశవ్యాప్తంగా అటార్నీ కార్యాలయాలలో ఉన్న క్రిమినల్ డివిజన్ విభాగంలోని సంబంధిత అధికారులు ఈ ఆపరేషన్‌లో దేశవ్యాప్తంగా పాల్గొన్నారు. ఏప్రిల్ 28 నుండి మే రెండో తేదీ వరకూ ఈ వేట కొనసాగింది. ఈ దాడుల్లో భాగంగా స్కూల్ లీడర్స్‌ను, రిజిస్టర్స్ సెక్స్ అఫెండర్లను, లా ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగంలో ఉన్న సభ్యులను కూడా అరెస్టు చేశారు. బాధిత బాలలను రక్షించడంలో తమ శాఖ వెనుకంజవేయదనీ, విశ్రమించబోదనీ సంబంధిత ఎఫ్‌ఐబి అధికారులు చెప్పారు.

## 'తెల్లపొగ' కోసం వాటికన్‌లో ఎదురుచూపులు



**వాటికన్‌సిటీ :** వాటికన్‌సిటీలో గురువారం నాడు రెండోరోజు ఉదయంపూట సమావేశంలో కూడా రోమన్ క్యాథలిక్స్ మతగురువైన కొత్త పోప్‌ను ఎన్నుకోవడంలో కార్డినల్స్ విఫలమ య్యారు. పొగ గొట్టం నుండి నల్లటి పొగ రావ డంతో బయట ఎదురుచూస్తున్న వేలాదిమంది ప్రజలు నిరాశానిస్పృహలకు గురయ్యారు. దీంతో గురువారంనాడు కార్డినల్స్ మధ్యాహ్న సమావేశం ప్రారంభమైంది. కార్డినల్ పీటర్ క్యోడో అప్పయ్య టర్క్సన్, కార్డినల్ లూయిస్ ఆంటోనియో గోకిమ్ టాగ్లే, కార్డినల్ ఫ్రిడోలిన్ అంబోంగో బెసుంగులు ప్రస్తుతం పోప్ పదవికి పోటీలో ఉన్నారు. ప్రపంచం కష్టకా లంలో ఉన్న ప్రస్తుత తరుణంలో ఐక్యతను కోరే ఒక కొత్త పోప్‌ను కార్డినల్స్ ఎన్నుకుంటారని అందరూ ఎంతో ఆశా భావంతో ఎదురుచూస్తున్నారు. రెండో విడత సమావేశంలో రహస్య బ్యాలెట్ ద్వారా ఐక్యంగా ఏకాభిప్రాయంతో కూడిన పోప్ ఎంపిక జరుగుతుందని ఎదురుచూస్తున్నారు. ఏప్రిల్ 21న పోప్‌ఫ్రాన్సిస్ మరణించడంతో కొత్త పోప్‌ను ఎన్నుకోవాల్సివచ్చింది. 135 మంది కార్డినల్స్ రహస్య బాలెట్ ద్వారా పోప్ ఎన్నిక నిమిత్తం ప్రపంచంతో సంబం ధాలు లేకుండా రహస్య సమావేశం జరుపుతున్నారు. వారి వద్ద సెల్‌ఫోన్లు లేవు. సమావేశ మందిరంవద్ద జామర్లను కూడా ఏర్పాటు చేశారు. పోప్ ఎన్నిక జరిగితే కార్డినల్స్ తమ చేతుల్లో ఉన్న బ్యాలెట్ పత్రాలన్నింటికీ కలిసి దగ్ధం చేసే బయట చిమ్నీ నుండి తెల్లటి పొగ వస్తుంది. ఒకవేళ పోప్ ఎన్నికలలో ఏకాభిప్రాయం రాకపోతే బ్యాలెట్ పత్రా లను దగ్ధం చేసినట్లు నల్లటి పొగ వస్తుంది. గురువారంనాడు వాటికన్‌సిటీలో వెలుపల ఎదురుచూస్తున్న వేలాదిమంది భక్తులు తెల్లటిపొగకోసం ఎదురుచూస్తున్నారు.

## యూరప్‌లో యుద్ధ విజయోత్సవ వేడుక

**మౌనం పాటించి అమర సైనికులకు శ్రద్ధాంజలి**



**వెస్ట్‌మినిస్టర్ :** రెండో ప్రపంచ యుద్ధంలో నాజీ జర్మనీ సైన్యం ఓటమిని అంగీకరించి లొంగి పోయి 80 సంవత్సరాలు పూర్తయిన సంద ర్భంగా యూరప్‌లో గురువారంనాడు యుద్ధ విజయోత్సవ వేడుకలు జరిగాయి. ఈ సంద ర్భంగా పలువురు నాయకులు వెస్ట్‌మినిస్టర్‌లోని సెయింట్ పీటర్స్ చర్చ్ వద్ద గుమిగూడి అమర వీరులకు నివాళులు అర్పించారు. కొద్దిసేపు మౌనంపాటించి వారికి శ్రద్ధాంజలి ఘటిం చారు.బ్రిటన్ రాజు ఛార్లెస్ రాణి కెమెల్లా సహా ఇతర రాజకుటుంబీకులు, మాజీ ప్రధానమం త్రులు, ఇతర అధికారులు,మతాధిపతులు పాల్గొన్నారు. ఈ వేడుకలలో పాల్గొన్న ఆనాడు యుద్ధంలో భాగస్వామిగా ఉన్న 103 సంవత్స రాలు వయసుగల హారీ వింటర్ తన అనుభవా లను వివరించారు. తాను నాజీలనుండి తప్పిం చుకుని 17 రోజులపాటు 150 మైళ్ళదూరం తిండీ తిప్పలూ లేకుండా నడుచు కుంటూ వచ్చానని, ఆ దృశ్యాలు ఈనాటికి తన కళ్ళకు కట్టినట్టు కనిపిస్తున్నాయని తన అనుభ వాలు వివరించారు. ఇదేరోజున 80 సంవత్సరా లక్రితం విన్‌స్టన్ చర్చిల్ ఒక ప్రకటన చేస్తూ యుద్ధం నుండి మనం బయటపడ్డామని, మన కష్టాలు తొలగిపోయాయని అన్నారు. వీధుల్లో ఆనాడు ప్రజలు నృత్యాలు చేస్తూ పండుగ చేసు కున్నారు. 1939 నుండి 1945 వరకూ సుమారు ఐదు కోట్లమంది (50 మిలియన్) ఈ యుద్ధంలో మరణించారు. ఆనాటి నుండీ ఈనా టివరకూ సజీవులైన శతాధికవృద్ధులు కొందరు ఈ కార్యక్రమంలో పాల్గొని తమ అనుభవాలు గుర్తుచేసుకున్నారు.

## రూ.లక్ష ఇవ్వాలి (మొదటి పేజీ తరువాయి)

తక్షణ సహాయం కింద కలెక్టర్ కొంత సహాయం ప్రకటించినా అది ఏమాత్రం సరిపోదని ఆయన పేర్కొన్నారు. కాలిపోయిన ప్రతి గుడిసెవాసికి నష్టపరిహారంగా ఒక్కొక్కరికి లక్ష రూపాయల నగదు, వేసవి కారణంగా తాగునీటి సదుపాయం, మౌలిక వసతులను కల్పిం చాలని కోరారు. గుడిసెలు కాలిపోయిన బాధలో పేదలుంటే ప్రైవేట్ రియల్‌ఎస్టేట్ వ్యాపా రులతో రెవెన్యూ అధికారులు, పోలీసులు కుమ్మక్కై గుడిసెలను ఖాళీ చేయించే ప్రయ త్నాలు చేస్తూ గుడిసెవాసులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆయన తెలిపారు. ప్రైవేట్ రియల్‌ఎస్టేట్ వ్యాపారులు ఈ భూదాన భూభులపై తప్పుడు రికార్డులను సృష్టించి ప్రైవేట్ భూమిగా చిత్రీకరించే ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. గత 40 ఏళ్లుగా ఖాళీగా ఉన్న ఈ 100 ఎకరాల భూముల్లో పేదలు గుడిసెలు వేసుకుని నివసిస్తున్నారని, వారితో పాటు సాయినగర్ గుడిసెవాసలకు పట్టాలు మంజూరు చేసి ఇళ్లు నిర్మించి ఇవ్వాలని కూనంనేని సాంబశివరావు సిఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు.

## నేలమట్టం.. (మొదటి పేజీ తరువాయి)

సేకరిస్తున్నట్లు తెలిపింది. పాకిస్థాన్‌లో గగనతల రక్షణ రాడార్‌లు, వ్యవస్థలపై దాడుల్లో భాగంగా లాహోర్ గగనతల రక్షణ వ్యవస్థను నిర్వీర్యం చేసినట్లు రక్షణ శాఖ వర్గాలు వెల్ల డించాయి. మరోవైపు నియంత్రణ రేఖ (ఎల్‌ఓసీ) వెంబడి కాల్పుల విరమణను ఉల్లంఘిస్తూ పాకిస్థాన్ దాడులను ముమ్మరం చేసింది. జమ్మూకశ్మీర్‌లోని రాజౌరీ, మెంధార్, పూంచ్, ఉరి, బారాముల్లా, కుప్వారా ప్రాంతాల్లో భారీ ఫిరంగులతో విరుచుకుపడింది. కాల్పుల్లో 16 మంది పౌరులు మరణించారు. మృతుల్లో ముగ్గురు మహిళలు, ఐదుగురు పిల్లలు కూడా ఉన్నారు. ఈ క్రమంలోనే ఫిరంగుల దాడులు, కాల్పులను ఆపేందుకు భారత్ ప్రతి చర్యలు తీసుకుంటోంది.

## నూకలు చెల్లినట్లే (మొదటి పేజీ తరువాయి)

కీర్తిస్తూ గాయని లతా మంగేష్కర్ ఆలాపించిన ''ఏ దేశ్‌కీ లోగో జర ఆంక్ మే బర్‌లో పాణి, జో షహీద్ ఉహే ఉన్‌కో యాధ్ కరో జరా '' అనే గీతంతో ఈ ర్యాలీ ముందుకు సాగింది. ఈ ప్రదర్శనలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జాతీయ పతాకాన్ని చేతబూని అగ్రభాగాన నడవగా, త్రివిధ దళాల అధికారులు, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు పొన్నం ప్రభాకర్, దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు, జూపల్లి కృష్ణారావు, తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ ఛైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి, ఎంపిలు, ఎంఎల్‌సిలు, ఎంఎల్‌ఎలు, వివిధ పార్టీల నాయ కులు, ప్రభుత్వ అధికారులు, పోలీసులు, విద్యార్థులు, ప్రజలు పెద్దఎత్తున పాల్గొన్నారు. ఇందిరా గాంధీ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన ఉగ్రవాదుల దాడిలో మరణించిన అమరుల చిత్ర పటాలకు నివాళులు అర్పించారు. ఒక నిమిషం పాటు మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం భారత్ జవాన్ జిందాబాద్ నినాదాలతో ఈ ప్రాంతం దద్దరిల్లింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ గత కొంత కాలంగా పాకిస్తాన్ ప్రేరే పిత ఉగ్రవాదులు భారతదేశ సరిహద్దుల్లోకి చొచ్చుకుని వచ్చి మన సోదరులను మట్టు పెట్టి మన అక్కాచెల్లల సింధూరాన్ని తుడిచి వేసి, భారతదేశ సార్వభౌమా ధికారంపై దాడి చేశామని వారు విర్రవిగారన్నారు. ఈ దేశంపై ఎవరూ దాడిచే సినా వదలబోమని శపథం చేసిన భారత జవాన్లకు స్ఫూర్తినిచ్చేందుకే దేశ రక్ష ణలో అందరం ఒక్కటేనని చాటుతూ తెలంగాణ గడ్డ నుంచి ఈ సంఘీభావ ర్యాలీ నిర్వహిస్తున్నామన్నారు. ఉగ్రవాదుల పించం అణిచేందుకు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, కాంగ్రెస్ జాతీయ అధ్యక్షులు మల్లికార్జున్‌ఖర్గేలు ప్రధాని మోదీని కలిసి సంపూర్ణ మద్దతు తెలిపారని చెప్పారు. గాంధీ శాంతి యుత పోరాటం వల్ల భారతదేశంతో పాటు పాకిస్తాన్‌కు కూడా స్వేచ్ఛ లభిం చిందన్నారు. గాంధీ శాంతి సిద్ధాంతాన్ని పుణికిపుచ్చుకున్న ఈ దేశంలోని 140 కోట్ల మంది శాంతిని కోరుకుంటూ, శాంతిని నెలకొల్పుతూ దేశాన్ని అభివృద్ధి పథంలో తీసుకుపోతున్నామని చెప్పారు.

## కొనసాగుతోంది (మొదటి పేజీ తరువాయి)

సమావేశంలో రాజ్యసభలో ప్రతిపక్ష నాయకుడు మల్లికా ర్జునఖర్గే, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ, జాన్ బ్రిట్టస్ (సిపిఐ(ఎం) తదితరులు సమావే శంలో పాల్గొన్నారు. అనేక సందేహాలు నివృత్తి చేయడా నికి పార్లమెంటు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయాలని పార్టీలు కోరాయి. ఖచ్చితమైన మృతుల సంఖ్య చెప్పడం వీలుకాదని రాజ్‌నాథ్‌సింగ్ అన్నారు. భారతదేశ సైని కులు చేపట్టిన ఈ చర్యలకు అన్ని రాజకీయపార్టీలూ పూర్తి మద్దతు తెలియజేశాయి. భారతదేశం యుద్ధాన్ని కోరుకోవడంలేదనీ, యుద్ధం విస్తరించాలని ఆశించడం లేదని, కానీ పాకిస్థాన్‌కు తగినవిధంగా గుణపాఠం చెప్పాలన్నదే ఉద్దేశమని అఖిలపక్ష సమావేశంలో ప్రతిప క్షాలు అభిప్రాయాలు వ్యక్తం చేసినట్లు సంబంధిత వర్గాలు తెలియజేశాయి. సైనికవర్గాల ధైర్యసాహసాలను రాజకీయపార్టీల నాయకులు సమావేశంలో ప్రశంసిం చారు. వివిధ పార్టీల నాయకులు అడిగిన అనేక ప్రశ్న లకురాజ్‌నాథ్‌సింగ్‌సమాధానాలుచెప్పారు. ''ఈ సంక్షోభ సమయంలో మేం ప్రభుత్వపక్షాననిలబడి పూర్తి మద్దతు ఇస్తున్నాం'' అని కాంగ్రెస్‌పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లి కార్జునఖర్గే సమావేశం అనంతరం పాత్రికేయులతో చెప్పారు. దేశ ఐక్యతను, సమగ్రతను, సార్వభౌమత్వర క్షణను ఈ సమావేశంలో ప్రతిపక్షాలు ఉద్ఘాటించాయి. ప్రస్తుతం ఈ విషయం గురించి ఎక్కువ వివరాలు చెప్ప డానికి రాజ్‌నాథ్‌సింగ్ తిరస్కరించారు. ''ఇది చాలా సున్నితమైన, అత్యంత కీలకమైన, విలువైన సమయం, దేశ ప్రయోజనాలరీత్యా సమాచారాన్ని ఎక్కువగా బహి ర్గతం చేయకూడదు, వివరణాత్మకమైన ప్రశ్నలు అడగ వద్దు, ఎందుకంటే రక్షణకు సంబంధించిన రహ స్యాలుచాలాఉంటాయి''అని రక్షణమంత్రి చెప్పారని ఖర్గే పాత్రికేయులతో అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ సమావేశానికి హాజరుకాకపోవడం తమకు ఎంతో నిరాశ కలిగించిందని ఖర్గే అన్నారు. భారతదేశ యుద్ధ విమానాలను కూల్చివేశామని పాకిస్థాన్ అంతర్జా తీయస్థాయిలో ప్రచారం చేసుకుంటున్నదని, ఈ విధ మైన ప్రచారాన్ని ప్రభుత్వం ఎందుకు ప్రతిఘటించడంలే దని ఆశ్చర్యం వ్యక్తం చేశారు. పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరెణ్ రిజిజు మాట్లాడుతూ, ''నిర్మాణాత్మకంగా చర్చలు జరిగాయి, పరిస్థితి తీవ్రతకు అనుగుణంగా ఒక ఉత్కంఠ వాతావరణంలో సమావేశం జరిగింది, ఆపరే షన్ సిందూర్ గురించిన వివరాలను రక్షణమంత్రి అన్ని పార్టీల నాయకులకు చెప్పారు, ప్రతిపార్టీ నాయకుడు చాలా బాధ్యతాయుతంగా, పరిణతితో, దేశంలో ఉత్పన్న మైన ప్రధాన సవాలును దృష్టిలో ఉంచుకుని మాట్లా డారు, నాయకులు అందరూ పార్టీలకు అతీతంగా చెప్పిన విషయం ఒక్కటే, ఈ కీలక సమసయంలో ఎలాంటి రాజకీయాలకు తావులేదని స్పష్టంగా చెప్పారు, పార్టీల నాయకులు అందరూ మన భారత సాయుధ బల గాలకు అభినందనలు తెలియజేశారు, ప్రభుత్వానికి పూర్తి మద్దతు తెలియజేశారు, ఎక్కడా ఎవ్వరూ అస మ్మతి తెలియజేయలేదు'' అని రిజిజు చెప్పారు. దేశ భద్రత గురించి నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. కాంగ్రెస్, ఎఐఎంఐఎం, తృణమూల్ కాంగ్రెస్, డిఎంకె, బిజెడి, జనతాదళ్(యునైటెడ్) పార్టీల నాయకులు ప్రభు త్వానికి తమ పూర్తి సహకారాన్ని తెలియజేశారు. జాతీయ భద్రతే ప్రధాన ఎజెండా అని వారు స్పష్టం చేశారు. రాహుల్‌గాంధీ పాత్రికేయులతో మాట్లాడుతూ, కొన్ని విషయాలను ప్రస్తావించలేదని, ఈ సమయంలో కేవలం ప్రభుత్వానికి మద్దతు మాత్రమే తెలియజేశామ న్నారు. ఉగ్రవాదులకు ఆశ్రయం ఇస్తున్న ప్రాంతాలపై దాడులు చేశామని మాత్రమే ప్రభుత్వం చెప్పిందన్నారు. ప్రజల భద్రతకు, ప్రత్యేకించి సరిహద్దుప్రాంత ప్రజల భద్రతకుతగిన చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి చెప్పా రన్నారు. అదేవిధంగా ఎఐఎంఐఎం నాయకుడు అసదు ద్దీన్ ఓవైసీ భారత సాయుధ బలగాల శక్తిసామర్థ్యాలను కొనియాడారు. లష్కరే తోయిబా ఉగ్రవాద సంస్థ తర పున కార్యకలాపాలు నిర్వహిస్తున్న ద రెసిస్టెన్స్ ఫ్రంట్‌ను నిషేధించాల్సిన అవసరం ఉందని అన్నారు. దీనికి వ్యతి రేకంగా ప్రచారం ప్రారంభించాలని, ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి ద రెసిస్టెంట్ ఫ్రంట్‌ను ఉగ్రవాదసం స్థగా ప్రకటించాలని, టిఆర్‌ఎఫ్‌ను ఉగ్రవాద సంస్థగా ప్రకటించేందుకు అమెరికాను కూడా అడగాలని, దీనిని విదేశీ ఉగ్రవాద సంస్థగా ప్రకటించాలని ఒవైసీ అన్నారు. బిజెడి నాయకుడు సస్మిత్‌పాత్రా కూడా భారత సైనికు లకు శాల్యూట్ చెప్పారు. పాకిస్థాన్‌కు వ్యతిరేకంగా ఉగ్ర వాదంపై జరుగుతున్న పోరాటంలో తామంతా ఐక్యంగా ఉన్నామన్నారు. హోంమంత్రి అమిత్ షా, ఆర్థికమంత్రి నిర్మలాసీతారామన్, విదేశీ వ్యవహారాలమంత్రి ఎస్.జైశంకర్, బిజెపి జాతీయ అధ్యక్షుడు జె.పి. నడ్డా తదితరులు సమావేశంలో పాల్గొన్నారు. ఇంతకుముందు ఏప్రిల్ 24న కేంద్ర ప్రభుత్వం అఖిలపక్ష సమావేశం నిర్వహించి సరిహద్దుల్లో పరిస్థితులను వివరించింది.

### పార్లమెంటు ప్రత్యేక సమావేశం నిర్వహించాలి: రాహుల్‌గాంధీ

పార్లమెంటు ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చే యాలని లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీ కోరారు. సిపిఐ(ఎం) నాయకుడు జాన్ బ్రిట్టస్ కూడా అదే డిమాండ్ చేశారు. ప్రత్యేక పార్లమెంటు సమావేశం నిర్వహిస్తే యావత్ భారతజాతి ఐక్యతా సందేశాన్ని ప్రపంచానికి చాటి చెప్పినట్లవుతుందని, ప్రపంచానికి ఒక మంచి సందేశం వెళుతుందని రాహుల్‌గాంధీ చెప్పా రని కాంగ్రెస్‌పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లిఖార్జునఖర్గే అన్నారు. అఖిలపక్ష సమావేశానంతరం ఖర్గే పాత్రికే యులతో మాట్లాడుతూ, ప్రధానమంత్రి ఈ సమావేశా నికి రాకపోవడం తమకు నిరాశ కలిగించిందన్నారు. ప్రధానమంత్రి ఈ సమావేశంలో పాల్గొని స్వయంగా ఈ యుద్ధ సమాచారం చెప్పి ఉంటే ఎంతో బాగుండేద న్నారు. ఎక్కడెక్కడ దాడులు జరిగాయన్న వివరాలు మాత్రమే సమావేశంలో చెప్పారని, భద్రతా కారణాలు న్నాయన్నారు.''మీరు ముందుకు వెళ్ళండి, నిర్ణయం తీసుకోండి, మేం మీ వెంట ఉన్నాం'' అని తాము చెప్పా మన్నారు. సాయుధ బలగాలకు పూర్తి అధికారాలు ఇచ్చామని ప్రధానమంత్రి ఇప్పటికే ప్రకటించారని గుర్తు చేశారు.

## పెంచింది.. పాకిస్థానే.. (మొదటి పేజీ తరువాయి)

పునరుద్ఘాటించారు. గురువారంనాడు న్యూఢిల్లీలో ప్రత్యేకంగా మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో కల్నల్ సోఫియా ఖురేషీ, వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్‌లతో కలిసి ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. ఆపరేషన్ సిందూర్ అనేది భారతదేశంవైపు నుండి ఎలాంటి యుద్ధ కవ్వింపు చర్య కాదని, పాకిస్థాన్ పౌరులు, పాకిస్థాన్ సైన్యం జోలికి వెళ్ళకుండా ఉగ్రవాదస్థావ రాలను లక్ష్యంగా చేసుకుని ధ్వంసం చేశామని మిస్రి స్పష్టం చేశారు.పహల్గామ్‌లో ఉగ్రవాదులు చేసిన దాడికి ప్రతిచర్యగానే ఆపరేషన్ సిందూర్‌ను భారత సాయుధబలగాలు చేపట్టాయని చెప్పారు. పహల్గా మ్‌లో అమాయకులైన సామాన్య ప్రజలపై చేసిన దాడిని మొట్టమొదట పాకిస్థాన్ ప్రారంభించిన ఉద్రిక్త చర్యగా, యుద్ధ కవ్వింపుచర్యగా భారతదేశం పరిగ ణించిందని అన్నారు. పాకిస్థాన్ గనుక ఇదేవిధంగా ఉద్రిక్తతలు పెంచి యుద్ధ కవ్వింపు చర్యలకు పాల్ప డితే భారతదేశం నిర్ణయాత్మకంగా వ్యవహరిస్తుందని, అందువల్ల పూర్తిగా అందుకు పాకిస్థాన్ ప్రభుత్వమే బాధ్యత వహించాలని మిస్రి హెచ్చరిక జారీ చేశారు. ''ఒకవేళ పాకిస్థాన్ తదుపరి మరోసారి ఉద్రిక్తతలు రెచ్చగొట్టేందుకు దాడులు చేస్తే అందుకు తగ్గట్టుగానే సమాధానం చెబుతాం'' అన్నారు. భారత యుద్ధ విమానాలను కూల్చివేశామని పాకిస్థాన్ చెప్పడాన్ని ఆయన ఖండించారు. అంతర్జాతీయ మీడియాద్వారా పాకిస్థాన్ దుష్ప్రచారం చేస్తోందని విమర్శించారు. పాకిస్థాన్ ఆక్రమిత జమ్మూ కశ్మీరులోని నీలం–జీలం డ్యామ్‌ను భారత్ లక్ష్యంగా చేసుకుందని చెప్పడం పచ్చి అబద్ధమని ఆయన అన్నారు. భారతదేశం ఆపరే షన్ సిందూర్ ద్వారా ఉగ్రవాదుల మౌలిక సదుపా యాలపై మాత్రమే దాడులు చేసి వాటిని ధ్వంసం చేసిందన్నారు. భారత్ దాడుల్లో హతులైన ఉగ్రవాదు లకు ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు చేశా రని, ఇది బహుశా పాకిస్థాన్ దేశంలో ఒక ఆచారంగా ఎంతోకాలంగా కొనసాగుతోందని, ఇవన్నీ అవివే కంతో చేసే అర్థరహితమైన చర్యలని విమర్శించారు. భారత్ సరిహద్దుల్లోకి ఉగ్రవాదాన్ని రవాణా చేస్తున్న పాకిస్థాన్‌కు దీటుగా సమాధానం చెప్పేందుకే ఉగ్ర వాద లక్ష్యాలను తాము ధ్వంసం చేశామన్నారు. ఉగ్ర వాదులకు శిక్షణ ఇచ్చేందుకు ప్రార్థనాస్థలాలను పాకి స్థాన్ దుర్వినియోగం చేస్తోందన్నారు.ప్రార్థనాస్థలా లను ఉగ్రవాద శిక్షణాకేంద్రాలుగా ఉపయోగించు కుంటూ ప్రపంచాన్ని పాకిస్థాన్ మభ్యపెడుతోందని విమర్శించారు.


### ప్రపంచ ఉగ్రవాదానికి పాకిస్థాన్ మూలకేంద్రం

పాకిస్థాన్ బుధవారంనాడు జమ్మూ కశ్మీరులోని పూంచ్ ప్రాంతంలో సిక్కు మతస్థులను లక్ష్యంగా చేసుకుని దాడులు చేసిందని, గురుద్వారాపై జరిగిన దాడిలో ముగ్గురు సిక్కుమతస్థులు మరణించారని మిస్రి చెప్పారు. ప్రపంచ ఉగ్రవాదానికి పాకిస్థాన్ మూలకేంద్రంగా మారిందన్నారు. ఐక్యరాజ్యసమితి నిషేధించిన ఉగ్రవాద సంస్థలకు పాకిస్థాన్ ఆశ్రయం ఇచ్చి వారిని పెంచి పోషిస్తోందని, వారి మంత్రే ఈ విషయాన్ని స్వయంగా ఇటీవల అంగీకరించారని మిస్రి గుర్తుచేశారు. ''ఒసామా బిన్ లాడెన్‌ను ఒక అమరజీవిగా, వీరుడుగా పాకిస్థాన్ అభివర్ణించింది, ఈ విషయాన్ని నేను ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు, ఐక్యరాజ్యసమితి నిషేధించిన ఉగ్రవాదసంస్థల జాబితాలో ఉన్న వారంతా పాకిస్థాన్‌లోనే తలదాచు కుంటున్నారు, అనేక దేశాల ఉగ్రవాదులు ఆ దేశంలో తలదాచుకుని కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు, గడ చిన కొద్దిరోజులుగా జరగుతున్న పరిణామాలను గమ నిస్తే వారి రక్షణమంత్రి, మాజీ విదేశాంగమంత్రి ఈ విధంగా ఉగ్రవాద గ్రూపులను పెంచిపోషిస్తున్న విష యాన్ని అంగీకరించారు కదా, అదేవిధంగా సింధు నదీ జలాల ఒప్పందాన్ని కూడా భారత్ ఉల్లంఘించ లేదు, దీర్ఘకాలంగా ఆ ఒప్పందాన్ని భారతదేశం గౌర విస్తూ వస్తోంది, ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా ఈ ఒప్పందంలో మార్పులు చేర్పులు చేయాల్సిన అవ సరాన్ని భారత్ కోరుతున్నది, ఈ ఒప్పందం ముగి సింది, దీనిలో కొన్ని మౌలికమైన మార్పులు చేయాల్సి ఉంది అని ఆయన చెప్పారు. గడచిన 65 సంవత్సరా లుగా సింధునదీ జలాల ఒప్పందాన్ని భారతదేశం కొనసాగిస్తోంది, రెండు దేశాలమధ్యా యుద్ధాలు జరి గినాగానీ దానిజోలికి వెళ్ళలేదు, కానీ అదేసమ యంలో పాకిస్థాన్ మాత్రం భారతదేశ న్యాయబద్ధ మైన నదీజలాల హక్కులను కూడా అడ్డుకుంది, 1950 దశకంలో, 1960వ దశకంలో చేసిన ఒప్పందం ఇది, ఈనాటు సాంకేతికంగా చాలా మార్పులు వచ్చాయి, వాటిని పరిగణనలోకి తీసుకుని ఒప్పందంలో మార్పులు చేయాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. లాహోర్‌లో గగపతల రక్షణ వ్యవస్థను భారతదేశం దాడిచేసి ధ్వంసం చేయ డాన్ని కల్నల్ సోఫియా, వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్‌లు ప్రస్తావించి మాట్లాడారు. ఉత్తర,పశ్చిమ భార తదేశప్రాంతాలలో పాకిస్థాన్ వరుస క్షిపణి దాడులను దీటుగా ఎదుర్కోవడంకోసమే ప్రతిదాడులు చేశామని చెప్పారు. ఈ ఏడాది మే ఏడు, ఎనిమిది తేదీలలో పాకి స్థాన్ ఉత్తర,పశ్చిమ భారతదేశప్రాంతాలలో అనేక సైనిక లక్ష్యాలపై దాడులకు ప్రయత్నం చేసింది, ఆ దాడులను భారత్ సమర్థవంతంగా తిప్పికొట్టిందని వారు చెప్పారు. అవంతిపు, శ్రీనగర్, జమ్మూ, పఠాన్ కోట్, అమృత్‌సర్, కపూర్తలా, జలంధర్, లూధి యానా, అదంపూర్, భటిండా, చండీగఢ్, నాల్, ఫలోదీ, ఉత్తర్లై, భుజ్ తదితర ప్రాంతాలపై డ్రోన్లు, క్షిప ణుల దాడులు చేసిందన్నారు.

## శత్రువులు ఉగ్రవాదులే (మొదటి పేజీ తరువాయి)

సమస్యలు వస్తాయని, యుద్ధం అంతిమ పరిష్కారం కాదని స్పష్టం చేసింది. సిపిఐ జాతీయ కార్యదర్శివర్గం గురువారంనాడు ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేసింది. ''ఆపరేషన్ సిందూర్ పూర్వరంగంలో తలెత్తిన పరిస్థితిపట్ల భారత కమ్యూనిస్టుపార్టీ తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నది. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా భారతజాతి చేస్తున్న పోరాటానికి సిపిఐ ధృఢంగా కట్టుబడి ఉంది, ఇలాంటి క్లిష్టపరిస్థితుల్లో వచ్చే ప్రతిస్పందనలు అనివార్యంగా దేశ ఐక్యతను, బాధ్యతను, ప్రజాస్వామ్య సమ్మిళితత్వాన్ని ప్రతిబింబిస్తాయి.సరిహద్దుల్లో విచక్ష ణారహితగా జరుగుతున్న కాల్పులను మేం తీవ్రంగా ఖండిస్తున్నాం, ప్రత్యేకించి పూంఛ్ ప్రాంతంలో పౌరుల మరణాలు కలచివేశాయి. బాధిత కుటుంబాలకు సిపిఐ ప్రగాఢ సంతా పాన్ని తెలియజేస్తున్నది, ఈ కాల్పుల్లో నష్టపోయిన కుటుంబాలకు పార్టీ తన సంఘీభావం ప్రకటిస్తున్నది. ఆపరేషన్ సిందూర్ తర్వాత, ఏకాభిప్రాయసాధనకోసం,ఉగ్రవాదానికి వ్యతి రేకంగా సమష్టితత్వాన్ని ప్రకటిస్తూ ఒక తీర్మానం చేసేందుకు అఖిలపక్ష సమావేశం ఏర్పా టుచేయాలని పిలుపు ఇచ్చిన మొట్టమొదటిపార్టీ భారత కమ్యూనిస్టుపార్టీయే. ఐనప్పటికీ కూడా ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈ అఖిలపక్ష సమావేశానికి హాజరుకాకపోవడం విచా రకరం. అదేవిధంగా సిపిఐతోపాటు జమ్మూ–కశ్మీర్ కేంద్రంగా పనిచేసే రాజకీయపార్టీ లను, ఈశాన్యప్రాంతాలకు చెందిన పార్టీలను ఈ సమావేశం నుండి మినహాయించారు. కేవలం ఐదుగురులోపు లేదా ఐదుగురు ఎంపీలు మాత్రమే ఉన్నారన్న ఏకపక్ష కారణంగా ఈ పార్టీలను అఖిలపక్ష సమావేశానికి పిలవకుండా మినహాయించడం కూడా ఎంతో విచా రకరమైన విషయం. వాస్తవానికి ఒకేఒక్క ఎంపీ పార్లమెంటులో ప్రాతినిధ్యం వహించినా గానీ వారిని అఖిలపక్ష సమావేశానికి ఆహ్వానించాలి. ఇలాంటి సమయాల్లో జాతీయ భద్రతా చర్చలలో అన్ని వర్గాలకు చెందినవారి అభిప్రాయాలను ఐక్యతా సాధనకోసం సమీ కరించాల్సి ఉంటుంది. సవాలు ఎదురైన ఈ సమయంలో ఐక్యత,లౌకికతత్వం,దేశ ప్రజా స్వామ్యస్ఫూర్తి మాత్రమే మనదేశానికి అతిపెద్ద తరగని ఆస్తి అని భారత కమ్యూనిస్టుపార్టీ పునరుద్ఘాటిస్తున్నది. సిపిఐ శాంతికి, జాతీయ ఐక్యతకు కట్టుబడి ఉంది. అదేవిధంగా ఉగ్ర వాదానికి, అన్ని రకాల విద్వేషాలకు వ్యతిరేకంగా ఐక్యపోరాటానికి కట్టుబడి ఉంది. ఈ పరి స్థితిని మతంతో ముడిపెట్టేందుకు చేస్తున్న ప్రయత్నాలపట్ల సిపిఐ తీవ్రంగా కలత చెందుతు న్నది. ప్రత్యేకించి సోషల్ మీడియాలో జాతీయవాదం పేరుతో మైనారిటీ వర్గాలను లక్ష్యంగా చేసుకుంటున్నారు. ఈ విధమైన చర్యలు భారతదేశ ఐక్యతను బలహీనపరు స్తాయి. ఉగ్రవాదశక్తులకు దేశంలో విభజనలు తీసుకురావడానికి అవకాశం ఇచ్చినట్లవు తుంది. ఈ విధమైన శక్తులకు వ్యతిరేకంగా చర్యలు తీసుకోవడానికి కేంద్ర ప్రభుత్వం చాలా అప్రమత్తంగా జాగరుకతతో వ్యవహరిస్తుందని సిపిఐ భావిస్తున్నది'' అని పార్టీ జాతీయ కార్యదర్శివర్గం తన ప్రకటనలో పేర్కొంది.

## బ్రెజిల్ మాజీ అధ్యక్షుడు బోల్సెనారో ప్రతిన!



**బ్రెసిలియా :** వందలాదిమంది తన అనుచరులకు క్షమాభిక్ష ప్రసాదించాలని కోరుతూ బ్రెజిల్ మాజీ అధ్యక్షుడు జైల్ బోల్సెనారో డిమాండ్ చేశారు. తన డిమాండ్ నెరవే రేదాకా ప్రజలమధ్యే ఉంటూ ప్రభుత్వానికి వ్యతిరే కంగా పోరాటం కొనసాగిస్తానని ప్రతిజ్ఞ చేశారు. 2023లో ఎన్నికల సందర్భంగా వందలాదిమంది బోల్సెనారో అనుచరులు ప్రభుత్వ భవంతులపై దాడులు చేశారు. ఎన్నికల ఫలితాలను వ్యతిరేకిస్తూ తిరుగుబాటు చేశారు. వారంతా ఇప్పుడు జైళ్ళల్లో ఉన్నారు. వారికి క్షమాభిక్ష ప్రసాదించాలని బోల్సె నారో పోరాటం చేస్తున్నారు. 2022లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో వర్కర్స్‌పార్టీ నాయకుడు లూయిజ్ ఇనాసియో లులా డసిల్వా విజయం సాధించారు. అప్పటివరకూ ప్రధానమంత్రిగా ఉన్న బోల్సెనారో ఈ అపజయాన్ని తట్టుకోలేకపోయారు. జనవరి 8వ తేదీన వేలాదిమంది ఆయన అనుచ రులు ఈ ఎన్నికల ఫలితాలను వ్యతిరేకిస్తూ తిరుగు బాటు చేశారు. ప్రజాతీర్పును వ్యతిరేకించడంతో న్యాయస్థానం బోల్సెనారోపై 2030 వరకూ ఎన్ని కల్లో పోటీ చేయకుండా నిషేధం విధించింది. దేశంపై కుట్రచేశారన్న ఆరోపణలను బోల్సెనారో ఎదుర్కొంటున్నారు. నేరం రుజువైతే ఆయనకు దాదాపు 40 సంవత్సరాలు జైలుశిక్ష పడే అవకాశా లుంటాయి.



# జనరల్
STATE & REGIONAL NEWS

## రైలులో పిస్టల్స్ స్మగ్లింగ్

8 పిస్టల్స్-16 మ్యాగజైన్లు స్వాధీనం



ప్రజాపక్షం/హైదరాబాద్: రైలులో పిస్టల్స్ (తుపాకుల) అక్రమ రవాణా గుట్టును రైల్వే పోలీసు ప్రొటెక్షన్ ఫోర్స్ (ఆర్‌పిఎఫ్) పోలీసులు రట్టు చేశారు. ఈమేరకు ఎనిమది పిస్టల్స్‌తో పాటు 16 మ్యాగ్‌జైన్లను స్వాధీనం చేసుకున్నట్లు దక్షిణ మధ్య రైల్వే చీఫ్ పిఆర్‌ఒ శ్రీధర్ ఒక ప్రటకనలో తెలిపారు. ఈమేరకు దేశవ్యాప్తంగా రైళ్లలో ఆర్‌పిఎఫ్ నిఘా పెంచి తనిఖీలు చేయాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీచేశారని పేర్కొన్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. బదర్‌పూర్ నుంచి అగర్తలా వెళ్తున్న త్రిపుర సుందరి ఎక్స్‌ప్రెస్ రైలు (14620 యూపి)లో జనరల్ కోచ్‌లో రెండు బ్యాగ్‌లు అనుమానాస్పద స్థితిలో ఉన్నాయి. సమాచారం అందుకున్న వెంటనే ఆర్‌పిఎఫ్ అధికారులు రంగంలోకి దిగి రైలును తనిఖీ చేశారు. జనరల్ కోచ్ పై బెర్త్‌లో ఉన్న అనుమానాస్పద రెండు బ్యాగ్‌లను తనిఖీ చేయగా అందులో ఎనిమిది పిస్టల్స్, 16 మ్యాగ్‌జైన్లు ఉన్నాయి. వీటిని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. దీంతో అప్రమత్తమైన ఆర్‌పిఎఫ్ అధికారులు అన్ని రైళ్లలో తనిఖీలు ముమ్మరం చేయాలని ఆదేశించారు.

# ఉగ్రవాదాన్ని తుదముట్టించాల్సిందే

పోరుకు సంపూర్ణ మద్దతు

కమ్యూనిజానికి ప్రత్యామ్నాయం లేదు

ఈర్లపుడి సభలో కూనంనేని



ప్రజాపక్షం/ఖమ్మం : ఉగ్రవాదం దేశానికి ప్రమాదమని అది ఏ రూపంలో ఉన్నా ఉగ్రవాదాన్ని తుదముట్టించాల్సిందేనని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసనసభ్యుడు కూనంనేని సాంబశివరావు తెలిపారు. ఉగ్రవాదంపై పోరుకు భారత కమ్యూనిస్టు పార్టీ అన్నివిధాలా సహకరిస్తుందని ఆయన స్పష్టం చేశారు. పాక్ ఉగ్రవాదాన్ని ప్రోత్సహించడమే కాకుండా కవ్వింపు చర్యలకు పాల్పడడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని ఆయన తెలిపారు. భారత కమ్యూనిస్టు పార్టీ శత వసంత సంబురాల్లో భాగంగా గురువారం రఘునాథపాలెం మండల పరిధిలోని ఈర్లపుడిలో భారత కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో బహిరంగ సభ నిర్వహించారు. సభకు ముందు గ్రామంలో భారీ ప్రదర్శన నిర్వహించారు. అరుణ పతాకాన్ని సిపిఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు ఆవిష్కరించారు. మండల కార్యదర్శి శాఖమూరి శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన సభలో కూనంనేని మాట్లాడుతూ దేశంలో ఆర్థిక అంతరాలు పెరిగిపోతున్నాయని, సంపద కొందరి చేతుల్లో పోగుపడుతుందన్నారు. భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత గడిచిన రెండు దశాబ్దాలలో సంపన్నుల సంఖ్య గణనీయంగా పెరగగా, దారిద్ర్యరేఖకు దిగువన జీవించే వారి సంఖ్య క్రమేపి పెరుగుతూ వచ్చిందన్నారు. కుటుంబ అవసరాలకు కనీసం ఖర్చు చేయలేని ఆర్థిక ఇబ్బందులు ఉన్న కుటుంబాల సంఖ్య పెరగడం ఇబ్బందికరమన్నారు. మతం మాటున కర్మ సిద్ధాంతాన్ని తీసుకువస్తున్నారని, ఇది ప్రమాదకరమని సాంబశివరావు తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీల అమలు కోసం ప్రజలు ఎదురుచూస్తున్నారని, అదే పరిస్థితుల్లో రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని సైతం పరిగణలోకి తీసుకుంటున్నారని ఆయన తెలిపారు. ప్రపంచంలో కమ్యూనిజానికి ప్రత్యామ్నాయం మరో సిద్ధాంతం లేదని ఆయన తెలిపారు. వందేళ్ల సుదీర్ఘ పోరాటంలో అనేక విజయాలను సాధించడం జరిగిందని పేదల పక్షాన నిరంతరం నికరంగా పోరాడేది ఎర్ర జెండా మాత్రమేనన్నారు. స్వాతంత్ర్య సమరంలోనూ సాయుధ తెలంగాణ పోరాటంలోనూ భారత కమ్యూనిస్టు పార్టీ వీరోచిత పాత్ర పోషించిందని, నాటి పోరాట ఘట్టాలను నేటి తరాలకు తెలియజేసేందుకు శతవసంత సభలను నిర్వహిస్తున్నామన్నారు. కమ్యూనిస్టు పార్టీ లేకుంటే హక్కులు సాధించబడేవి కావని యువజన విద్యార్థి కార్మిక, కర్షక, మహిళా హక్కుల కోసం, సమస్యల పరిష్కారం కోసం ఎర్ర జెండా నిరంతరం పోరాడుతుందన్నారు. సమాజాన్ని మార్చేది, మార్చగలిగేది ఎర్ర జెండా మాత్రమేనని కూనంనేని తెలిపారు. ఎన్నికలు కమ్యూనిస్టు పార్టీ నిర్మాణ క్రమంలో ఒక భాగం మాత్రమేనని, ప్రజా సమస్యల పరిష్కారానికి తమ పోరాటం నిరంతరం కొనసాగుతుందన్నారు. ఈ సభలో సిపిఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్, రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ మహ్మద్ మౌలానా తదితరులు ప్రసంగించగా రాష్ట్ర సమితి సభ్యులు జమ్ముల జితేందర్‌రెడ్డి, ఎస్‌కె.జానిమియా, జిల్లా కార్యవర్గ సభ్యులు శింగు నర్సింహారావు, తాటి వెంకటేశ్వర్లు, అజ్మీర రామ్మూర్తి, పగడాల మల్లేష్, నాయకులు వరద నర్సింహారావు, బాగం ప్రసాద్, వెంకయ్య, బానోత్ రవి, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

### అగ్ని ప్రమాదంలో గుడిసెలు కాలిపోయిన

# బాధితులకు ప్రభుత్వం తక్షణ సాయం

సిపిఐ జాతీయ కార్యదర్శి

డాక్టర్ కె.నారాయణ



ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి/ఎల్‌బినగర్ : రంగారెడ్డి జిల్లా, అబ్దుల్లాపూర్‌మెట్టు మండలం కుంట్లూర్‌లోని రావినారాయణరెడ్డి ఫేస్ 3 కాలనీలో ఇటీవల అగ్ని ప్రమాదంలో గుడిసెలు దగ్ధమైన భాదిత కుటుంబలకు సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, సిపిఐ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆందోజు రవీంద్రచారిలతో కలిసి గురువారం సిపిఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె. నారాయణ ముఖ్య అతిథిగా పాల్గొని బాధిత కుటుంబాలను పరామర్శించి, తన సహకారంతో జీవన్ మిత్ర కిషోర్, విజయవాడ పుచ్చలపల్లి ట్రస్ట్ పాపులర్ షూ మార్ట్ వారి సహకారంతో తీసుకు వచ్చిన చెద్దర్లు, బకెట్లు, జగ్గులు, టవల్స్‌ను బాధితులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అగ్ని ప్రమాదంలో గుడిసెలు కాలిపోయి సర్వం కోల్పోయిన బాధితులకు రాష్ట్ర ప్రభుత్వం తక్షణ సాయం చేయాలని ప్రభుత్వాన్ని భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ డిమాండ్ చేశారు. రాష్ట్రంలో నిర్వహించే అందాల పోటీలపై ఉన్న శ్రద్ధ అగ్ని ప్రమాదంలో గూడు చెదిరిన నిరుపేదలపై లేకపోవడం బాధాకరమన్నారు. అందాల పోటీల్లో పాల్గొనేవారు కేవలం వారి అందాలను చూపించి పోతారని, అదే గుడిసెలు బూడిద సర్వం కోల్పోయిన బాధిత నిరుపేదలే తమకు ఓట్లు వేసి గెలిపించేవారని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గుర్తించాలని నారాయణ సూచించారు. రాష్ట్రంలో రేవంత్ రెడ్డి నిర్వహించే అందాల పోటీలకు ఖర్చు చేసే దాంట్లో 10 శాతం గుడిసె వాసులకు కేటాయిస్తే వారి బతుకులు మారుతాయని, కానీ ప్రస్తుతం రేవంత్ రెడ్డి వివరిస్తున్న తీరు అయినవారికి ఆకులో పెట్టి, కాని వారికి పళ్లెంలో పెట్టిన చందంగా ఉందని సిపిఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ ఎద్దేవ చేశారు.

ఇప్పటికైనా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించి ప్రభుత్వం నిర్వహించే అందాల పోటీలకు ముందే గుడిసెలు అగ్నికి ఆహుతై, సర్వం కోల్పోయిన వారిపై శ్రద్ధ చూపి తక్షణ సాయం అందించి ఆదుకోవాలని నారాయణ డిమాండ్ చేశారు. భూ పోరాటంలో భాగంగా భూదాన్ భూములను భూ మాఫియాదారులు ఈ భూములనుండి గూడు లేక గుడిసెలు వేసుకున్న పేదలను ఖాళీ చేయించేందుకు కుట్ర పన్నుతున్నారని ఆయన ఈ సందర్భంగా గుర్తుచేశారు. భూదాన్ భూములను భూదానం చేసే విధంగా ఎర్ర జెండాతోనే సాధ్యమైతుందని, గుడిసెలు వేసుకున్న ప్రతి గుడిసెకు ప్రభుత్వం ఇందిరమ్మ ఇల్లు కేటాయించి వారికి పట్టాలు అందించే విధంగా చొరవ చూపాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం సిపిఐ కార్యవర్గ సభ్యులు, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మాట్లాడుతూ బతుకుదెరువు కోసం పట్టణానికి వలస వచ్చిన పేదలు ఇంటి అద్దెలు చెల్లించలేక భూ పోరాటంలో గుడిసెలు వేసుకుని, తమకు ఇదే ఇల్లు.. ఇదే జీవితం అనుకొని జీవిస్తున్న గుడిసెలు అగ్నికి ఆహుతి కావడంతో పూర్తిగా సర్వం కోల్పోయి దిక్కు తోచని స్థితిలో బాధితులు ఉన్నారని అన్నారు.

బాధితులను తక్షణ సహాయం కింద ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు ముత్యాల యాదిరెడ్డి, పానుగంటి పర్వతాలు, ప్రజానాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి పల్లె నరసింహ, మాజీ కౌన్సిలర్ హరిసింగ్ నాయక్, గణేష్ నాయక్, కేతరాజు నరసింహ, వెంకన్న, సురేష్, వినోద్ పాల్గొన్నారు.

### విద్యార్థులకు భవిష్యత్

## మార్గదర్శకంగా నిలవాలి

మంత్రి పొన్నం ప్రభాకర్



ప్రజాపక్షం/హైదరాబాద్ : హాస్టల్ వెల్ఫేర్ అధికారులు విద్యార్థులలో ఆత్మ స్థయిర్యం పెంపొందిస్తూ, వారికి భవిష్యత్ మార్గదర్శకంగా నిలవాలని బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. సచివాలయంలో నూతనంగా నియామకమైన 132 మంది హాస్టల్ వెల్ఫేర్ ఆఫీర్స్‌కు నియామక పత్రాలను మంత్రి అందచేశారు. ఈ కార్యక్రమంలో బిసి సంక్షేమ శాఖ ముఖ్యకార్యదర్శి శ్రీధర్, కమిషనర్ బాల మాయాదేవి, గురుకుల కార్యదర్శి సైదులు, కార్పొరేషన్ చైర్మన్‌లు నూతి శ్రీకాంత్‌గౌడ్, మెట్టు సాయికుమార్, జైపాల్, జ్ఞానేశ్వర్, కాల్వ సుజాత, వీరయ్యలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ పిల్లల భవిష్యత్తు తీర్చిదిద్దడానికి ఇది ఆశ్రమని, తల్లిదండ్రుల లాగ పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దాలన్నారు. ఉపాధ్యాయ, డాక్టర్, జర్నలిజం, రాజకీయాలు, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్స్ వృత్తిలో ఒక గౌరవాన్ని సాధించుకుంటామన్నారు. 703 హాస్టల్‌లు ఉంటే ఖాళీల భర్తీ పూర్తి చేశామన్నారు. ప్రజాపాలన ప్రభుత్వంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో 60 వేలకుపైగా ఉద్యోగాలు భర్తీ చేశామన్నారు. అన్ని ప్రభుత్వ శాఖలలో ఉద్యోగాలు నియామకాలు చేస్తున్నామన్నారు. ప్రభుత్వ పాఠశాలలో మంచి ఫలితాలు వస్తున్నాయని, విద్యార్థుల సమస్యలు ఒక్కకటి నెరవేరస్తూ ముందుకు పోతున్నామని తెలిపారు. మెస్ చార్జీలు, కాస్మోటిక్ ఛార్జీలు పెంచామన్నారు. బలహీన వర్గాల శాఖ కుటుంబ గౌరవాన్ని పెంపొందించాలన్నారు. పెద్దలకే పరిమితం అయిన సన్న బియ్యం సామాన్యుడి వరకు ప్రభుత్వం అందిస్తుందన్నారు. బిసి సంక్షేమ శాఖ కార్యదర్శి శ్రీధర్ మాట్లాడుతూ చాలా ఏళ్ల తరువాత హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్స్ నియామకాలు జరిగాయన్నారు. హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్స్ ముందుగా అవగాహన చేసుకోవాలని సూచించారు.



## కార్మికుల హక్కుల రక్షణకు మే 20న సమ్మె

వైద్య ఆరోగ్యశాఖ కార్మికుల సమ్మె సన్నద్ధం కావాలి

ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షుడు ఎండి యూసుఫ్ పిలుపు

ప్రజాపక్షం/హైదరాబాద్ : ప్రభుత్వ ఆసుపత్రుల్లో కార్మిక యూనియన్లు లేకుండా చేసేందుకు కార్మిక చట్టాల మార్పుకు వ్యతిరేకంగా వైద్య ఆరోగ్య రంగంలో ఉన్నటువంటి కార్మికులందరూ ఈనెల 20న సమ్మెకు సన్నద్ధం కావాలని ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షుడు ఎండి యూసుఫ్ పిలుపునిచ్చారు. దేశంలో కరోనా మహమ్మారి ప్రబలినప్పుడు ప్రభుత్వాసుపత్రుల్లో పనిచేస్తున్న కార్మికులు దేవుళ్ళతో సమానం అని చెప్పి, వారిపై పూలు జల్లిన ప్రభుత్వాలు అనంతరం వారి సమస్యలను పట్టించుకోవడంలేదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. మే 20న తలపెట్టిన జాతీయ సార్వత్రిక సమ్మె సన్నాహక రాష్ట్ర సదస్సు వైద్య ఆరోగ్య సంఘాలు నాయకులు ఎం.నరసింహ (ఎఐటియుసి), ఫసీయుద్దీన్ (సిఐటియు) అధ్యక్షతన గురువారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగింది. ఈ సందర్భంగా ఎండి యూసుఫ్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రుల్లో పనిచేయుచున్న కార్మికులు శ్రమదోపిడీకి గురవుతున్నారని, కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలని, కార్మిక హక్కులు పరిరక్షించబడాలని, ఉద్యోగ భద్రత, పిఎఫ్ ఇఎస్ఐ సౌకర్యాలు సక్రమంగా అమలు చేయాలన్న డిమాండ్లతో ఈనెల 20న జరిగే సమ్మెలో కార్మికవర్గం పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి కుమార్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకు వస్తున్న నాలుగు లేబర్ కోడ్‌లతో గతంలో సాధించుకున్న హక్కులన్నీ కాలరాయనున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు ఎం సత్యనారాయణ రెడ్డి, ఎన్ హెచ్ ఎం కాంట్రాక్ట్ అండ్ ఔట్సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాలసుబ్రమణ్యం, యునైటెడ్ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు భూపాల్, ప్రధాన కార్యదర్శి యాదా నాయక్, భూలక్ష్మి, హసీనా బేగం, లక్ష్మీ బాయి, కిష్టమ్మ తదితరులు పాల్గొన్నారు.

# బ్యాంకర్లు మానవీయంగా వ్యవహరించాలి

రుణాలు ఇచ్చేందుకు

భయపడుతున్న బ్యాంకర్లు

మహిళా సంఘాల రుణాలకు

మేము గ్యారంటీ

98.5 శాతం రుణాల చెల్లింపు

ఒక రికార్డు : మంత్రి సీతక్క



ప్రజాపక్షం/హైదరాబాద్ : సూటు, బూట్లతో ఫ్యాషన్‌గా కనిపిస్తూ బ్యాంకులకు కన్నాలు వేస్తున్నారని,పెద్ద పెద్ద పారిశ్రామికవేత్తలు బ్యాంకులకు రుణాలు ఎగవేస్తున్నాయని పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు. కానీ స్వయం సహాయక సంఘాలు మాత్రం తీసుకున్న రుణాలను తిరిగి చెల్లిస్తున్నాయని, అయినప్పటికీ మహిళా సంఘాలకు రుణాలు ఇచ్చేందుకు బ్యాంకర్లు భయపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళా సంఘాలు తీసుకునే ప్రతి పైసాకు తామే గ్యారంటీగా ఉంటామని, నయా పైసా ఎన్‌పిఎ లేకుండా 100 శాతం రుణాలను మహిళా సంఘాలు చెల్లించే బాధ్యత తనదేనని బ్యాంకర్లకు హామీనిచ్చారు. హైదరాబాద్‌లోని జ్యోతిరావు పూలే ప్రజా భవన్‌లో 'సర్ప్ వార్షిక యాక్షన్ ప్లాన్ 2025–26' కార్యక్రమాన్ని మంత్రి ధనసరి అనసూయ సీతక్క జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా 'ఈ ఏడాది యాక్షన్ ప్లాన్'ను ఆవిష్కరించారు. సీతక్క మాట్లాడుతూ మహిళలకు రుణాలు ఇవ్వడంలో బ్యాంకర్లు మానవీయంగా వ్యవహరించాలని, అప్పుడే అనుకున్న లక్ష్యాలు నెరవేరుతాయన్నారు. మహిళలకు బ్యాంకులు ఇచ్చే రుణం పేదరిక నిర్మూలనపై ఒక రణంగా పనిచేస్తుందని అభిప్రాయపడ్డారు. పేదరిక నిర్మూలనలో బ్యాంకర్ల పాత్ర కీలకమన్నారు. మహిళా స్వయం సహాయక బృందాలు స్వయం ఉపాధి స్థాయి నుంచి సంపద సృష్టించే స్థాయికి ఎదిగాయని, పది మందికి ఉపాధి కల్పిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నాయని అభినందించారు. మహిళా సంఘాలు ప్రతి ఏటా తమ ఆర్థిక సామర్థ్యాన్ని పెంచుకుని ఎక్కువ మొత్తంలో రుణాలు తీసుకుంటున్నాయని, సిఎం రేవంత్ రెడ్డి మహిళా సంఘాల్లో కోటి మంది సభ్యులను చేర్చే లక్ష్యంగా, అందరినీ కోటీశ్వరులను చేసే లక్ష్యంగా పనిచేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వాలు, బ్యాంకర్లు స్వయం సహాయక సంఘాలకు అండగా నిలవాలని, అప్పుడే సమాజ అభివృద్ధి సాధ్య పడుతుందన్నారు. అభివృద్ధి చెందిన దేశాల్లో జిడిపిలో మహిళల భాగస్వామ్యం 40 శాతం అని, కానీ భారతదేశం లాంటి అభివృద్ధి చెందుతున్న దేశాలలో జిడిపిలో మహిళల భాగస్వామ్యం 18 శాతానికి పరిమితమైదని వివరించారు. అందుకే సంపద సృష్టిలో మహిళల పాత్ర పెంచేలా బ్యాంకర్లు, ప్రభుత్వం పనిచేయాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇంకా పేదరికం ఉండేందుకు ప్రధాన కారణమే వడ్డీలని, బ్యాంకులు రుణాలు ఇవ్వకపోతే, ప్రజలు వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తారని తెలిపారు. తాను విప్లవ సంఘంలో పనిచేసినప్పుడు మొదటి పోరాటం వడ్డీ వ్యాపారులపైనే చేశామని గుర్తు చేశారు. తీసుకున్న అప్పులకు వడ్డీలు చెల్లించలేక ఎస్‌టిలు భూములు రాసి ఇచ్చేవారని, ఏజెన్సీ ఏరియాలో వడ్డీలను భరించలేక ఎంతోమంది రైతులు భూములు కోల్పోయారని మంత్రి సీతక్క ఆవేదన వ్యక్తం చేశారు. వడ్డీ వ్యాపారుల వల్ల ఎక్కువగా నష్టపోయింది ఎస్‌టిలేనని అన్నారు. రుణాలను తిరిగి కట్టలేని మహిళా సభ్యులకు ప్రభుత్వం రెండు లక్షల 'లోన్ బీమా' తీసుకొచ్చిందని, లోన్ బీమా స్కీమ్ బ్యాంకులకు ధీమాగా నిలుస్తోందని చెప్పారు. మహిళా సంఘాలకు బ్యాంకర్లు ఇచ్చే రుణలు దేశ ప్రగతికి ఉపకరిస్తుందని, అందుకే బ్యాంకర్లు సహకారాన్ని మరింత విస్తరించాలన్నారు. 98.5 శాతం రుణాలను తిరిగి చెల్లించి రికార్డును సృష్టించారని అభినంధించారు. కాగా గత ఏడాది మహిళా సంఘాలకు రుణాలు ఇవ్వడంలో లక్ష్యాన్ని చేరుకున్న బ్యాంకర్లను మంత్రి సీతక్క ప్రత్యేకంగా సన్మానించారు. అలాగే రుణాలు తిరిగి చెల్లిస్తూ ఆర్థిక క్రమశిక్షణ ప్రదర్శిస్తున్న మహిళా స్వయం సహాయక సంఘాలను కూడా మంత్రి సత్కరించారు. ఈ కార్యక్రమంలో పిఆర్‌ఆర్ డి కార్యదర్శి లోకేష్ కుమార్, సర్ప సిఇఒ దివ్య దేవరాజన్, స్త్రీనిధి ఎండి విద్యాసాగర్‌రెడ్డి, మహిళా సంఘాల ప్రతినిధులు, బ్యాంకర్లు పాల్గొన్నారు.



### ప్రజా సంబంధాలు

## మెరుగుపరచుకోండి

కొత్త ఐపిఎస్‌లకు డిజిపి డాక్టర్ జితేందర్ దిశానిర్ధేశం

ప్రజాపక్షం/హైదరాబాద్ : విధి నిర్వహణలో రాణించేందుకు ప్రజా సంబంధాలను మెరుగుపరుచుకోవాలని రాష్ట్ర డిజిపి డాక్టర్ జితేందర్ అసిస్టెంట్ ఎస్‌పి( కొత్త ఐపిఎస్)లతో అన్నారు. రాష్ట్ర డిజిపి కార్యాలయంలో రాష్ట్రవ్యాప్తంగా పనిచేస్తున్న అసిస్టెంట్ ఎస్‌పిలు, శిక్షణలో ఉన్న అసిస్టెంట్ ఎస్‌పిల పనితీరును డిజిపి సమీక్షించారు. ఈ సందర్భంగా ఎఎస్‌పిలుగా వారు విధులు నిర్వహిస్తున్న ప్రాంతాల పరిస్థితులపై అడిగి తెలుసుకున్నారు. వివిధ ప్రాంతాల పరిస్థితులపై తనకు ఉన్న సంబంధాలను, అనుభవాన్ని ఎఎస్‌పిలతో పంచుకున్నారు. ఈ సందర్భంగా డిజిపి మాట్లాడుతూ.... విధినిర్వహణలో రాణించేందుకు ప్రజా సంబంధాలను మెరుగుపరుచుకోవాలని తద్వారా నేరాలకు సంబంధించిన సమాచారం, క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితులు తెలుసుకోవచ్చని డిజిపి అన్నారు. చట్ట పరిధిలో వివిధ శాఖల అధికారులతోనూ, ఉన్నతాధికారులతోనూ, సత్సంబంధాలను కలిగి ఉండాలని తద్వారా ఉత్తమ పోలీసు అధికారులుగా గుర్తింపు పొందవచ్చనీ తన అనుభవలను డిజిపి డాక్టర్ జితేందర్ వివరించారు. ఎఎస్పీలుగా విధులు నిర్వహిస్తున్న అధికారులు తమ ప్రాంతాల్లో ఉన్న ఆచారాలు, కట్టుబాట్లు గురించి తెలుసుకోవాలని హితవు చెప్పారు. పరిస్థితులకు అనుగుణంగా కొత్త కార్యక్రమాలను చేపడుతున్నప్పటికీ బేసిక్ పోలీసింగు ను మరవరాదన్నారు. ఇకపై ప్రతినెల ఎఎస్పీలతో సమీక్షా సమావేశాలు నిర్వహిస్తానని డీజీపి తెలిపారు. హత్యలు, ఆర్థిక నేరాలు జరుగుతున్న చోట జాగ్రత్త వహించాలన్నారు. మిస్ వరల్ కంటెస్టెంట్లకు పకడ్బందీగా బందోబస్తు ఏర్పాట్లు చేయాలని సూచించారు. సిసిటివి కెమెరాలను ఏర్పాటు చేసినట్లయితే నేరస్తులను సులువుగా గుర్తించే అవకాశం ఉంటుందని అన్నారు. శాంతి భద్రతల అడిషనల్ డిజిపి మహేష్ ఎం భగవత్, ఐజిపిలు చంద్రశేఖర్‌రెడ్డి, వి.సత్యనారాయణ, శాంతిభద్రతల ఎఐజి రమణ కుమార్ తదితరులు తమ అనుభవాలను తెలియజేశారు. అసిస్టెంట్ ఎస్‌పిలు బి చైతన్య , ఆర్ రాహుల్ రెడ్డి, కాజల్, అవినాష్ కుమార్, శివ ఉపాధ్యాయ, చేతం నితిన్, శుభం, పి.మౌనిక ,శేషాద్రిని రెడ్డి, వసుంధర యాదవ్, మానం బట్, రిత్విక్ సాయి, సాయికిరణ్ లు సమీక్ష సమావేశానికి హాజరయ్యారు.

# ఘనంగా వరల్డ్ రెడ్ క్రాస్ డే వేడుకలు



రెడ్‌క్రాస్ సేవలను కొనియాడిన

గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

ప్రజాపక్షం/హైదరాబాద్ : ప్రపంచ వ్యాప్తంగా రెడ్ క్రాస్ సొసైటీ ప్రజలకు అందిస్తున్న సేవలను తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ప్రశంసించారు. హైదరాబాద్‌లోని రాజ్‌భవన్‌లో గురువారం నిర్వహించిన ప్రపంచ రెడ్‌క్రాస్ డే 2025 (ప్రపంచ తలసేమియా దినోత్సవం) వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగిస్తూ.. ముఖ్యంగా రక్తదానం, ఆరోగ్య సేవలు, అత్యవసర సహాయ కార్యక్రమాల్లో రెడ్ క్రాస్ సంస్థ పాత్రను జిష్ణుదేవ్ వర్మ కొనియాడారు. ఈ ఏడాది ప్రపంచ రెడ్‌క్రాస్ దినోత్సవం ఇతివృత్తమైన 'మానవత్వం వైపు' పయనిస్తుందన్నారు. 1920లో ప్రారంభమైనప్పటి నుండి అచంచలమైన మానవతా సేవకు తెలంగాణ రాష్ట్ర శాఖకు చెందిన ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ (ఐఆర్‌సిఎస్)ని ప్రశంసించారు. బలహీన వర్గాలకు సేవ చేయడానికి , మానవ గౌరవాన్ని నిలబెట్టడానికి సమాజంలోని అన్ని వర్గాలలో స్వచ్ఛంద సేవ అవసరం పెరుగుతుందని కూడా ఆయన చెప్పారు. తెలంగాణలోని మొత్తం 33 జిల్లాల్లో 45,000 కంటే ఎక్కువ మంది సభ్యులతో, ఐఆర్‌సిఎస్ రక్తదాన కార్యక్రమాలు నిర్వహించడం, వైద్య, ఆరోగ్య సేవలను విస్తరించడం, అనాథాశ్రమాలు, వృద్ధుల సంరక్షణ గృహాలకు మద్దతు ఇవ్వడం, ప్రకృతి వైపరీత్యాల సమయంలో సకాలంలో సహాయం అందించడంలో కీలక పాత్ర పోషించిందన్నారు. రాష్ట్రంలోని మారుమూల ప్రాంతాలలో కూడా రెడ్ క్రాస్ మిషన్‌ను కొనసాగిస్తున్న జిల్లా చైర్‌పర్సన్‌లు, స్వచ్ఛంద సేవకుల అంకితభావ కృషిని గవర్నర్ ప్రశంసించారు. ప్రపంచ తలసేమియా దినోత్సవాన్ని పురస్కరించుకుని, మనుగడ కోసం క్రమం తప్పకుండా రక్త మార్పిడిపై ఆధారపడే యువ తలసేమియా యోధుల ధైర్యం, స్థితిస్థాపకతకు గవర్నర్ నివాళులర్పించారు. ఈ జన్యుపరమైన రుగ్మతతో బాధపడుతున్న వారికి అవగాహన , స్టెమ్ సెల్ దానాన్ని ప్రోత్సహించడం ద్వారా కుటుంబాలకు ఆశను కలిగించిన ధాత్రి సంస్థ కృషిని ఆయన ప్రశంసించారు. కరుణకు చిహ్నంగా, ఈ కార్యక్రమంలో పాల్గొన్న తలసేమియా రోగులకు గవర్నర్ వ్యక్తిగతంగా పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గవర్నర్ ప్రిన్సిపల్ సెక్రటరీ,ఐఆర్‌సిఎస్ తెలంగాణ రాష్ట్ర శాఖ జనరల్ సెక్రటరీ, కోశాధికారి ఎం. దాన కిషోర్, ఐఆర్‌సిఎస్ జిల్లా శాఖల చైర్మన్లు, రెడ్ క్రాస్ అధికారులు, రాజ్ భవన్ అధికారులు పాల్గొన్నారు.

### మాజీ ఎమ్మెల్యే బండారు రాజిరెడ్డి మృతి కాంగ్రెస్ సంతాపం

ప్రజాపక్షం / హైదరాబాద్ : ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే బండారు రాజిరెడ్డి మృతి పట్ల ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి, టిపిసిసి అధ్యక్షుడు బి.మహేష్‌కుమార్‌గౌడ్ సంతాపాన్ని, ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. కాంగ్రెస్ పార్టీకి, ఉప్పల్ నియోజకవర్గానికి రాజిరెడ్డి చేసిన సేవలను వారు వేర్వేరు సంతాప సందేశాలలో కొనియాడారు. కాంగ్రెస్ పార్టీ నాయకునిగా, కాప్రా మున్సిపాలిటీ చైర్మన్‌గా రాజిరెడ్డి ఎనలేని సేవలు చేశారని మహేష్‌కుమార్ గౌడ్ పేర్కొన్నారు. ఉప్పల్ ఎంఎల్‌ఏగా నియోజకవర్గ అభివృద్ధి కోసం కృషి చేశారన్నారు.

### నేడు రాష్ట్ర వ్యాప్తంగా సభలు, సెమినార్లు

ప్రజాపక్షం/హైదరాబాద్ : ఫాసిజానికి, సామ్రాజ్యవాద ధోరణులకు వ్యతిరేకంగా సిపిఐ(ఎం) ఆధ్వర్యం లో నేడు నిర్వహించనున్న సభ లు, సెమినార్లల్లో పార్టీ నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చింది. ఈమేరకు గురువారం సిపిఐ(ఎం) రాష్ట్ర కమిటీ ఓ ప్రకటన విడుదల చేసింది.


**గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్**
పటాన్‌చెరు & రామచంద్రాపురం సర్కిల్-22, శేరిలింగంపల్లి జోన్.

NIT No.Engg-02/GHMC/PTC-C-22/2025-26 షార్ట్ టెండర్ నోటీసు తేది: 07.05.2025

**పని పేరు:** వర్షా కాలం పని చేసేందుకు (3) మంది కార్మికుల నియామకం మరియు వర్షా కాలం పని చేసేందుకు (1) జెసిబిని నియమించడం. **అంచనా విలువ / ఇసివి :** రూ.113.00లక్షలు, **డౌన్‌లోడ్ ప్రారంభ తేది:** 09.05.2025న ఉ.10.30గం.ల నుండి, **బిడ్స్ స్వీకరణకు ఆఖరి తేది మరియు సమయం:** 15.05.2025న మ.3.00గం.ల వరకు. ఇ.ఇ **పేరు & చిరునామా:** ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, పటాన్‌చెరు సర్కిల్-22, ఫోన్ నం. 9154167952. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ అనగా https://www.tender.telangana.gov.in లో చూడవచ్చు.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, పటాన్‌చెరు సర్కిల్-22, ఎస్‌పిఎల్ జోన్, జిహెచ్‌ఎంసి.

DIPR R.O. No. : 1559-PP/CL/ADVT/1/2025-26, Date: 08-05-2025

**తెలంగాణ ప్రభుత్వం, అటవీ శాఖ**
జిల్లా అటవీ శాఖాధికారి వారి కార్యాలయం, మహబూబాబాద్.

లేఖ సంఖ్య: D.S.O.No.01/2025-26/TO టెండరు ప్రకటన తేది: 05.05.2025

మహబూబాబాద్ జిల్లాలో మహబూబాబాద్ డివిజన్‌లో 2025-26 సంవత్సరంలో మహబూబాబాద్ రేంజి పరిధిలో గల మహబూబాబాద్ బీట్ మరియు ఈదులపుసపల్లి సెక్షన్, కంపార్ట్మెంట్ 1207 లో వాచ్ టవర్ (Part-1) కట్టడానికి గాను నమోధిత కాంట్రక్టర్ / పని అనుభవం కలిగిన సంస్థలు మరియు వ్యక్తుల నుండి ఈ-టెండర్లు టెండర్లు ఆహ్వానించబడినవి. అటవీ ప్రాంతంలో వాచ్ టవర్ (Watch Tower) నిర్మించడానికి ప్రభుత్వం నిర్ణయించిన రేటు ఒక పరిమాణంకు గాను రూ. 10,00,000/-. ఇంతకన్నా తక్కువ శాతంకు (Percentage) కోడ్ చేసిన కాంట్రక్టర్ లకు మొదటి ప్రధాన్యత ఇవ్వబడును. టెండరు డాకుమెంట్లు దిగువ సంతకందారు నుండి పొందవచ్చును. టెండరు రుసుము రూ.2,000/- ఏదైనా జాతీయ గుర్తింపు పొందిన బ్యాంకు నుండి డి.డి. రూపంలో Forest Divisional Officer, Mahabubabad పేరున జమచేయవలెను. టెండరు డాక్యుమెంట్లు తేది. 12.05.2025 నుండి తేదీ. 19.05.2025 న మ. 12.00 గం.ల వరకు జారీచేయబడుతాయి. ఇ.ఎం.డి. రూ. 10,000/-తో పాటు టెండర్లు స్వీకరించుటకు చివరి తేదీ: 19.05.2025 న మ. 01.00 గం.ల వరకు, సీల్డు టెండరు తెరచుటకు తేదీ: 19.05.2025 న మ. 03.00 గం.లకు.

సం/- జిల్లా అటవీ శాఖాధికారి, మహబూబాబాద్.

DIPR R.O. No. : 1545-PP/CL/ADVT/1/2025-26, Date: 08-05-2025

**తెలంగాణ ప్రభుత్వం, రోడ్లు మరియు భవనాల శాఖ**

NIT No: 21/SE/Dy.EE/Tenders/2025-26 ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్రకటన తేది: 07.05.2025

దిగువ తెలిపిన పనులకు ''ఇ''-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫారం కింద ఆన్‌లైన్ టెండర్లను కోరడమైనది.

**క్ర.సం.1, పని పేరు:** యాదాద్రి భువనగిరి జిల్లాలో భువనగిరి సబ్ డివిజన్ కింద షార్ట్ టర్మ్ నిర్వహణ కాంట్రాక్ట్ (ఇన్‌టెన్సివ్ ప్యాచ్ వర్క్ / అత్యవసర మరమ్మతులు). **అంచనా విలువ:** రూ.95.00లక్షలు, **పనుల సంఖ్య:** 1 నెం.లు. **టెండర్ల స్వీకరణకు ఆఖరి తేది:** 19.05.2025న సా.4.00గం.ల వరకు, మరిన్ని వివరాల కొరకు ''ఇ'' ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ అనగా https://eprocure.gov.inలో చూడవచ్చు. ఇ-మెయిల్ ఐడి: seydrrnb@gmail.com

సం/- సూపరింటెండింగ్ ఇంజనీర్ (R&B) సర్కిల్ :: యాదాద్రి భువనగిరి

DIPR R.O. No. : 1578-PP/CL/ADVT/1/2025-26, Date: 08-05-2025

ప్రజాపక్షం
శుక్రవారం, మే 09

# సంభాషణలే పరిష్కార మార్గం

రెండు రోజుల క్రితం రెండు ముఖ్య పరిణామాలు చోటు చేసుకున్నాయి. ఆర్‌టిసి జెఎసితో ప్రభుత్వం చర్చలు జరపడంతో మొన్నటి బుధవారం నుంచే ప్రారంభం కావాల్సిన సమ్మెను వాయిదా వేసుకున్నారు. అలాగే ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి సీనియర్ ఐఎఎస్ అధికారులతో త్రిసభ్య కమిటీ నియమించి, వారం రోజుల్లో నివేదిక ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశించింది. దీంతో ఒక్కసారిగా కమ్ముకున్న సమ్మె మేఘాలు తాత్కాలికంగా వీడాయి. గత ప్రభుత్వం అరచేతిలో బెల్లం చూపించి మోచేతిని నాకించినట్లు వ్యవహరించింది. దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణ ప్రభుత్వోద్యోగులకు అత్యధిక ఫిట్‌మెంట్ ఇచ్చిన మాట వాస్తవమే. కానీ, రెండవ పిఆర్‌సి విషయంలో ఉద్యోగులతో ఒక ఆట ఆడుకున్నది. ఆపద మొక్కుల మాదిరిగా బిఆర్‌ఎస్ ప్రభుత్వ చివరి అంకంలో ఎన్నికల ముంగిట 2023 అక్టోబర్ మాసంలో పిఆర్‌సిని నియమించింది. ఇక ఆర్‌టిసి విషయంలో చెప్పనక్కరలేదు. ఆర్‌టిసి కార్మికులను అరిఘోస పెట్టారు. ఆర్‌టిసినే రద్దు చేసి పారేస్తామని ఘీంకరించారు.

వీటన్నిటిని మదిలో పెట్టుకొని నాటి ప్రతిపక్ష కాంగ్రెస్‌కు ఎన్నికల్లో అండగా నిలిచారు ఆర్‌టిసి, సింగరేణి కార్మికవర్గాలతో పాటు, ప్రభుత్వోద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులు కూడా. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన కొత్తలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా ఆర్‌టిసి కార్మికులు, ప్రభుత్వ ఉద్యోగులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి భరోసా కల్పించారు. ప్రభుత్వోద్యోగుల సమస్యల పరిష్కారానికి మంత్రివర్గ ఉపసంఘాన్ని గత ఏడాది నియమించినప్పటి నుంచి అక్టోబర్ నుంచి ఇప్పటి వరకు సమావేశం కాలేదని ఉద్యోగ సంఘాల బాధ. ఆర్‌టిసి కార్మికులు కూడా న్యాయబద్ధమైన తమ డిమాండ్‌లపై యాజమాన్యం ఉద్దేశ్యపూర్వకంగా శీతకన్ను ప్రదర్శిస్తుందని ఆవేదన. దీంతో ఆర్‌టిసి జెఎసి సమ్మె నోటీసు ఇవ్వగా, భారీ నిరసనకు ప్రభుత్వోద్యోగులు పూనుకున్నారు. గడువు ముంచుకొస్తున్న సమయంలోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆర్‌టిసి కార్మికులను సమ్మెకు పోవద్దని, ఇప్పుడిప్పుడే సంస్థ కుదురుకుంటుందని విజ్ఞప్తి చేశారు. సమ్మె నోటీసిచ్చిన జెఎసికి కార్మిక శాఖ నుంచి చర్చలకు పిలుపువచ్చినా, ఆర్‌టిసి యాజమాన్యం హాజరుకాకపోవడంతో నిష్ప్రయోజనంగా మారింది. మరో సభలో ప్రభుత్వోద్యోగ సంఘాలపై ఒకింత ఘాటుగా రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగాలేదని, నన్ను కోసి ఇచ్చినా ఎక్కువ ఆదాయం రాదని, అప్పు పుట్టడం లేదని ముఖ్యమంత్రి చేసిన వ్యాఖ్యలు, కాచుకొని కూర్చున్న ప్రతిపక్షాలకు అందిచ్చిన అవకాశంగా మారింది. వెంటనే బిఆర్‌ఎస్, బిజెపిలు విరుచుకుపడి ముఖ్యమంత్రి దిగిపోవాలని ఘోషించాయి. ముఖ్యమంత్రి వ్యాఖ్యల్లో గత ప్రభుత్వ నిర్వాకంతో రాష్ట్రం అప్పుల కుప్పగా మారి, ఆర్థిక వెసులుబాటు దక్కడం లేదనే ఆక్రోశం, ఆవేదన ఉన్నప్పటికీ, ఉద్యోగులను ప్రజల ముంగిట దోషులుగా నిలబెట్టినట్లుగా ఉందనే అభిప్రాయం వ్యక్తమైంది. వెంటనే మంత్రులు నష్ట నివారణ చర్యకు దిగడంతో పాటు, ముఖ్యమంత్రి ఆదేశాలతో సీనియర్ ఐఎఎస్‌లు నవీన్ మిత్తల్ నేతృత్వంలో లోకేశ్ కుమార్, కృష్ణ భాస్కర్‌లతో కమిటీ వేశారు. మరోవైపు కమ్యూనిస్టు పార్టీ చొరవతో ఆర్‌టిసి జెఎసి నాయకత్వంతో రవాణా మంత్రి చర్చలు జరిపి, సమస్యలను ముఖ్యమంత్రి వద్దకు తీసుకెళ్ళి త్వరితగతిన పరిష్కరించేందుకు హామీ ఇచ్చారు.

ఈ ప్రభుత్వం వచ్చాక ఉద్యోగులకు ఏమీ చేయలేదని కాదు. జిఒ 317 కింది ఇబ్బందులు పడిన ప్రభుత్వ ఉపాధ్యాయుల సమస్యను కొలిక్కి తెచ్చింది. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న బదిలీలను పూర్తి చేసింది. పెండింగ్‌లో ఉన్న ఐదు డిఎలలో ఒక డిఎను మంజూరు చేసింది. రిటైర్డ్ ఉద్యోగుల బకాయిలు సుమారు రూ.10వేల కోట్లను తీర్చేందుకు నెలకు రూ.500 కోట్ల చొప్పున ఏర్పాటు చేస్తామని శాసనసభ బడ్జెట్ సమావేశాల్లోనే ముఖ్యమంత్రి ప్రకటించారు. కొత్త ఉపాధ్యాయ, అధ్యాపక, ఖాళీగా ఉన్న వివిధప్రభుత్వ శాఖల్లో ఉద్యోగాలను 50వేలకు పైగా భర్తీ చేసింది. మహిళలకు ఉచిత బస్సు పథకం ద్వారా కుదేలైన ఆర్‌టిసికి జీవం అందించేందుకు ప్రయత్నించింది. మహిళా సంఘాలతో కొత్త బస్సుల కొనుగోలు చేయిస్తున్నది. అదే సమయంలో ఉద్యోగులు, కార్మికులు, ముఖ్యంగా రిటైర్డ్ అయిన వారి పరిస్థితిని ప్రభుత్వం పరిగణనలో తీసుకోవాలి. వారికి న్యాయబద్ధంగా ఆర్థిక ప్రయోజనాలు రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. ఆర్‌టిసి కార్మికులను రాష్ట్ర ప్రభుత్వంలో విలీనం చేసే బిల్లు గతంలోనే శాసనసభ ఆమోదం పొంది చట్టంగా మారినా, ఇప్పటికీ అమలు కావడం లేదు. అన్నిటికి మించి ఆర్‌టిసి గుర్తింపు ఎన్నికలు నిర్వహిస్తామన్న ఖర్చులేని హామీపై తాత్సారం అవసరం లేదు. ఆర్‌టిసి కార్మికులు చేస్తున్న 23 డిమాండ్‌లలో, ఉద్యోగుల జెఎసి చేస్తున్న 57 డిమాండ్‌లలో మూడింట రెండొంతులు ఆర్థికేతరమైనవే.

ఈ వర్గాలు ఇప్పటికీ ప్రభుత్వాన్ని నమ్ముతున్నారు ఎందుకంటే సమ్మెకు సిద్ధమైన ప్రభుత్వోద్యోగులను పిలిచి కేంద్ర ప్రభుత్వం తరహాలో ఎల్‌టిసి ఇస్తామని, మంచి ఆరోగ్య పథకం అందిస్తామని తీపి మాటలు చెప్పి, ఆరు నెలల్లో పిఆర్‌సి ఇస్తామని తీపి మాటలు చెప్పిన నాటి ప్రభుత్వ పెద్దల మాటలను వారు మరిచిపోలేదు. అలాగే తీవ్ర నిర్బంధం, అణిచివేత మధ్య 54 రోజుల సమ్మె చేయించిన గత ప్రభుత్వ కాఠిన్యం ఇప్పటికీ ఆర్‌టిసి కార్మికులకు గుర్తే. హామీలు అమలు చేయకపోవడం కంటే కోరి గెలిపించుకున్న ప్రభుత్వం పిలిచి మాట్లాడకపోవడం వారిని ఎక్కువగా బాధించింది. ఇప్పటికైనా ఆర్‌టిసి, ప్రభుత్వోద్యోగులతో చర్చించేందుకు ప్రభుత్వం ముందుకు రావడం ముదావహం. అనేక కఠిన సమస్యలకు సంభాషణలే పరిష్కారమని మరువొద్దు!

## వర్షాకాలం వస్తోంది..జరభద్రం

లేఖ

దేశంలో అత్యధిక వేగవంతంగా విస్తరిస్తూ ఎన్నోరంగాల్లో ఉపాధి కల్పిస్తున్న నగరాల్లో హైదరాబాద్ ముందు ఉందని చెప్పడంలో అతిశయోక్తి కాదు. ఉపాధి అవకాశాలు మెరుగుపడటంతో హైద్రాబాద్ నగరానికి వలసలు పెరిగి జనాభా పెరిగింది. జనాభా తగ్గట్టుగా గృహ వసతి లేక చాలాచోట్ల ఇరుకు గృహాల్లో నివసిస్తున్నారు. ఈ నగరంలో డ్రైనేజీ వ్యవస్థ జనాభాకు తగినట్లుగా నిర్మించుకోవలసివస్తోంది. నిజాం పాలనలో ఎన్నో తోటలు ఉండి పచ్చని ప్రదేశాలు కలిగి ఉన్న నగరంగా ప్రసిద్ధిగాంచింది. నేడు ఎక్కడ చూసిన కాంక్రీట్ జంగిల్‌గా రూపాంతరం చెందింది. ఎత్తయిన భవంతుల నిర్మాణం కొరకు నీటి వనరులు గల చెరువులు, కాలువల ఆక్రమించడం వలన నీటి ప్రవాహానికి అడ్డుకట్టగా మారినవి. చిరువానకే ప్రజలు తల్లడిల్లుతున్నారు. ప్రతి సంవత్సరం వర్షాకాలంలో హైదరాబాద్ నగరంలో వరదలు రావడం తరచుగా చూస్తున్నాము. సహజంగా నీరు ఎత్తు నుండి పల్లంకు పారుతుంది. పల్లపు ప్రాంతాల్లో డ్రైనేజి వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండటం, మురికి కాల్వల మ్యాన్ హోల్ మూతలూ లేకపోవడం వలన చాలామంది కొట్టుకొనిపోవడం జరిగింది. కావున వర్షాకాలం రాకముందే డ్రైనేజీలో పూడిక తీసి, కాలువలలో నీరు త్వరగా వెళ్లిపోయే విధంగా చర్యలు చేబడు తూ, మ్యాన్ హోల్ మూతలూ ఉంచాలని గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పోరేషన్ అధికారులను ప్రజలు విన్నవించుకుంటున్నారు.

**ఆళవందార్ వేణు మాధవ్**

# నాటి ఫాసిజంపై విజయం నేటి పోరాటానికి స్ఫూర్తి



డివివియస్ వర్మ
దారిదీపం సంపాదకులు
85006 789771

ప్రపంచ చరిత్రను మూల మలుపు తిప్పడంలో సోవియట్ యూనియన్ అద్వితీయ పాత్ర పోషించింది. రష్యాలో 1917లో జరిగిన అక్టోబరు విప్లవం ప్రపంచ చరిత్ర గతిని మార్చింది. పెట్టుబడీదారి వ్యవస్థకు పూర్తిగా భిన్నమైన తొలిసోషలిస్టు రాజ్యం ఏర్పడింది.

1945 మే 9న హిట్లర్ ఫాసిజంపై సోవియట్ యూనియన్ సాధించిన విజయం ప్రపంచ దేశాల బలాబలాలను సమూలంగా మార్చివేసింది. పలు దేశాలతో సోషలిస్టు శిబిరం ఏర్పడింది. మరో పక్క ఈ విజయం సామ్రాజ్యవాద దేశాల వలస పాలనకు చరమగీతం పాడింది. తుది సమరానికి జాతీయ విముక్తి ఉద్యమాల వెల్లువకు దారితీసింది. యుద్ధానంతరం అనేక దేశాలు వలస పాలన నుంచి విముక్తి పొంది స్వతంత్ర రాజ్యాలుగా అవతరించాయి.

రెండో ప్రపంచ యుద్ధం చరిత్ర చదివితే రెడ్ ఆర్మీ, సోవియట్ ప్రజల వీరోచిత పోరాటాలు మనల్ని ఉద్విగ్న భరితుల్ని చేస్తాయి. లెనిన్ గ్రాడ్ ముట్టడి, మాస్కో యుద్ధం, స్టాలిన్ గ్రాడ్ పోరాటం ఒక్కొక్కటి వేలాది మంది ఆత్మార్పణతో సాగించిన యుద్ధం మనల్ని కలిచి వేస్తుంది.

హిట్లర్ జర్మన్ సైన్యాల మీద ఈ యుద్ధం మూడు సంవత్సరాల పది నెలలపాటు జరిగింది. చాలీచాలని తిండి, పరిమితమైన ఆయుధ సామగ్రితో అకుంఠిత దీక్షతో సాగిన యుద్ధం. అడుగు అడుగునా రక్తతర్పణ తో సాగిన దీర్ఘకాలిక యుద్ధం .

ఆ యుద్ధంలో సోవియట్ సైనికులు ప్రజలు 2 కోట్ల 60 లక్షల మంది మరణించారు. వేలాది మంది క్షతగాత్రులయ్యారు. జర్మన్ ఫాసిస్టు సైన్యానికి పట్టుబడిన 35 లక్షల యుద్ధ ఖైదీలు ఫాసిస్టు మూకల చెరలోనే మరణించారు. జర్మనీ ముందుగా ఆక్రమించిన సోవియట్ ప్రాంతంలో 8 కోట్ల 50 లక్షల జనాభా చిక్కుకున్నారు. అంటే దేశం జనాభాలో 45 శాతం మంది దిగ్బంధం పాలయ్యారు. అక్కడ వున్న 25 లక్షల ఇళ్లల్లో పది లక్షల ఇళ్లను ఫాసిస్టు సైన్యం నేలమట్టం చేసింది. రెండు కోట్ల 50 లక్షల మంది నిరాశ్రయులయ్యారు.

జర్మన్ బలగాలు 1710 సోవియట్ పట్టణాలను, 70 వేల గ్రామాలను ధ్వంసం చేశారు. 65 వేల కిలోమీటర్ల రైలు, రోడ్డు మార్గాలను నాశనం చేశారు. ఇంతటి బీభత్సాన్ని, విధ్వంసాన్ని, ప్రాణ నష్టాన్ని తట్టుకుని నిలబడి రెడ్ ఆర్మీ, సోవియట్ ప్రజలు జర్మన్ ఫాసిస్టు సేనలను వెనక్కి తరిమికొట్టారు. అంతిమంగా 1945 మే 9న హిట్లర్ సైన్యాన్ని వారి సొంత గడ్డపైనే ఓడించి బెర్లిన్ పట్టణాన్ని స్వాధీనం చేసుకుని ఎర్ర జెండా ఎగురవేశారు.

రెండో ప్రపంచ యుద్ధంలో జర్మన్ ఫాసిస్టు సైన్యాన్ని ఓడించిన ఘనత సోవియట్ యూనియన్‌కు దక్కింది. అది అడుగడుగునా నెత్తురు పారించి సాధించిన విజయం.

ఫాసిజంపై జరిగిన యుద్ధ కాలంలో భారత ప్రజలు, ఫాసిజానికి వ్యతిరేకంగా దృఢంగా నిలబడ్డారు. 1940 డిసెంబరులో మహాత్మా గాంధీ హిట్లర్‌కు రాసిన లేఖలో ఆయన చర్యలను పరమ కిరాతకమైనవిగా పేర్కొని దాని విజయానికి తమ ఆశీస్సులు వుండవని తేల్చి చెప్పారు. మరోపక్క జవహర్లాల్ నెహ్రూ బహిరంగంగానే ఫాసిజాన్ని ఖండిస్తూ రచనలు, ప్రకటనలు చేశారు. ఆయనకు ముస్సోలినీ, హిట్లర్ ప్రభుత్వాలు పంపిన ఆహ్వానాలను తిరస్కరించారు.

కమ్యూనిస్టు పార్టీ దీనిని ప్రజా యుద్ధంగా ప్రకటించింది. ఫాసిస్టు వ్యతిరేక ప్రచారాన్ని దేశవ్యాప్తంగా ముమ్మరంగా సాగించింది. కార్మిక సంఘాలు, ప్రజా సంఘాలు, మహిళా సంఘాలు తమ సభలు, సమావేశాలలో ఫాసిజం ప్రమాదం మీద విస్తృతంగా ప్రచారం చేశారు. అభ్యుదయ రచయితలు ఉత్తేజపరిచే పాటలు, నాటికలు వంటి కళారూపాలను రచిస్తే ప్రజా నాట్యమండలి బృందాలు కళారూపాల ద్వారా ఫాసిజాన్ని ఎండగట్టారు.

మహాకవి శ్రీశ్రీ రచించిన 'గర్జించు రష్యా గాండ్రించు రష్యా' అనే గేయం విశేష ప్రజాదరణ పొందింది.

రెండో ప్రపంచ యుద్ధంలో సోవియట్ యూనియన్ విజయం సాధించడంతో, ఆ పోరాటంలో విముక్తి పొందిన దేశాలలో కమ్యూనిస్టు బృందాలు అధికారంలోకి వచ్చాయి. ఒకే ఒక సోషలిస్టు రాజ్యం ఇప్పుడు 12 దేశాల బృందం అయ్యింది.

బ్రిటన్‌కు రవి అస్తమించని సామ్రాజ్యం వుంది. అనేక వలస దేశాల మీద పెత్తనం వుంది. అలాగే ఫ్రాన్స్‌కూ వలస దేశాలున్నాయి. రెండో ప్రపంచ యుద్ధంలో ఈ దేశాల ఆర్థిక వ్యవస్థలు కుప్పకూలాయి. మరోపక్క ఫాసిజంపై విజయం తర్వాత అనేక దేశాలలో జాతీయ విముక్తి ఉద్యమాలు తీవ్ర రూపం దాల్చాయి. వలస పాలకులు ఇక్కడ పాలించడం అసాధ్యంగా మారింది. పర్యవసానంగా 1947లో భారతదేశానికి స్వతంత్రం వచ్చింది. అనతి కాలంలోనే పలు దేశాలు స్వతంత్ర దేశాలయ్యాయి.

మరో పక్క చైనాలో విప్లవం విజయవంతం అయింది. మే 9 ఫాసిజంపై సోవియట్ సాధించిన విజయం తర్వాత ఒక కొత్త ప్రపంచం ఏర్పడింది. వలస దేశాల స్థానంలో స్వతంత్ర రాజ్యాలు పుట్టుకొచ్చాయి. సోషలిస్టు శిబిరం ఏర్పడడంతో ఈ స్వతంత్ర దేశాలు అలీన విధానం అనుసరించడానికి వీలు కలిగింది. బలమైన అలీన ఉద్యమం ఏర్పడటంతో సామ్రాజ్యవాదులు ఆడింది ఆట పాడింది పాట కాకుండా పోయింది.

### భారతీయ ఫాసిజం

1945 మే 9తో ఫాసిస్టు ప్రభుత్వాలు కూలిపోయాయి. ఇటలీలో ముస్సోలినీని ప్రజలు కొట్టి చంపారు. హిట్లర్ ఆత్మహత్య చేసుకున్నాడు. ఫాసిస్టు రాజ్యాలు పతనం అయినా దానితో పాటే ఫాసిస్టు భావజాలం మాత్రం అంతరించలేదు. భారతదేశంతో సహా పలు దేశాలలో ఫాసిస్టు శక్తులు పనిచేస్తూనే ఉన్నాయి. 1925లో ఆర్ఎస్ఎస్ సంస్థ ఏర్పడింది. దాని వ్యవస్థాపకుడు డావ హెగ్డేవార్. ఆయన గురువు బీఎస్ మాన్జీ. అలాగే హిందుత్వ భావనకు రూపుదిద్దిన వాడు దామోదర సావర్కర్. ఆయన హిందూ మహాసభ పేరుతో ఉన్నాడు. ఆర్ఎస్ఎస్ దాని సంఘ పరివారం ఏర్పడేనాటికి వారికి ముస్లిం వ్యతిరేకత తప్ప స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక వున్నట్టు కనిపించదు. వారు ఫాసిస్టు భావజాలాన్ని ముస్సోలినీ, హిట్లర్ నుంచి పొంది దానిని భారతీయ పరిస్థితులకు అనుగుణంగా రూపొందించినట్టు కనిపిస్తుంది. ఇటాలియన్ పరిశోధకురాలు మర్జినా కసోలారీ దీనిని సాధికారికంగాం నిరూపించారు. బీఎస్ మాన్జీ డైరీల నుంచి ఆమె ఈ సమాచారాన్ని సేకరించారు. మాన్ జీ తన డైరీలో (మార్చి 19, 1931) ముస్సోలినీ ప్రత్యక్షంగా కలిసి మాట్లాడినట్టు, అక్కడ ఫాసిస్టు యువజన సంఘం కార్యకలాపాలు చూసినట్లు, అలాంటి సంస్థలు ప్రతి దేశానికి అవసరమని ముస్సోలినీకి చెప్పినట్టు, దానికి ఆయన అలాంటి కృషిలో విజయం సాధించాలని ఆకాంక్షించినట్లు రాసుకున్నారు.

ఆయన ఇండియాకు తిరిగి వచ్చిన తర్వాత మార్చి 31న హెడ్గెవార్ తదితర మిత్రులతో అలాంటి హిందువుల మిలటరీ ఆర్గనైజేషన్ ఏర్పాటు గురించి చర్చించినట్లు రాసుకున్నారు.

ఆర్ఎస్ఎస్ సిద్ధాంత కర్త గురు గోల్వాల్కర్ జర్మన్ జాతి స్వచ్ఛత, సంస్కృతి కోసం సెమిటిక్ జాతికి చెందిన యూదులను ఏరివేయాలన్న సూత్రం మనకు దారి చూపిస్తుందని ప్రకటించాడు. 1938 జూన్ 14న సావర్కార్ ప్రసంగిస్తూ హిట్లర్ యూదు వ్యతిరేక కార్యక్రమం ఇండియాలో ముస్లిం సమస్యకు పరిష్కారంగా సూచించాడు.

ఆర్ఎస్ఎస్ సంఘ పరివారం ముస్సోలినీ, హిట్లర్ ఫాసిజాలను అనుసరించిన తీరులో ఎన్నో సారూప్యతలు కనిపిస్తాయి. హిట్లర్ ఆర్య జాతి ఆధిపత్యాన్ని ప్రకటిస్తే సంఘ్ పరివారం హిందూ రాష్ట్ర పేరుతో హిందూ ఆధిపత్యాన్ని ప్రకటిస్తున్నది. హిట్లర్‌కు యూదు వ్యతిరేకత రాజకీయమైతే ఇక్కడ ముస్లిం వ్యతిరేకత రాజకీయం అయ్యింది. అక్కడ యూదులకు పౌరసత్వం తొలగించే చట్టాలను ముందుకు తెచ్చారు. ఇక్కడా అలాంటి పౌరసత్వ చట్టాలకు రూపు దిద్దేపనిలో ఉన్నారు. అక్కడ యూదులతో వివాహాలను నిషేధిస్తే ఇక్కడ అదే తరహాలో లవ్ జిహాద్‌ను ముందుకు తెచ్చారు. జర్మన్ జాతి గత వైభవాన్ని ప్రస్తావిస్తే ఇక్కడ గత హిందూ వైభవం గురించిన చర్చ చేస్తున్నారు.



ఇప్పుడు అధికారంలో వున్న హిందూత్వ రాజకీయ వాదం హిందూ రాష్ట్ర సాధనకోసం పావులను కదుపుతున్నది. ఇటీవల జరిగిన కుంభమేళాలో సంఘ్ పరివార బృందం తమ హిందూ రాష్ట్ర రాజ్యాంగ ముసాయిదాలోని అంశాలను ప్రకటించింది.. ఈ రాజ్యాంగాన్ని మనుస్మృతి, కౌటిల్యుని అర్థశాస్త్రం ఆధారంగా రూపొందించినట్లు చెప్పారు. హిందువులకు మాత్రమే ఎన్నికల్లో ఓటువేసే హక్కు, పోటీ చేసే హక్కు వుంటాయని స్పష్టం చేశారు. భారతీయ ఫాసిజం లక్ష్యం ప్రస్తుత రాజ్యాంగాన్ని తొలగించి మత రాజ్యాంగాన్ని తీసుకు రావడం. దేశాన్ని ప్రజాస్వామ్య యుగం నుండి ఆటవికమైన మనువాద యుగాలకు నడిపించడం. ఈ తరహా భారతీయ ఫాసిజాన్ని ఓడించడం మన తక్షణ కర్తవ్యం అయ్యింది. ఈ సవాలును ఎదుర్కొనడానికి మే 9 న ఫాసిజం పై విజయం 80 వార్షికోత్సవం మనకు స్ఫూర్తి దాయకం కావాలి.

## రెండవ ప్రపంచ యుద్ధ క్షేత్రం

**ప్రారంభం:** 1939 సెప్టెంబర్ 1 : పోలండ్‌పై నాజీ సైన్యం దండయాత్రతో ఆరంభం

**ముగింపు:** 1945 మే 9 : రీచ్‌స్టాగ్ (జర్మన్ పార్లమెంటు భవనం)పై రెడ్ ఆర్మీ అరుణ పతాకం ఆవిష్కరణతో, సోవియట్ యూనియన్‌పై హిట్లర్ సైన్యం దాడి : 1941 సెప్టెంబర్ 1.

**సైనిక నష్టం :** జర్మన్ మిలటరీ లెక్కల ప్రకారం యుద్ధం ప్రారంభం నుంచి 1945 జనవరి 31 వరకు జర్మన్ సైనిక మరణాలు 44లక్షల్లో 35 లక్షలు తూర్పు యుద్ధ రంగంలోనే (సోవియట్ యూనియన్‌తో యుద్ధ రంగం)సంభవించాయి. 1940లో, 1944లో ఫ్రాన్స్‌తో యుద్ధంలో నాజీలు కోల్పోయినంత మంది సైనికులను ఒక్క స్టాలిన్‌గ్రాడ్ యుద్ధంలోనే కోల్పోయారు. నాజీ జర్మనీ 1941 వేసవిలో 38లక్షల మంది సైనికులు, 7 వేల ఆయుధ శకటాలతో యుఎస్ఎస్ఆర్‌పై దాడి చేసింది. చాలా ఆలస్యంగా రెండవ యుద్ధరంగం ఆరంభించిన పశ్చిమ మిత్ర రాజ్యాలు 6 లక్షల సైనికులను, 2వేల ఆయుధ శకటాలను మాత్రమే ఎదుర్కొన్నాయి.

సోవియట్ యూనియన్ ఈ యుద్ధంలో 2కోట్ల 70లక్షల మంది పౌరులను కోల్పోయింది. వారిలో అత్యధికులు పోరాట క్షేత్రంలో ప్రాణత్యాగం చేశారు.

యుద్ధ ఖైదీల శిబిరాల్లో, కాన్సన్‌ట్రేసన్ క్యాంపుల్లో లేదా దండయాత్రికులు పౌరులపై సాగించిన ఊచకోతలో లేక ఆకలికి అలమటించి పదుల లక్షలమంది చనిపోయారు. యూరప్‌లో యుద్ధంలో మరే దేశమూ ఇంతపెద్ద సంఖ్యలో ప్రాణత్యాగం చేయలేదు.

రెండవ ప్రపంచ యుద్ధంలో నాజీ సైన్యాల తిరోగమనం స్టాలిన్ గ్రాడ్ పోరాట క్షేత్రం నుంచి మొదలయింది. ఈ యుద్ధం తిరోముఖం 1943 ఫిబ్రవరిలో మొదలైంది. 1944లో సోవియట్ రెడ్ ఆర్మీ తూర్పు యూరప్‌లో ప్రవేశించి నాజీ మూకలను వెనక్కి తరిమికొట్టసాగింది. 1945 ఏప్రిల్‌లో జర్మనీలో, బెర్లిన్‌లో ప్రవేశించాయి. హిట్లర్ 1945 ఏప్రిల్ 30న ఆత్మాహత్య చేసుకున్నాడు. జర్మన్ సైన్యాలు 1945 మే 8న రెడ్ ఆర్మీకి, మే 9న అక్షరాజ్యాల సైన్యానికి లొంగిపోయాయి. రెండవ ప్రపంచ యుద్ధానికి తెరపడింది.

# కాళేశ్వరం క్షేత్రంలో సరస్వతీ పుష్కరాలకు రంగం సిద్ధం

త్రిలింగ క్షేత్రాలలో ఒకటిగా ప్రసిద్ధి చెందిన ప్రముఖ శైవ క్షేత్రమైన కాళేశ్వరం క్షేత్రంలో ఈ నెల15 నుండి 26 వరకు12 రోజుల పాటు జరిగే సరస్వతీ పుష్కర మహోత్సవాలకు రాష్ట్ర ప్రభుత్వం కుంభమేళా తరహాలో భారీ ఏర్పాట్లు కొనసాగిస్తుంది. కాళేశ్వరం క్షేత్రంలో సరస్వతి పుష్కరాలు జరుగుతుండటంతో తెలుగురాష్ట్రాలతో పాటు సరిహద్దు మహారాష్ట్ర, ఛత్తీస్‌ఘడ్, మధ్యప్రదేశ్, ఒడిశా తదితర రాష్ట్రాల నుండి భారీ సంఖ్యలో భక్తులు తరలి వచ్చే అవకాశాలు ఉండటంతో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పుష్కర ఏర్పాట్లపై అధికార యంత్రాంగం కసరత్తు చేస్తోంది. రాష్ట్ర మంత్రులు, దేవాదాయ శాఖ ఉన్నతాధికారులు జిల్లా స్థాయి అధికారులతో పుష్కరాల నిర్వహణపై గత ఆరు నెలలుగా సమీక్షలు, సమావేశాలు ఏర్పాటు చేసి కార్యాచరణపై ఫోకస్ పెట్టారు. ఈ సందర్భంగా మంత్రులు దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, కొండా సురేఖ ఆధ్వర్యంలో హైదరాబాద్ సచివాలయంలో అధికారులతో కలిసి రెండు, మూడు సార్లు సమీక్షలు నిర్వహించి పుష్కరాల ఏర్పాట్లపై మాస్టర్ ప్లాన్ సిద్ధం చేయాలని ఆదేశాలు జారీ చేశారు. దీంతో కాళేశ్వరం క్షేత్రంలో పలు మార్లు రాష్ట్ర దేవాదాయ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్, కమీషనర్ శ్రీధర్, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ జిల్లా, మండల స్థాయి అధికారులతో సమీక్షా సమావేశాలు నిర్వహించి పుష్కర ఏర్పాట్లకు సంబంధించిన ప్రణాళికలు, విధివిధానాలు రూపొందించి ప్రభుత్వానికి సమర్పించారు. రాష్ట్ర ప్రభుత్వం రూ.25 కోట్ల నిధులు మంజూరు చేసి పుష్కర పనులకు శ్రీకారం చుట్టింది.

**రూ.25 కోట్లతో శరవేగంగా పుష్కర అభివృద్ధి పనులు**

కాళేశ్వరం క్షేత్రంలో సరస్వతి పుష్కరాలకు కొద్ది రోజులే ఉండటంతో యుద్ధప్రాతిపదికన ఏర్పాట్ల పనులు కొనసాగుతున్నాయి. పుష్కరాల అభివృద్ధి పనులకు రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన రూ.25 కోట్ల నిధులను దేవాదాయ, పంచాయత్ రాజ్, ఇరిగేషన్, ఆర్డబ్ల్యూఎస్, విద్యుత్ శాఖల ఆధ్వర్యంలో 65 పనులు చేపట్టి ఆయా శాఖల పర్యవేక్షణలో






పనుల నిర్వహణ కొనసాగుతోంది. దేవాదాయ శాఖకు 9.60 కోట్లు,ఇరిగేషన్ శాఖకు 5.32 కోట్లు,పంచాయత్ రాజ్ శాఖకు 3 కోట్లు, ఆర్డబ్ల్యూఎస్ కు 2.28 కోట్ల నిధులు కేటాయించగా పుష్కర అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు అధికారులు కృషి చేస్తున్నారు.

**పుష్కర పనులు త్వరితగతిన పూర్తి చేయాలి**

మంథని నియోజకవర్గం పర్యటనలో భాగంగా రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు కాళేశ్వరం క్షేత్రం లోని విఐపిఘాట్, ప్రధాన ఘాట్, వంద గదుల సత్రం, వైద్యశాల తదితర పుష్కరాల ఏర్పాట్ల పనులను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు అధికారులతో మాట్లాడారు. క్షేత్రంలో అన్ని ఏర్పాట్లు







సమయానుకూలంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. గోదావరి తీరం వద్ద ఎప్పటికప్పుడు వ్యర్థాలు తొలగించి పరిశుభ్రం చేయాలని అధికారులకు సూచించారు.

**క్షేత్రంలో పుష్కరాల విశిష్టత**

12 ఏళ్ళకొకసారి వచ్చే పుష్కరాలు ఎంతో విశిష్టతను కలిగి ఉంటాయి.ఒక్కొక్క ప్రాంతంలో జరిగే పుష్కరాలు ప్రతి 12 ఏళ్ళకొకసారి మాత్రమే జరుగుతుండగా కాళేశ్వరం త్రివేణి సంగమ తీరంలో మాత్రం ప్రతి 12 ఏళ్ళకు మూడు పుష్కరాలు జరుగడం విశేషం. క్షేత్రంలో గోదావరి, ప్రాణహిత నదులతో కలిసి అంతర్వాహిని సరస్వతి నది ప్రవహిస్తుండటంతో త్రివేణి సంగమంగా ప్రఖ్యాతి గాంచింది. కాళేశ్వరం క్షేత్రంలో ప్రతి 12 ఏళ్ళకు వేర్వేరుగా మూడు నదులకు మూడు సార్లు పుష్కరాలు వస్తాయి. క్షేత్రంలో పుష్కర ప్రాశస్తం కలిగిన ప్రాణహిత పుష్కరాలు 2022 ఏప్రిల్ లో జరుగగా, సరస్వతి పుష్కరాలు ఈ నెల 15 నుండి ప్రారంభం కానుండగా, 2027 జూన్‌లో గోదావరి పుష్కరాలు జరుగనున్నాయి.

కాళేశ్వరం క్షేత్రంలో ఈ నెల 15 నుండి 26 వరకు జరిగే సరస్వతీ పుష్కరాల సందర్భంగా క్షేతంలోని త్రివేణి సంగమం తీరం భక్తజనసంద్రంగా మారనుండగా, కాళేశ్వర ముక్తీశ్వర ఆలయం భక్తుల శివనామ స్మరణతో మారుమోగనుంది. క్షేత్రంలో ఒకే పానమట్టంపై కాళేశ్వరుడు (యముడు), ముక్తీశ్వరుడు (శివుడు) లింగాకారంలో కొలువుదీరిన కాళేశ్వర ముక్తీశ్వర స్వామి దర్శన భాగ్యం కోసం ఆలయ పరిసరాలు భక్తులతో కోలాహలంగా మారనున్నాయి.

**పుష్కరాలకు ప్రత్యేక ఏర్పాట్లు**

సరస్వతి పుష్కరాలకు వివిధ రాష్ట్రాల నుండి భారీగా తరలివచ్చే భక్తుల కోసం అధికార యంత్రాంగం భారీ ఏర్పాట్లు చేస్తుంది. పుష్కర ప్రాంతమైన త్రివేణి సంగమం విఐపి ఘాట్ వద్ద తాగునీటి సౌకర్యం,మహిళలు దుస్తులు మార్చుకునేందుకు తాత్కాలిక గదులు, పిల్లలు, వృద్ధుల కోసం స్నానజల్లు కేంద్రాలు, శాశ్వత, తాత్కాలిక మరుగు దొడ్లు, ఎండల తీవ్రత దృష్ట్యా తీరం వద్ద చలువ పందిళ్ళు, నిరంతరం కొనసాగే వైద్య శిబిరాలు, తీరంలో పుష్కర స్నానాలు ఆచరించే సమయంలో భక్తులు నదీ ప్రవాహంలోకి వెళ్ళకుండా సరిహద్దు జెండాలు, లోతు ప్రమాదాల నివారణకు నిరంతర కాపలాతో అప్రమత్తంగా ఉండే రెస్క్యూ టీంల, రాత్రి వేళల్లో నదీ స్నానాలకు పెద్ద ఎత్తున హైమాస్ విద్యుత్ దీపాలు, ఎగ్జిబిషన్లు, వివిధ రకాల స్టాల్లు, పార్కింగ్ స్థలాలను అధికారులు ఏర్పాటు చేస్తున్నారు. పుష్కర తీరంలో ఆహ్లాదంగా బోటు విహారాల కోసం స్థానిక గంగ పుత్రులు బోట్లను సిద్ధం చేయగా త్రివేణి సంగమం, క్షేత్రం చుట్టూ భక్తులు జాయ్ రైడింగ్ సాగించేందుకు హెలికాప్టర్ లను ఏర్పాటు చేయనున్నారు. క్షేత్రంలో పారిశుద్ధ్య నిర్వాహణ కోసం భారీ సంఖ్యలో పారిశుద్ధ్య కార్మికులను ఏర్పాటు చేయగా వాహనాల పార్కింగ్ కోసం 40 ఎకరా ల్లో వేర్వేరు ప్రాంతాల్లో 5 పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేశారు. ఆలయం ప్రాంగణంలో రాష్ట్ర సాహితి అకాడమీ సంస్థ ఆధ్వర్యంలో నిత్యం సాంస్కృతిక కార్యక్రమాలు, ఆధ్యాత్మిక ప్రవచనాలు కొనసాగనున్నాయి.

**సుధాకర్**, జయశంకర్ భూపాలపల్లి
ప్రజాపక్షం ప్రతినిధి

# జాతీయం

NATIONAL & GENERAL NEWS

## గగన్‌యాన్ వ్యోమగామి అజిత్ వెనక్కి



**న్యూఢిల్లీ:** పాక్‌తో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో గగన్‌యాన్ వ్యోమగామి అజిత్ కృష్ణన్‌ను వాయుసేన వెనక్కి పిలిపించింది. భారత్ ప్రతిష్ఠాత్మకంగా తలపెట్టిన తొలి మానవసహిత అంతరిక్ష యాత్ర గగన్‌యాన్ కోసం వాయుసేన నుంచి ఎంపికైన వారిలో అజిత్ ఒకరు. తాజాగా దిల్లీలో నిర్వహించిన గ్లోబల్ స్పేస్ ఎక్స్‌ప్లోరేషన్ కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ఆయన... ఈ విషయాన్ని ధ్రువీకరించారు. 'ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో ఐఏఎఫ్ నుంచి నాకు పిలుపొచ్చింది' అని తెలిపారు. వాయుసేనకు చెందిన గ్రూప్ కెప్టెన్లు ప్రశాంత్ బాలకృష్ణన్ నాయర్, అంగద్ ప్రతాప్, అజిత్ కృష్ణన్, వింగ్ కమాండర్ శుభాంశు శుక్లా గగన్‌యాన్ యాత్రకు ఎంపిక య్యారు. భారత నేల నుంచి స్వదేశీ వ్యోమనౌకలో అంతరిక్షంలోకి వెళ్లనున్న మొదటి భారతీయ బందం వీరే. 2027లో ఈ యాత్ర జరగనుంది. దీనికోసం అజిత్, అంగద్ భారత్‌లో శిక్షణ పొందుతుండగా... శుభాంశు శుక్లా, నాయర్ అమెరికాలో శిక్షణ తీసుకుంటున్నారు.

## మా సహనాన్ని పరీక్షించొద్దు

### పాకిస్థాన్‌కు రాజ్‌నాథ్ సింగ్ హెచ్చరిక



**న్యూఢిల్లీ:** పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా ఆపరేషన్ సిందూర్‌తో భారత్ దాడులకు పాల్పడటంతో పాకిస్థాన్‌పై యుద్ధ మేఘాలు కమ్మేశాయి. సరిహద్దుల వద్ద పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ఈ పరిస్థితుల్లో పాకిస్థాన్ రెచ్చగొట్టే చర్యలకు పాల్పడితే తీవ్ర పరిణామాలు తప్పబోవని భారత్ తేల్చిచెప్పింది. మా సహనాన్ని పరీక్షించవద్దంటూ రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ దాయాది దేశాన్ని హెచ్చరించారు. పాకిస్థాన్‌లోని ఉగ్రస్థావరాలే లక్ష్యంగా ఆపరేషన్ సిందూర్ జరగడంతో భారత్‌లోని సైనిక స్థావరాపై దాడులకు పాక్ యత్నించింది. అయితే భారత్ ఆ దాడులను తిప్పికొట్టింది. భారత్ సహనంగా ఉండటాన్ని అలుసుగా తీసుకోవద్దని పాకిస్థాన్‌కు రాజ్‌నాథ్ సింగ్ స్పష్టం చేశారు. కవ్వింపులురెచ్చగొట్టే చర్యలకు పాల్పడితే ఆపరేషన్ సిందూర్ తరహా చర్యలు తప్పబోవని హెచ్చరించారు. 'నేషనల్ క్వాలిటీ కాంక్లేవ్'లో మాట్లాడిన ఆయన దేశ భద్రతపై రాజీ పడబోమన్నారు. 'మేము సంయమంతో బాధ్యతగా చర్చలు తీసుకుంటూ సమస్యలు పరిష్కరించుకోవాలని భావిస్తాం. అలాగనీ మా సహనాన్ని అవకాశంగా తీసుకోవాలని ప్రయత్నిస్తే. ఆపరేషన్ సిందూర్ తరహా పర్యవసానాలకు సిద్ధంగా ఉండాలి' అని రాజ్‌నాథ్ సింగ్ హెచ్చరించారు. కచ్చితత్వంతో ఆపరేషన్ సిందూర్ అమలు చేసిన సైన్యాన్ని రక్షణమంత్రి మెచ్చుకున్నారు. బలగాల ధైర్య సాహసాలను ప్రశంసించారు. సామాన్యులకు నష్టం కలగకుండా ఈ ఆపరేషన్ జరిగిందని చెప్పారు. అత్యాధునిక పరికరాలు, సుశిక్షితులైన సాయుధ దళాల పని తీరు వల్లే ఇది సాధ్యమైందని రాజ్‌నాథ్ సింగ్ అన్నారు.

## ఉగ్రవాదంపై పోరుకు పూర్తి మద్దతు

### ఎస్‌పి అధ్యక్షుడు అఖిలేశ్



**లక్నో :** ఉగ్రవాదాన్ని తుదముట్టించేందుకు కేంద్రం చేస్తున్న ప్రయత్నాలకు తమ పూర్తి మద్దతు ఉంటుందని సమాజ్‌వాది పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ గురువారం తెలిపారు. పాకిస్థాన్‌తో ఉద్రిక్తతల నేపథ్యంలో భారత దేశం ఐక్యంగా ఉండవలసిన అవసరాన్ని ఆయన నొక్కి చెప్పారు. ఇక్కడ విలేకరుల సమావేశంలో అఖిలేశ్ మాట్లాడుతూ 'ఉగ్రవాద మూలాలను సమూలంగా నాశనం చేయాలని ప్రతి పార్టీ పేర్కొంది. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా కేంద్రం జరిపే పోరుకు మేము పూర్తి మద్దతు ఇస్తున్నాం' అని చెప్పారు. పాకిస్థాన్, పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీవోకే) లో ఉగ్రవాద స్థావరాలే లక్ష్యంగా భారత ప్రభుత్వం 'ఆపరేషన్ సిందూర్' పేరుతో వైమానిక బాంబు దాడులు జరిపిన ఒక రోజు తర్వాత ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

# 'ఆపరేషన్ సిందూర్'

# నిరంతరం అప్రమత్తం

### ఉన్నతస్థాయి సమావేశంలో ప్రధాని మోదీ పిలుపు



**న్యూఢిల్లీ:** 'ఆపరేషన్ సింధూర్' నేపథ్యంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన వేర్వేరు మంత్రిత్వ శాఖల కార్యదర్శులతో ఉన్నతస్థాయి సమావేశం గురువారం ఇక్కడ జరిగింది. జాతీయ భద్రత, కార్యాచరణ సంసిద్ధత పట్ల ప్రభుత్వ నిబద్ధతను పునరుద్ఘాటిస్తూ నిరంతర అప్రమత్తత, స్పష్టమైన కమ్యూనికేషన్ కోసం ఆయన పిలుపునిచ్చారు. పౌర రక్షణ యంత్రాంగాలను బలోపేతం చేయడం, తప్పుడు సమాచారం, నకిలీ వార్తలను ఎదుర్కోవడానికి ప్రయత్నాలు, కీలకమైన మౌలిక సదుపాయాల భద్రతను నిర్ధారించడం వంటి అంశాలు సమావేశంలో చర్చించినట్లు ప్రధాన మంత్రి కార్యాలయం (పీఎంవో) విడుదల చేసిన ఒక ప్రకటన తెలిపింది. రాష్ట్ర అధికారులు, క్షేత్రస్థాయి సంస్థలతో సన్నిహిత సమన్వయాన్ని కొనసాగించాలని మంత్రిత్వశాఖలకు సూచించినట్లు పేర్కొంది. భారత ప్రభుత్వంలోని వివిధ మంత్రిత్వ శాఖలు, విభాగాల కార్యదర్శులు పాల్గొన్న ఉన్నత స్థాయి సమావేశంలో జాతీయ భద్రతకు సంబంధించి ఇటీవలి పరిణామాల దృష్ట్యా జాతీయ సంసిద్ధత, అంతర్‌మంత్రిత్వశాఖల సమన్వయాన్ని సమీక్షించారు. కార్యాచరణ కొనసాగింపు, సంస్థాగత స్థితిస్థాపకతను నిలబెట్టుకోవడానికి మంత్రిత్వ శాఖలు, సంస్థల మధ్య సజావుగా సమన్వయం అవసరమని ప్రధాని మోదీ నొక్కి చెప్పారని ప్రకటన తెలిపింది. 'దేశం సున్నితమైన కాలంలో ప్రయాణిస్తున్నందున నిరంతర అప్రమత్తత, సంస్థాగత సమష్టి తత్వం, స్పష్టమైన కమ్యూనికేషన్ కోసం ప్రధానమంత్రి పిలుపునిచ్చారు. జాతీయ భద్రత, కార్యాచరణ సంసిద్ధత, పౌరుల భద్రతకు ప్రభుత్వ నిబద్ధతను ఆయన పునరుద్ఘాటించారు' అని ప్రకటన పేర్కొంది. భారత సాయుధ దళాలు పాకిస్థాన్, పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీవోకే) లోని తొమ్మిది ఉగ్రవాద లక్ష్యాలపై క్షిపణి దాడులు చేసిన ఒక రోజు తర్వాత ఈ సమావేశం జరిగింది. సమావేశంలో ప్రస్తుత పరిస్థితిని ఎదుర్కోవడానికి మంత్రిత్వ శాఖల ప్రణాళిక, సన్నద్ధతను సమీక్షించారు. కార్యదర్శులు తమ మంత్రిత్వ శాఖల కార్యకలాపాలను సమగ్రంగా సమీక్షించాలని, సంసిద్ధత, అత్యవసర ప్రతిస్పందన, అంతర్గత కమ్యూనికేషన్ ప్రొటోకాల్‌పై ప్రత్యేక దృష్టి సారించి అవసరమైన వ్యవస్థల విశ్వసనీయ పని తీరును నిర్ధారించాలని ఆదేశించినట్లు' ఆ ప్రకటన పేర్కొంది. ప్రస్తుత పరిస్థితిలో 'మొత్తం ప్రభుత్వ' విధానంతో కార్యదర్శులు తమ ప్రణాళికను వివరించారని వెల్లడించింది. అన్నిరకాల ఉద్భవిస్తున్న పరిస్థితులను ఎదుర్కోవడానికి మంత్రిత్వశాఖలు సిద్ధంగా ఉన్నాయని ప్రకటన తెలిపింది. ఈ సమావేశంలో క్యాబినెట్ కార్యదర్శి, ప్రధాన మంత్రి కార్యాలయం నుంచి ఉన్నతాధికారులు, రక్షణ, హో వ్యవహారాలు, విదేశాంగ వ్యవహారాలు, సమాచారప్రసార, విద్యుత్, ఆరోగ్యం, టెలి కమ్యూనికేషన్స్ వంటి కీలక మంత్రిత్వ శాఖల కార్యదర్శులు పాల్గొన్నారు.

## భారత వ్యతిరేక ప్రచారాన్ని ఉపేక్షించొద్దు

### రాష్ట్రాలకు కేంద్రం ఆదేశం

న్యూఢిల్లీ: సామాజిక మాధ్యమాల్లో దేశ వ్యతిరేక ప్రచారంపై నిఘా ఉంచాలని కేంద్ర హోం శాఖ రాష్ట్ర ప్రభుత్వాలకు సూచించింది. ఆపరేషన్ సిందూర్ పేరుతో పాక్ ఉగ్రస్థావరాలపై భారత సైన్యం మెరుపుదాడులు చేసిన అనంతరం కేంద్ర హోం మంత్రి అమిత్ షా పలు రాష్ట్రాల సీఎంలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆ సమావేశంలో హోం మంత్రిత్వ శాఖ అన్ని రాష్ట్రాలకు పలు సూచనలు చేసినట్లు అధికార వర్గాలు గురువారం తెలిపాయి. ఆపరేషన్ సిందూర్ అనంతరం పాక్ చేస్తున్న తప్పుడు ప్రచారాలను భారత్ ఎప్పటికప్పుడు తిప్పికొడుతూ వస్తోంది. ఇదే సమయంలో అన్ని రాష్ట్ర ప్రభుత్వాలకు, కేంద్ర పాలిత ప్రాంతాలకు హోంశాఖ సూచనలు చేసింది. ఆపరేషన్ సిందూర్ గురించి, భారత్ భద్రత గురించి తప్పుడు కథనాలు వ్యాప్తి చేసే ఖాతాలపై కఠినచర్యలు తీసుకోవాలని ఆదేశించింది. దేశం నుంచి లేదా విదేశాల నుంచి భారత్‌కు వ్యతిరేకంగా ప్రచారం చేస్తే ఆయా సోషల్ మీడియా ఖాతాలను వెంటనే బ్లాక్ చేయాలని పేర్కొంది. ఈ సందర్భంగా సరిహద్దు ప్రాంతాల్లోని ప్రభుత్వాలకు, భద్రతా దళాలకు మధ్య కమ్యూనికేషన్ సంబంధాలు పెంచాలని పిలుపునిచ్చింది.

## పాక్ వెబ్ కంటెంట్‌పై కేంద్రం నిషేధం

**న్యూఢిల్లీ:** పాకిస్థాన్‌కు సంబంధించిన వెబ్ కంటెంట్‌పై కేంద్రం నిషేధం విధించింది. దాయాది దేశం కేంద్రంగా పని చేస్తున్న ఓటీటీ కంటెంట్‌ను నిలిపివేస్తూ ఆదేశాలిచ్చింది. దీంతో పాక్ వెబ్ సిరీస్, సినిమాలు, పాటలు, పాడ్ కాస్ట్ సహా మీడియా కంటెంట్ సేవలన్నీ రద్దు చేయాలంటూ ఉత్తర్వులు జారీ చేసింది. అన్ని రకాల మీడియా కంటెంట్ తొలగించాలని భారత్‌కు చెందిన ఓటీటీ సంస్థలకు కేంద్రప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలిచ్చింది.

## డ్రోన్ల వినియోగంపై నిషేధం

**లేహ్:** లదాక్ కేంద్ర పాలిత ప్రాంతంలో డ్రోన్లు, యూఏవీలపై నిషేధం విధించారు. డ్రోన్లను దుర్వినియోగం చేసే అవకాశాలు ఉన్నాయని, జాతి వ్యతిరేకులు వాటిని తప్పుగా వాడే అవకాశం ఉందని అధికారులు హెచ్చరించారు. స్థానికులు, పర్యాటకులు, ప్రైవేటు వ్యక్తులు డ్రోన్లు ఎగురవేయరాదని లేహ్ జిల్లా మెజిస్ట్రేట్ సంతోశ్ సుఖదేవ్ తన ఆదేశాల్లో తెలిపారు. ఒకవేళ ఎవరైనా ఆదేశాలు ఉల్లంఘిస్తే... న్యాయపరమైన కఠిన చర్యలు ఉంటాయని ఆయన వెల్లడించారు. ప్రజల రక్షణ, భద్రత దష్ట్యా ఈఆదేశాలు ఇచ్చినట్లు చెప్పారు. పాకిస్థాన్‌తో పాటు పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో ఉగ్రవాద స్థావరాలను భారత రక్షణ దళాలు ధ్వంసం చేసిన తర్వాత స్థానిక ప్రభుత్వం ఈ ప్రకటన చేసింది. భారతీయ నాగరిక సురక్షా సంహితలోని సెక్షన్ 163 ప్రకారం చర్యలు తీసుకోనున్నట్లు ప్రభుత్వం పేర్కొన్నది. డ్రోన్ల కదలికలు కనిపిస్తే తక్షణమే పోలీసులకు సమాచారాన్ని ఇవ్వాలని చెప్పారు. విమానాలు రద్దు కావడం వల్ల చిక్కుకుపోయిన టూరిస్టులకు బస ఏర్పాట్లు కల్పించనున్నట్లు తెలిపారు.

# సరిహద్దు బంద్

### రాజస్థాన్-పంజాబ్ సరిహద్దులో హైటెన్షన్

### విమానాశ్రయాలు బంద్




**న్యూఢిల్లీ :** 'ఆపరేషన్ సిందూర్' తర్వాత భారత్ అప్రమత్తమైంది. పాకిస్థాన్‌తో సరిహద్దు ఉన్న రాష్ట్రాల్లో హైఅలర్ట్ కొనసాగుతోంది. ఏ తరహా పరిస్థితి ఎదురైనా దీటుగా బదులిచ్చేందుకు భద్రతా చర్యలు యుద్ధప్రాతిపదికన జరుగుతున్నాయి. ఈ క్రమంలోనే రాజస్థాన్‌లో 1,037 కిలోమీటర్ల మేరకు ఉన్న పాక్ సరిహద్దును సీల్ చేశారు. అంతేకాకుండా ఎవరైనా సరిహద్దుల వద్ద అనుమానాస్పదంగా వ్యవహరిస్తే, కాల్చివేసేలా ఉత్తర్వులు జారీ చేశారు. ఇక భారత్ వాయుసేన కూడా పూర్తిగా అప్రమత్తమైంది. పాకిస్థాన్ సరిహద్దుల్లో ఉన్న రాష్ట్రాల్లోని విమానాశ్రయాలను మూసివేశారు. గనతలంలో యుద్ధవిమానాల గస్తీ కాస్తున్నారు. ఇక్కడ మిసైల్ డిఫెన్స్ వ్యవస్థలను యాక్టివేట్ చేశారు. పెరుగుతున్న ఉద్రిక్తత మధ్య, పంజాబ్‌లోని ఆరు సరిహద్దు జిల్లాలు ఫిరోజ్‌పూర్, పఠాన్‌కోట్, ఫాజిల్కా, అమృత్‌సర్, గురుదాస్‌పూర్స తర్న్ తరన్‌లోని అన్ని పాఠశాలలను తదుపరి ఆదేశాలు వచ్చే వరకు మూసివేయాలని ప్రభుత్వం ఆదేశించింది. పాకిస్థాన్‌తో పంజాబ్ 532 కి.మీ సరిహద్దును పంచుకుంటుంది. అందువల్ల, ఏదైనా సైనిక ఉద్రిక్తత సమయంలో పంజాబ్ ప్రభుత్వ పాత్ర కీలకంగా మారుతుంది. సరిహద్దుకు సమీపంలో ఉన్న అన్నిజిల్లాలను ప్రభుత్వం అప్రమత్తం చేసింది. ప్రస్తుత పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని అన్నిప్రభుత్వ కార్యక్రమాలను సర్కారు రద్దు చేసింది. అవసరమైతే పంజాబ్ పోలీసులు కూడా రెండవ శ్రేణి రక్షణ వ్యవస్థగా పాకిస్థాన్‌కు దీటుగా స్పందించడానికి సైన్యంతో చేరతారని మంత్రి అమన్ అరోరా తెలిపారు. భద్రతా చర్యల్లో భాగంగా మే 10 వరకు ఉత్తర, వాయవ్య రాష్ట్రాల్లోని 21కి పైగా విమానాశ్రయాలు మూసివేయాలని కేంద్రం ఆదేశించింది. తదుపరి నోటీసు వచ్చేవరకు ఎలాంటి రాకపోకలు ఉండకూడదని స్పష్టం చేసింది. రాజస్థాన్‌లోని జోధ్‌పూర్, బికనేర్, కిషన్‌ఘర్ విమానాశ్రయాలను మూసివేశారు. ఇకచర్యల్లో భాగంగా అమృత్‌సర్ విమానాశ్రయాన్ని మూసివేస్తున్నట్లు అధికారులు తెలిపారు. పంజాబ్ అంతటా హైఅలర్ట్ ఉందనీ, బహిరంగప్రదేశాల్లో జనాలు గుమిగూడకూడదని సూచించారు. భద్రతా చర్యల్లో భాగంగా పోలీసు అధికారులకు అన్నిరకాల సెలవులను రద్దు చేసినట్టు తెలిపారు. తక్షణమే సిబ్బంది విధులకు హాజరుకావాలని పేర్కొన్నారు.

## పాక్ దాడి చేస్తే మా సైన్యం ఊరుకోదు

### ఇరాన్ మంత్రితో భేటీలో జైశంకర్



**న్యూఢిల్లీ:** పాకిస్థాన్‌తో ఉద్రిక్తతలు తీవ్రతరం చేయాలనే ఉద్దేశం భారతదేశానికి లేదని, కానీ తమ దేశంపై సైనిక దాడులు జరిపితే గట్టి సమాధానం ఇస్తామని విదేశాంగమంత్రి ఎస్.జైశంకర్ స్పష్టం చేశారు. ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరఘ్చితో గురువారం జరిగిన సమావేశంలో జైశంకర్ ఈవ్యాఖ్యలు చేశారు. పహల్గాం ఉగ్రవాద దాడిని గుర్తుచేసిన ఆయన...భారత సరిహద్దు దాటి ఉగ్రవాద మౌలిక సదుపాయాలపై మాత్రమే దాడులు చేసినట్లు స్పష్టం చేశారు. ఈ అంశంపై పొరుగు దేశం, సన్నిహిత భాగస్వామి అయిన ఇరాన్ ఈ పరిస్థితిని అర్థం చేసుకోవడం చాలా ముఖ్యమని జైశంకర్ అన్నారు. కాగా భారత దేశం, పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు పెరుగుతున్న నేపథ్యంలో ఇరాన్ విదేశాంగ మంత్రి నిన్న రాత్రి అర్ధరాత్రి న్యూఢిల్లీ చేరుకున్నారు. ప్రస్తుతం ఆయన మన దేశంలోనే ఉన్నారు. మరోవైపు... భారత్‌పాక్ ఉద్రిక్తతలు తారస్థాయికి చేరుకొన్న వేళ సౌదీ అరేబియాకు చెందిన ఓ జూనియర్ మంత్రి హఠాత్తుగా న్యూఢిల్లీకి వచ్చారు. ఆ దేశ విదేశీ వ్యవహారాల శాఖ జూనియర్ మంత్రి అదెల్ అల్ జుబైర్ గురువారం ఇక్కడికి వచ్చారు. ఆయన విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్‌తో చర్చలు జరిపారు. భారత్‌పాక్ మధ్య ఉద్రిక్తతలు చల్లార్చే చర్యల్లో భాగంగా ఈ పర్యటన చేపట్టినట్లు తెలుస్తోంది.

## ఫేక్ యుద్ధానికి తెరలేపిన పాక్

### 'ఫ్యాక్ట్ చెక్'తో బదులిచ్చిన భారత్

**న్యూఢిల్లీ:** పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత్ 'ఆపరేషన్ సిందూర్' తో పాక్‌కు గట్టి బదులిచ్చింది. ఈ దాడితో పాక్ ఉక్కిరిబిక్కిరి అవుతోంది. దిక్కుతోచని స్థితిలో భారత్‌పై విషం చిమ్మే ప్రయత్నం చేస్తోంది. ఈ క్రమంలో 'ఫేక్ యుద్ధానికి' తెరలేపింది. సోషల్ మీడియా వేదికగా ఫేక్ ప్రచారం మొదలు పెట్టింది. ఆపరేషన్ సిందూర్ తర్వాత భారత్‌పై తమ సైన్యం దాడులు చేసినట్లు సోషల్ మీడియా వేదికగా తప్పుడు వార్తలు ప్రచారం చేస్తోంది. భారత్‌లోని ఐదునగరాలపై దాడులు చేసినట్లు చెప్పుకుంటోంది. ఇందుకు సాక్ష్యంగా పాతఫొటోలు, వీడియోలను సోషల్ మీడియాలో పోస్టుచేసి భారత్‌పై దుష్ప్రచారం చేస్తోంది. అమత్‌సర్‌లోని మిలిటరీ బేస్‌పై మిస్సైళ్ల దాడి చేసినట్లు కూడా ప్రచారం చేస్తోంది. అయితే, పాక్‌ఫేక్ ప్రచారాన్ని భారత్ సమర్థవంతంగా తిప్పికొడుతోంది. పీఐబీ ఫ్యాక్ట్‌చెక్‌తో ఆధారాలతో సహా పాక్ తప్పుడు ప్రచారాన్ని బయటపెట్టింది.

## అన్ని జాగ్రత్తలు తీసుకున్నాం

### కర్ణాటక సిఎం సిద్ధరామయ్య



**బెంగళూరు:** ఆపరేషన్ సిందూర్ తర్వాత భారత్, పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు పెరుగుతున్న నేపథ్యంలో తమ ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా హెచ్చరికలు జారీ చేసిందని, ముందు జాగ్రత్త చర్యలు తీసుకుందని కర్నాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య గురువారం అన్నారు. భద్రతా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని కేంద్రప్రభుత్వం ఇ చ్చిన సూచనలను పాటిస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలోని ఆనకట్టలు, ఇతర ముఖ్యమైన సంస్థాపనల వద్ద భద్రతను పెంచారా అనే ప్రశ్నకు సిద్ధరామయ్య సమాధానమిస్తూ... 'ఎప్పుడయినా ఏదైనా జరగవచ్చు. అందువల్ల మేము ప్రతిచోటా హెచ్చరికలు జారీచేశాం. జాగ్రత్తలు తీసుకున్నాం' అని చెప్పారు. అన్ని చోట్లా మాక్ డ్రిల్స్ జరుగుతున్నాయని, కేంద్రం జారీ చేసిన సూచనలను పాటిస్తున్నామని ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ అన్నారు. కర్నాటకలో ఇప్పటికీ ఉన్న కొంతమంది పాక్ జాతీయులను బహిష్కరించడానికి రాష్ట్ర ప్రభుత్వం చర్య తీసుకోలేదని బీజేపీ చేస్తున్న ఆరోపణల గురించి అడిగినప్పుడు... ముఖ్యమంత్రి మాట్లాడుతూ 'దాదాపు అందరూ వెళ్లిపోయారు. మైసూరు నుంచి ఒక కుటుంబం కోర్టుకు వెళ్లింది. అలాంటి కేసులు మాత్రమే ఇప్పటికీ ఉండవచ్చు, లేకుంటే అందరూ వెళ్లిపోయారు' అని తెలిపారు. రాష్ట్రంలో ఇంకా ఎంత మంది పాకిస్తానీలు ఉన్నారనే దానిపై తనవద్ద కచ్చితమైన సమాచారం లేదన్నారు. కర్నాటక హిందూ మత సంస్థలు, ధార్మిక దేవాదాయ శాఖ పరిధిలోకి వచ్చే అన్ని దేవాలయాలలో సాయుధ దళాల శ్రేయస్సు కోసం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించాలని దేవాదాయ శాఖ మంత్రి రామలింగారెడ్డి తనతో మాట్లాడి సూచనలు ఇచ్చారని సిద్ధరామయ్య అన్నారు.

## శక్తివంతమైన ఆయుధ వ్యవస్థ ఎస్ 400

**న్యూఢిల్లీ :** ఆపరేషన్ సిందూర్‌కు ప్రతీకారంగా పాకిస్థాన్ వైమానిక, క్షిపణి దాడులకు దిగితే నిలువరించే అత్యంత శక్తిమంతమైన ఆయుధ వ్యవస్థ ఎస్ 400. శత్రువుల యుద్ధవిమానాలు, క్షిపణులు, డ్రోన్లను మార్గమధ్యంలోనే పేల్చివేయడంలో దీనికి తిరుగులేదు. ప్రస్తుత ఉద్రిక్త పరిస్థితుల్లో భారత బలగాలు ఈ ఆయుధ వ్యవస్థను క్రియాశీలం చేసినట్లు తెలుస్తోంది.

### ఏమిటీ ఎస్ -400?

ఇది సంచార క్షిపణి వ్యవస్థ. రష్యాకు చెందిన ఎన్‌పిఒ అల్మాజ్‌సంస్థ అభివృద్ధి చేసింది. గతంలో ఉన్న ఎస్ 300ను ఆధునికీకరించి, దీన్ని రూపొందించింది. ప్రస్తుతం మరింత మెరుగైన ఎస్ 500 గగనతల రక్షణ వ్యవస్థను అభివృద్ధి చేస్తోంది. ప్రత్యర్థి జామింగ్ విధానాలను ఎస్ 400 తట్టుకోగలదు. ఇది యుద్ధవిమానాలు,



డ్రోన్లు, క్రూజ్ క్షిపణులు, బాలిస్టిక్ క్షిపణులను అత్యంత కచ్చితత్వంతో నేలకూల్చగలదు. మొత్తం ఐదు క్షిపణి వ్యవస్థల కొనుగోలుకు భారత్.. 2018లో రష్యా తో 543 కోట్ల డాలర్ల ఒప్పందాన్ని కుదుర్చుకుంది. ఇందులో మూడు వ్యవస్థలు ఇప్పటికే భారత్ చేరాయి. మిగతావి వచ్చే ఏడాది ఆగస్టులో అందే అవకాశం ఉంది. పాకిస్థాన్ నుంచి ఎదురయ్యే ముప్పుల కోసం పంజాబ్‌లో, రాజస్థాన్‌లలో ఒక్కొక్కటి చొప్పున ఎస్ 400 వ్యవస్థలను మోహరించినట్లు తెలుస్తోంది. చైనా నుంచి రక్షణ కోసం అరుణాచల్ ప్రదేశ్ లేదా అసోంలో ఒక వ్యవస్థను రంగంలోకి దించి ఉంటారని అంచనా.

### స్వదేశీ వ్యవస్థలు

స్వదేశీ క్షిపణి రక్షణ వ్యవస్థ కోసం భారత్.. ప్రాజెక్టు కుశను చేపట్టింది. ఇది దీర్ఘశ్రేణి వ్యవస్థ. ఇది.. ఉపరితలం నుంచి గగనతలంలోని లక్ష్యాలను ఛేదించగల దీర్ఘశ్రేణి అస్త్రాలను నిలువరించడానికి ఉపయోగపడుతుంది. రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ (డిఆర్‌డిఒ) దీన్ని అభివృద్ధి చేస్తోంది. ఇందులో 150 నుంచి 350 కిలోమీటర్ల పరిధి కలిగిన భిన్నరకాల క్షిపణులు ఉంటాయి. సమర్థత విషయంలో ఇదిఎస్ 400కు, ఇజ్రాయెల్‌కు చెందిన ఐరన్ డోమ్ వ్యవస్థకు ఏ మాత్రం తీసిపోదు. ఇది స్టెల్త్ యుద్ధవిమానాలు, క్రూజ్ క్షిపణులు, డ్రోన్లను నేలకూల్చగలదు.

## సలాల్ డ్యామ్ నుంచి పాక్‌కు నీటి విడుదల

**న్యూఢిల్లీ:** భారత్‌పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతల నడుమ సింధూ జల సంధి రద్దు నేపథ్యంలో దాయాది దేశానికి భారత్ నీరందించింది. రియాసీలో చీనాబ్ నదిపై నిర్మించిన సలాల్ డ్యామ్ నుంచి స్వల్పంగా నీటిని విడుదల చేసింది. మొత్తం మూడు గేట్ల ఎత్తివేసి దిగువకు నీరు వదిలింది. సలాల్ డ్యామ్ నుంచి నీరు దిగువకు విడుదల చేసిన దశ్యాలు సామాజిక మాధ్యమాల్లో కనిపించాయి.

## గంగోత్రి యాత్రలో విషాదం

### హెలికాప్టర్ కూలి పైలట్ సహా ఆరుగురి దుర్మరణం

### ఎపి నుంచి వెళ్లిన ఇద్దరు : ఒకరి మృతి, మరొకరి పరిస్థితి విషమం



**డెహ్రాడూన్:** ఉత్తరాఖండ్, గంగోత్రికి బయల్దేరిన భక్తుల హెలికాప్టర్ కూలిపోయింది. పైలట్ సహా ఆరుగురు చనిపోయారు. తీవ్రగాయాలతో ఒకరి పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. ఈ దుర్ఘటన ఉత్తరకాశి జిల్లాలో గురువారం జరిగింది. ఎయిరో ట్రాన్స్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ (వీటీఓఎక్స్‌ఎఫ్) సంస్థ నడిపే హెలికాప్టర్... డెహ్రాడూన్‌లోని సహస్త్రధార హెలిప్యాడ్ నుంచి ఖర్సాలీ హెలిపాడ్‌కు బయల్దేరింది. గంగోత్రికి వెళ్లేమార్గంలో ప్రమాదానికి గురైంది. రిషికేశ్‌గంగోత్రి జాతీయ రహదారి వద్ద ఉదయం కూలిన హెలికాప్టర్ 200250 మీటర్ల లోతైన లోయలోకి పడిపోయింది. ఈ మేరకు సహాయక చర్యలు చేపట్టిన ఎస్‌డీఆర్‌ఎఫ్ తెలిపింది. ఆరుగురు ప్రయాణికులు అక్కడికక్కడే మరణించినట్లు జిల్లా మెజిస్ట్రేట్ మెహర్బాన్ సింగ్ బిస్త్ తెలిపారు. భక్తుల్లో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఎం.భాస్కర్ (51) తీవ్రంగా గాయపడగా, ఆయనను ఎయిర్‌లిఫ్ట్ చేసి రిషికేశ్ ఎయిమ్స్‌లో చేర్చారు. ఆంధ్రప్రదేశ్ నుంచి వెళ్లిన మరొకరు మృతిచెందారు. మృతులను ముంబైకు చెందిన కళా చంద్రకాంత్ సోని(61), విజయ రెడ్డి (57), రుచి అగర్వాల్ (56), యూపీకి చెందిన రాధా అగర్వాల్(79) ఏపీకి చెందిన వేదవతి కుమారి(48), గుజరాత్‌కు చెందిన కెప్టెన్ రాబిన్ సింగ్(60)గా గుర్తించారు. ఈ ఘటనపై ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. దర్యాప్తునకు ఆదేశించారు. గాయపడిన వారికి అవసరమైన సహాయం అందించాలన్నారు. అధికారుల నుంచి ఎప్పటికప్పుడు సమాచారం తెలుసుకున్నారు. ఈ ప్రమాదంపై విమాన దుర్ఘటనల దర్యాప్తు బ్యూరో (ఏఏఐబీ) విచారణ చేపడుతుందని అధికారులు వెల్లడించారు.

## 15న విచారిస్తాం

### ఆర్టీఐ పరిధిలోకి రాజకీయ పార్టీలను తెచ్చే పిటిషన్లపై సుప్రీం

**న్యూఢిల్లీ:** ప్రధాన రాజకీయ పార్టీలను ఆర్టీఐ పరిధిలోకి తేవాలన్న పిటిషన్‌పై విచారణను సర్వోన్నత న్యాయస్థానం వాయిదా వేసింది. ఎన్నికలప్పుడు నల్ల ధనం వినియోగాన్ని అరికట్టేందుకు, జవాబుదారీతనానికి హామీ ఇచ్చేందుకు ప్రధాన రాజకీయ పార్టీలను సమాచార హక్కుల చట్టం (ఆర్టీఐ) పరిధిలోకి తేవాలని కోరుతూ ప్రజా ప్రయోజన వ్యాజ్యాల (పిల్)ను ప్రజాస్వామిక సంస్కరణల సమాఖ్య (ఏడీఆర్), న్యాయవాది అశ్విని ఉపాధ్యాయ దాఖలు చేశారు. వీటిని ప్రధాన న్యాయమూర్తి సంజీవ్ ఖన్నా, జస్టిస్ సంజయ్ కుమార్‌తో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారించాల్సి ఉంది. ఇప్పుడు కాదు ఈనెల 15న వీటిని విచారిస్తామని సీజేఐ చెప్పారు. విచారణను నాన్‌మిస్లీనియస్ రోజున చేపడతామన్నారు. అప్పటిలోగా అభ్యర్థనలు పూర్తి చేయాలని సూచించారు. ఏడీఆర్ తరపున ప్రముఖ న్యాయవాది ప్రశాంత్ భూషణ్ వాదనలు వినిపించారు. తమ ఫిర్యాదు పదేళ్లుగా పెండింగ్‌లో ఉందని కోర్టుకు చెప్పారు. రాజకీయ పార్టీలు ప్రభుత్వ సంస్థలేనని, వాటిని ఆర్టీఐ చట్టం పరిధిలోకి తేవడం అవసరమని అన్నారు. ఇదే వ్యవహారంలో 2015, జులై 7న కేంద్రం, ఎన్నికల కమిషన్, కాంగ్రెస్, బీజేపీ, సీపీఐ, ఎన్‌సీపీ, బీఎస్‌పీ సహా ఆరు పార్టీలకు సుప్రీం కోర్టు నోటీసులు ఇచ్చింది. 2019లో న్యాయవాది ఉపాధ్యాయ ఇదే తరహా పిటిషన్ వేశారు. రూ.20వేల కంటే తక్కువగా ఉన్న వాటితో సహా విరాళాల వివరాలన్నింటిని బహిర్గతం చేసేలా రాజకీయ పార్టీలకు ఆదేశాలివ్వాలని కోరుతూ ఏడీఆర్ మరొక పిటిషన్ కూడా దాఖలు చేసింది.

## సోనియా, రాహుల్‌పై విచారణ 21కి వాయిదా



**న్యూఢిల్లీ:** కాంగ్రెస్ అగ్రనాయకులు సోనియా గాంధీ, రాహుల్ గాంధీపై ఉన్న నేషనల్ హెరాల్డ్ మనీ లాండరింగ్ కేసులో విచారణను దిల్లీ కోర్టు మే 21, 22 తేదీలకు వాయిదా వేసింది. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) దాఖలు చేసిన వాదనలను విన్న ప్రత్యేక న్యాయమూర్తి విశాల్ గోగ్నే మాట్లాడుతూ సహ నిందితుడు శ్యామ్ పిట్రోడాకు ఇమెయిల్ ద్వారా నోటీసు పంపినందున, తదుపరి తేదీన ఛార్జిషీట్ పరిశీలనపై వాదనలు వినడం సముచితమని గురువారం ఆయన అన్నారు. ఫిర్యాదుదారుడు, బీజేపీ నాయకుడు సుబ్రమణ్యస్వామి ఈడీ ఛార్జిషీట్ కాపీ కోరినప్పుడు ముందుగా ఈడీ వైఖరి వినాలని కూడా కోర్టు నిర్ణయించింది. మే 2న కాంగ్రెస్ మాజీ అధ్యక్షురాలు సోనియా గాంధీ, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీకి కోర్టు నోటీసులు జారీ చేసింది. కాంగ్రెస్ నాయకుడు పిట్రోడా, సుమన్ దూబే, 'యంగ్ ఇండియన్', డోటెక్స్ మర్చండైజ్ ప్రైవేట్ లిమిటెడ్, సునీల్ భండారీకి నోటీసులు జారీ చేసింది. ఛార్జిషీట్ పరిశీలన సమయంలో వారి 'వినే హక్కు' అందుబాటులో ఉందని న్యాయమూర్తి చెప్పారు. 'ఏ దశలోనైనా వాదనలు వినిపించుకునే హక్కు న్యాయమైన విచారణకు ప్రాణం పోస్తుంది' అని న్యాయమూర్తి మే 8వ తేదీకి కేసును వాయిదా వేస్తూ అన్నారు. ఈ కేసులో ఛార్జిషీట్‌ను మనీలాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్‌ఏ) సెక్షన్ 3 (మనీ లాండరింగ్), సెక్షన్ 4 (మనీ లాండరింగ్ శిక్ష) కింద దాఖలు చేశారు. జూన్ 26, 2014న స్వామి దాఖలు చేసిన ప్రైవేట్ ఫిర్యాదును మేజిస్ట్రేట్ కోర్టు పరిగణనలోకి తీసుకున్న తర్వాత ఇటీవల ఛార్జిషీట్ దాఖలు చేసిన ఈడీ 2021లో తన దర్యాప్తును ప్రారంభించింది.

## 242 కాలువల సర్వేకు ఆదేశం



**ప్రజాపక్షం/యాదాద్రి** : హెచ్ఎండిఏ పరిధిలో ఉన్న 242 కాలువలకు సంబంధించినా సర్వే చేసి నివేదిక సిద్ధం చేయాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ వీరారెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఇరిగేషన్ డీఈలు, ఏఈలు, సర్వేయర్‌లతో రెవెన్యూ అదనపు కలెక్టర్ వీరా రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రెవెన్యూ అదనపు కలెక్టర్ వీరా రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో 242 సంబంధించిన కాలువలు, చెరువుల వారిగా సంబంధిత అధికారులతో సమీక్షించి సర్వే చేసి ప్రైమరీ నోటిఫికేషన్, ఫైనల్ నోటిఫికేషన్ నివేదిక సిద్ధం చేసి సంబంధిత పై స్థాయి అధికారులకు నివేదికను సమర్పించాలని అన్నారు. సమావేశంలో భువనగిరి ఆర్డిఓ కృష్ణారెడ్డి, డిప్యూటీ ఇరిగేషన్ నరసింహా, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## లైసెన్స్ సర్వేయర్ల శిక్షణకి మీసేవ ద్వారా దరఖాస్తులు



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్:** తెలంగాణ ప్రభుత్వం భూసంబంధిత సమస్యలను పరిష్కరించడానికి ప్రతిష్టాత్మకమైన భూభారతి (భూమిలో హక్కుల రికార్డు) చట్టం 2025 రూపొందించడం జరిగిందని చట్టం అమలులో బాగంగా రెవిన్యూ అడ్మినిస్ట్రేషన్ సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ డిపార్ట్‌మెంట్ సహాయం కోసం జిల్లాలో లైసెన్స్ సర్వేయర్లకు శిక్షణ ఇవ్వడానికి లైసెన్స్ సర్వేయర్లనుండి దరఖాస్తులను మీసేవ ద్వారా 5/5/2025 నుండి 17/5/2025 వరకు ఆహ్వానించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు ఈ లైసెన్స్ పొందిన సర్వేయర్లకు శిక్షణ ఇచ్చిన తదుపరి జిల్లాలో లైసెన్స్ సర్వేయర్లుగా నియమించబడుతుందని కలెక్టర్ తెలిపారు. లైసెన్స్ సర్వేయర్లకి 26/05/2025 నుండి 26/07/2025 వరకు ఇవ్వడం జరుగుతుందని సర్వేయర్లు మీసేవ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని కోరారు.



## కార్పొరేట్ వైద్యం అభినందనీయం

### రాష్ట్ర భారీ నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

**ప్రజాపక్షం/కోదాడ:** నగరాలకే పరిమితమైన కార్పోరేట్ స్థాయి వైద్యం కోదాడకు అందుబాటులోకి తేవడం అభినందనీయమని రాష్ట్ర బారీనీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. గురువారం కోదాడ పట్టణంలోని హుజూర్‌నగర్ రోడ్డులో ఫ్లై ఓవర్ వద్ద ఏర్పాటు చేసిన శ్రీ వెంకటేశ్వర మల్టీస్పెషాలిటి హాస్పటల్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. కోదాడ, హుజూర్‌నగర్ ప్రాంత ప్రజలకు అందుబాటులో కార్పోరేట్ వైద్యాన్ని అందించాలని వైద్యులకు సూచించారు. పూర్తి వ్యాపార దృక్పదంతో కాకుండా వైద్యులు సేవా దృక్పదంతో పేద మద్య తరగతి ప్రజలకు సేవలందించాలన్నారు. వైద్యశాలలో అత్యాధునిక సదుపాయలు అందుబాటులో ఉన్న వైద్య సేవల వివరాలను నిర్వాహకులు డాక్టర్ శివప్రసాద్ రావూరి మంత్రికి వివరించారు. అనంతరం వైద్యశాల నిర్వాహకులు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌వివిఎస్ వైద్య బృందం, కోదాడ పట్టణ ప్రముఖ వైద్యులు జాస్తి సుబ్బారావు, కోదాడ, హుజూర్‌నగర్ ఎంఐఎం వైద్యులు తదితరులుపాల్గొన్నారు.

## శాంతిభద్రత రక్షణలో ముందస్తు భద్రత చర్యలు : ఎస్‌పి



**ప్రజాపక్షం/సూర్యాపేటటౌన్:** దేశ సరిహద్దు వెంట ఏర్పడిన ఉద్రిక్త పరిస్థితుల దృష్ట్యా జిల్లాలో పోలీస్‌శాఖ రక్షణ, శాంతిభద్రత రక్షణలో ముందస్తు భద్రత చర్యలు తీసుకోవడం జరిగిందని జిల్లా ఎస్పీ కె.నర్సింహా అన్నారు. గురువారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో జిల్లా సెక్యూరిటీ సిబ్బంది, డాగ్ సిబ్బంది, బాంబ్ స్క్వాడ్ సిబ్బంది బస్టాండ్‌లు, జాతీయ రహదరి, ఫ్లైఓవర్‌ల, వ్యాపార సముదాయాలు ముఖ్యమైన కూడళ్ల వద్ద హై సెక్యూరిటీ తనిఖీలు నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా సిబ్బందిని అందరిని అప్రమత్తం చేశామన్నారు. ప్రభుత్వ అదేశాల దృష్ట్యా పోలీసులకు సెలవులు రద్దు చేసి 24 గంటలు విధుల్లో ఉండేలా అదేశాలు చేశామన్నారు. సరిహద్దులో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల దృష్ట్యా పౌరుల దేశ భద్రత్కు, ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఎవరు సోషల్ మీడియాలో అనుచిత పోస్టింగ్‌లు, అనుచిత వ్యాఖ్య లు పెట్టవద్దన్నారు. సోషల్ మీడియాపై పోలీస్‌శాఖ పూర్తిస్థాయిలో నిఘా ఉంచిందని తెలిపారు. ఆయన వెంట పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## 20న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె

### సివిల్ సప్లై హమాలీ కార్మికుల సమ్మె నోటీస్ : పల్లా




**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** కేంద్ర ప్రభుత్వం ఆలంపిస్తున్న కార్మిక ప్రజా వ్యతిరేక విధాన నిరసిస్తూ ఈనెల 20న జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి,సివిల్ సప్లై హమాలీస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు పల్లా దేవేందర్ రెడ్డి కార్మికులకు పిలుపునిచ్చారు. ఎఐటియుసి ఆధ్వర్యంలో గురువారం నల్లగొండ సివిల్ సప్లై కార్యాలయంలో అసిస్టెంట్ మేనేజర్ రేణుక కు సమ్మె నోటీసు ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా దేవేందర్ రెడ్డి మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం 39 కార్మిక చట్టాలను సమూలంగా మార్చి4 లేబర్ కోడ్ లుగా తీసుకొచ్చి కార్మిక హక్కులను హరిస్తున్న కేంద్ర ప్రభుత్వ విధానాలను తిప్పి కొట్టాలని కోరారు. హమాలీ కార్మికులకు సమగ్ర చట్టం రూపొందించాలని బీమా సౌకర్యం కల్పించాలని నూతన గోదాముల నిర్మించి స్టోరేజ్ సామర్థ్యాన్ని పెంచాలని ఆయన కోరారు. ప్రజా పంపిణీ వ్యవస్థ బలోపేతం చేయడం కోసం కేంద్ర ప్రభుత్వం ఏలాంటి చర్యలు తీసుకోవట్లేదు అని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లై హమాలీస్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి దోనకొండ వెంకన్న, ఎఐటియుసి జిల్లా ఉపాధ్యక్షులు కేఎస్ రెడ్డి,డివిజన్ కార్యదర్శి విశ్వనాధులు లెనిన్,యూనియన్ నాయకులు ఎస్ జానయ్య, పి నాగరాజు, జానీ తదితరులు పాల్గొన్నారు.

## బ్రహ్మకుమారీస్ కృషి అభినందనీయం : ఎస్‌పి

**ప్రజాపక్షం/జోగులాంబ గద్వాల ప్రతినిధి:** మత్తు పదార్థాల వినియోగానికి వ్యతిరేకంగా అవగాహన కల్పించడంతో పాటు వాటికి ఆకర్షితులు అయిన యువతను తిరిగి యథాస్థితికి తీసుకువచ్చేందుకు బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయా విశ్వవిద్యాలయం వారు చేస్తున్నా కృషి అభినందనీయమని జిల్లా ఎస్పీ టి.శ్రీనివాస రావు ఐపిఎస్ అన్నారు. మత్తు పదార్థాల వినియోగానికి వ్యతిరేకంగా జిల్లాలోని పట్టణ గ్రామీణ ప్రాంతాల్లో యువతకు అవగాహన కల్పించేందుకు బ్రహ్మకుమారీస్ ఈశ్వరియా విశ్వవిద్యాలయం వారు ఏర్పాటు చేసిన వ్యసనముక్త భారత్ అభియాన్ ర్యాలీని జిల్లా ఎస్పీ జిల్లా కేంద్రంలోని బ్రహ్మ కుమారీస్ కేంద్రం వద్ద జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, వాటికి అలవాటు పడి తమ విలువైన బంగారు భవిష్యత్తును వినాశనం చేసుకోవద్దని అన్నారు. ఈ కార్యక్రమంలో డిఎస్పీ వై.మొగిలయ్య, ప్రజాపిత బ్రహ్మకుమారీ ఈశ్వరీయ విశ్వత విద్యాలయం రాజ యోగి మంజుల, గద్వాల్ సిఐ టంగుటూరు శ్రీను, రూరల్ ఎస్సై శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



# అర్హులైన పేదలకు ఇండ్లు కట్టిస్తాం

### మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి



**ప్రజాపక్షం/చిట్యాల(నకిరేకల్)** : కాంగ్రెస్ ప్రభుత్వ హాయంలోనే రాష్ట్ర వ్యాప్తంగా ఇరవై లక్షల ఇందిరమ్మ ఇండ్లను అర్హులైన పేదవారికి కట్టించిస్తామని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. గురువారం నకిరేకల్ మండల కేంద్రంలోని ఎంపిడివో కార్యాలయంలో నిర్మించిన ఇందిరమ్మ ఇంటి నమూనాను మంత్రి ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పేదవాడు సోంతింటి కళ నేర్చేందుకే ఇందిరమ్మ ఇండ్లు నిర్మాణం చేపట్టామని, ఇట్టి ప్రక్రియ పారదర్శకంగా ఇల్లు లేని నిరుపేద కుటుంబానికి మొదటి విడతలో కేటాయిస్తున్నట్లు ఆయన తెలిపారు. రాబోయే నాల్గు సంవత్సరాలలో విడతల వారీగా అర్హులైన పేదవారందరికి ఇండ్లు ఇస్తామని, మొదటి విడతలో ప్రతి నియోజకవర్గానికి 3500 ఇళ్ళను మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా అర్హులైన పేదవారందరికి 20 లక్షల ఇండ్లను రూ.5 లక్షలతో కట్టిస్తున్నట్లు ఆయన వివరించారు. అనంతరం జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్లను పారదర్శకంగా కేటాయిస్తున్నామని, ప్రతి గ్రామంలో ఇందిరమ్మ కమిటి ఏర్పాటు చేసి రెండు వందల ఇండ్లకు ఒక గెజిటేడ్ అధికారిని ఏర్పాటు చేసి సర్వే నిర్వహించిన తర్వాత జాబితా రూపొందించామని, ఆ జాబితాను ఇన్‌చార్జి మినిస్టర్ ఆమోదంతో లబ్ధిదారులకు ఇస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం,శంకర్ నాయక్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం , మిర్యాలగూడ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, మాజీ బిసి కార్పోరేషన్ ఛైర్మన్ అమిత్ రెడ్డి, జిల్లా ఎస్పి శరత్ చంద్ర పవార్ , మిర్యాలగూడ సబ్ కలెక్టర్ , ఇన్‌చార్జి రెవెన్యూ అదనపు కలెక్టర్ నారాయణ, పిడి రాజ్ కుమార్, ఆర్డీవో అశోక్ రెడ్డి, అధికారులు , ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గోన్నారు.



### గత ప్రభుత్వంలో గులాబీ కార్డులకే సంక్షేమ పథకాలు : ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం

గతి పది సంవత్సరాల కెసిఆర్ ప్రభుత్వంలో పేదలకు అందవలసిన ప్రభుత్వ సంక్షేమ పథకాలని గులాబీ కండువాలు కప్పుకున్న గులాబీ కార్డుదారులకే సంక్షేమ పథకాలను చెందాయని ఈ ప్రజా పాలనలోనైనా అర్హులైన పేదలకు సంక్షేమ పథకాలు అందే విధంగా చూడాలని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం ప్రభుత్వాన్ని కోరారు. నకిరేకల్ మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో నిర్మించిన నమూనా ఇందిరమ్మ ఇల్లును రాష్ట్ర రెవెన్యూ,గృహ నిర్మాణ,సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో ఎమ్మెల్సీ సత్యం మాట్లాడుతూ పేద ప్రజల సంక్షేమ కోసం ప్రభుత్వాలు ప్రవేశపెడుతున్న పథకాలను పేదవారికి చెందే విధంగా ఉండాల్సి ఉండగా గత ప్రభుత్వం అమలు చేసిన ట్రాక్టర్లు, దళితబంధు, రేషన్ కార్డు లాంటి తదితర పథకాలన్నీ గులాబీ పార్టీ నాయకులు,కార్యకర్తలకు చెందాయని ఆరోపించారు.

# భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు

### జిల్లా కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్




**ప్రజాపక్షం/గరిడేపల్లి:** భూ సమస్యలను సత్వరమే పరిష్కరించాలనే కృత నిశ్చయంతో ప్రభుత్వం భూ భారతి చట్టం రెవిన్యూ సదస్సులను నిర్వహిస్తోందని జిల్లా కలెక్టర్ తేజస్‌నంద్‌లాల్ పవార్ అన్నారు. భూభారతి పైలట్ ప్రాజెక్టుగా రెవిన్యూ సదస్సులో భాగంగా గురువారం వెలిదండ గ్రామ జడ్పి ఉన్నత పాఠశాలలో నిర్వహించిన అవగాహన సదస్సులో పాల్గొన్నారు. రైతు గుర్తింపు కార్డుల రిజిస్ట్రేషన్ ప్రక్రియ, దరఖాస్తుల స్వీకరణ, హెల్ప్ డెస్క్ తదితర వాటిని సందర్శించి రైతుల నుండి అర్జీలు స్వీకరిస్తున్న తీరును పరిశీలించారు. సదస్సులతో బేటి అయ్యి వారి సమస్యలను అడిగి తెలుసుకుని సందేశాలను నివృత్తి చేశారు. రెవిన్యూ అధికారులతో కూడిన బృందాలు అందుబాటులో ఉంటూ భూ సంబంధిత సమస్యలపై దరఖాస్తులు స్వీకరిస్తారని తెలిపారు. ప్రతి దరఖాస్తును క్షుణంగా పరిశీలించి, క్షేత్రస్థాయిలో విచారణ జరిపిన మీదట నిర్ణిత గడువులోగా సమస్యలను పరిష్కరించడం జరుగుతుందన్నారు. ప్రస్తుతం పైలట్ ప్రాతిపదికన గరిడేపల్లి మండలంలో కొనసాగుతున్న రెవిన్యూ సదస్సులు ముగిశాక జిల్లాలోని మిగతా మండలాల్లో గల అన్ని రెవిన్యూ గ్రామాల్లో భూభారతి రెవిన్యూ సదస్సులు నిర్వహించడం జరుగుతుందన్నారు. గానుగబండ రెవిన్యూ సదస్సులో 69 దరఖాస్తులు, వెలిదండ ర ఎవిన్యూ సదస్సులో 269 దరఖాస్తులు రైతుల నుండి స్వీకరించినట్లు కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో హుజూర్‌నగర్ ఆర్డీవో శ్రీనివాసులు, తహసిల్దార్ డిఎవో రాజేందర్‌రెడ్డి, కవిత, ఆర్‌ఐ రాంబాబు, ప్రవీణ్, రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

# 15న పోచంపల్లికి మిస్‌వరల్డ్ పోటీదారులు

### స్పెషల్ బ్రాంచ్ డిసిపి నరసింహారెడ్డి



**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి** : రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం హైదరాబాదులో అత్యంత ప్రతిష్టాత్మకంగా జరగనున్న 72వ మిస్ వరల్ పోటీలలో పాల్గొనే ప్రపంచ దేశాల సుందరీమణులు పోచంపల్లిని సందర్శించనున్న నేపథ్యంలో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లను చేస్తున్నట్లు స్పెషల్ బ్రాంచ్ డిసిపి నరసింహారెడ్డి తెలిపారు. మే 15న పోచంపల్లి చేనేత పరిశ్రమ కళా వారసత్వ సంపదను ప్రపంచానికి మరోసారి చాటి చెప్పేలా ప్రభుత్వం తరఫున చేనేత పరిశ్రమను ప్రోత్సహించి ఆదుకునే విధంగా చేస్తున్న కృషిలో భాగంగా పోటీదారులు పోచంపల్లిని సందర్శించనున్న నేపథ్యంలో రక్షణ భద్రత ఏర్పాట్లను పరిశీలించారు. పోలీస్ యంత్రాంగానికి సూచనలు సూచించారు. దేశ విదేశాల నుంచి విచ్చేయనున్న పోటీదారులకూ ప్రతినిధులకు రక్షణ కల్పించే విధంగా అడుగడుగునా పోలీస్ పహార కాచే విధంగా పటిష్టమైన బందోబస్తును ఏర్పాటు చేస్తున్నామని ఆయన స్పష్టం చేశారు. ప్రపంచ సుందరీమణులు పర్యటించే సమయంలో క్రమ పద్ధతిలో వారు వచ్చి వెళ్లేంతవరకు వ్యూహ ప్రతి వ్యూహాలను ప్రణాళికలను పోలీసు ఉన్నతాధికారులకు వివరించారు. రాష్ట్ర పోలీస్ ఉన్నతాధికార యంత్రాంగం సూచనల మేరకు మ్యాప్ ప్రకారం క్షణక్షణానికి ఎలా అప్రమత్తంగా ఉండాలో అధికారులకు ఆయన వివరించారు. ఇక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా ప్రతిక్షణం అప్రమత్తంగా ఉండాలని పోలీసులకు ఆయన ఆదేశాలు జారీ చేశారు. దేశ ప్రతిష్టతకు భంగం వాటిల్లకుండా భద్రత రక్షణ కవచలం ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు.ఎసిపి మధుసూదన్ రెడ్డి సిఐ రాములు ఎస్ఐ భాస్కర్ రెడ్డి స్పెషల్ బ్రాంచ్ పోలీస్ అధికారి బాణాల వెంకటరెడ్డి తదితర పోలీస్ అమితాధికారులు ఆయన వెంట ఉన్నారు.



## బుద్ధవనంలో మెడికల్ క్యాంపు ఏర్పాటు

**ప్రజాపక్షం/నందికొండ:** ఈనెల 12వ తేదీన వివిధ దేశాలకు చెందిన ప్రపంచ సుందరి పోటీదారులు నాగార్జునసాగర్ లోని బుద్ధ వనాన్ని సందర్శిస్తున్నందున బుద్ధ వనములో మెడికల్ క్యాంపును నిర్వహిస్తున్నట్లు నల్లగొండ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్ తెలిపారు. గురువారం ఆయన మెడికల్ క్యాంపు ఏర్పాట్ల పైబుద్ధవనం, విజయ విహార్ అతిథి గృహాన్ని సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మే12న వివిధ దేశాలకు చెందిన ప్రపంచ సుందరి పోటీదారులు నాగార్జునసాగర్ ను సందర్శిస్తున్న సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు వైద్య సిబ్బందితో మెడికల్ క్యాంపు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మెడికల్ క్యాంపు ఏర్పాటుకై మిస్ వరల్డ్ కాంపిటేటర్స్ సందర్శించే విజయ విహార్ అతిథిగృహం, బుద్ధవనాన్ని పరిశీలించామన్నారు. మిస్ వరల్డ్ పోటీదారులు ఎక్కువ సమయం కేటాయించే బుద్ధవనం వద్ద మెడికల్ క్యాంపు ను ఏర్పాటు చేస్తున్నట్లుగా తెలిపారు. దీనితో పాటు స్థానిక కమలా నెహ్రూ ఏరియా ఆసుపత్రిలో అన్ని వసతులతో, ఆధునిక మెడికల్ పరికరాలు, వివిధ గ్రూపులకు చెందిన రక్త నిధి నిల్వలను అందుబాటులో ఉండే విధంగా ఒక ప్రత్యేక వార్డును ఏర్పాటు చేశారన్నారు. వీరితోపాటు డిప్యూటీ డి ఎం ఎం హెచ్ ఓ కేశ రవి, జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ కృష్ణకుమారి, పెద్దవూర మండల వైద్యాధికారి నగేష్,, విజయ విహార్ మేనేజర్ కిరణ్ కుమార్, బుద్ధవనం ఈవో రవిచంద్ర తదితరులు ఉన్నారు.

# 'మిస్ వరల్డ్' పోటీదారులకు పకడ్బందీ ఏర్పాట్లు

### యాదాద్రి జిల్లా కలెక్టర్ హనుమంతరావు



**ప్రజాపక్షం/యాదాద్రి** : కలెక్టర్ కార్యాలయంలో ఈనెల 15న జిల్లాలో ప్రపంచ సుందరిమణులు పర్యటిస్తున్నందున సంబంధిత అధికారులతో ఏర్పాట్లపై సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. గురువారం ఈ సమావేశానికి రాష్ట్ర దేవాదాయ శాఖ సంచాలకులు యాదగిరిగుట్ట కార్యనిర్వహణాధికారి వెంకట్రావు, డిసిపి ఆకాంక్ష్ యాదవ్‌తో కలిసి యాదాద్రి జిల్లా కలెక్టర్ హనుమంతరావు పాల్గొని మాట్లాడారు. ఈ పోటీల్లో ప్రపంచ సుందరీమణులు పర్యాటక ప్రాంతాల సందర్శన, పర్యాటక ప్రాంతాల సందర్శనను పురస్కరించుకొని ఘనంగా ఏర్పాట్లు చేపట్టాలన్నారు. తెలంగాణలోనే అత్యంత ప్రాముఖ్యత కలిగి ఆధ్యాత్మికతను సంతరించుకున్న యాదగిరిగుట్ట, ప్రపంచ ప్రఖ్యాత చేనేత గ్రామంగా యునెస్కో వారి గుర్తింపు పొందిన పోచంపల్లిలలో ఏర్పాట్లు పట్టిష్టంగా చేపట్టాలన్నారు. యాదగిరిగుట్టను ఆర్చీలతో, స్వాగత తోరణాలతో ఆయా మార్గాలను అందంగా తీర్చిదిద్దాలని విద్యుత్ దీపాలతో అలంకరిం చాలన్నారు. చేనేత వస్త్ర సాంప్రదాయానికి వేదికగా నిలిచిన పోచంపల్లి సాంస్కృతికి సాంప్రదాయాలకు పుట్టిల్లు అని, ఏమాత్రం లోటు రాకుండా ఏర్పాట్లు చేపట్టాలన్నారు. ముందుగా మిస్ వరల్డ్ పర్యటించే ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచాలని, ఆయా ప్రాంతాలను అందంగా తీర్చిదిద్దాలన్నారు. పోలీస్ శాఖ అధికారులు మాక్ డ్రిల్ చేపట్టాలని సూచించారు. నీటి ఇబ్బందులు తలెత్తరాదని మున్సిపల్ అధికారులకు జిల్లా పంచాయతీ అధికారులకు సూచించారు. రహదారులను పరిశుభ్రంగా ఉంచాలని, మరమ్మతులు చేపట్టాలన్నారు. యాదగిరిగుట్టలో ఎగ్జిట్, ఎంట్రన్స్ వాటిపై ప్రధాన దృష్టి పెట్టాలని, ఎక్కడా లోటుపాట్లు జరగరాదన్నారు. సిబ్బంది ఎల్లవేళలా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బ్యాటరీ వాహనాలు కూడా అందుబాటులో ఉండాలన్నారు. సిబ్బందికి కేటాయించిన విధులు నిర్వహించే విధంగా అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. సీసీ కెమెరాలు పనిచేసే విధంగా పర్యవేక్షించాలన్నారు. రోప్‌తో పోలీస్ శాఖ సిబ్బంది సిద్ధంగా ఉండాలని పర్యటన ప్రశాంతంగా సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. మీడియా ప్రతినిధులకు ప్రత్యేక గ్యాలరీ ఏర్పాటు చేయాలన్నారు. ఈ పర్యటనలో గుర్తింపు పొందిన ప్రాంతాలలో హోర్డింగ్స్ ఏర్పాటు చేయాలన్నారు. అకాల వర్షాలను దృష్టిలో ఉంచుకొని, ముందస్తుగా జెసిబి సిద్ధం చేసుకోవాలని, చెత్తాచెదారం తొలగించేందుకు యుద్ధ ప్రాతిపదికన తక్షణ చర్యలు తీసుకునేల సిబ్బంది అధికారులు సంసిద్ధంగా ఉండాలన్నారు. విద్యుత్ శాఖ, ఫైర్ స్టేషన్ అధికారులు అప్రమత్తంగా ఉండాలని, వైద్యశాఖ అధికారులు అందుబాటులో ఉండాలని యాదగిరిగుట్ట పోచంపల్లిలలో ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసి సేవలందించాలన్నారు. మున్సిపల్ అధికారులు ఎల్లవేళలా అందుబాటులో ఉండాలని స్పెషల్ డ్రైవ్ చేపట్టాలని తెలిపారు. పర్యటన యావత్తు విజయవంతంగా నిర్వహించేలా అధికారులు అంకితభావంతో పని చేయాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ వీరారెడ్డి, జడ్పీ సీఈవో శోభారాణి, టూరిజం కార్పొరేషన్ జనరల్ మేనేజర్ ఉపేందర్ రెడ్డి, భువనగిరి, చౌటుప్పల ఆర్డీవోలు కృష్ణారెడ్డి, శేఖర్ రెడ్డి భువనగిరి, చౌటుప్పల, యాదగిరిగుట్ట ఏసీపీలు, జిల్లా అధికారులు మున్సిపల్ కమిషనర్లు తదితరులు పాల్గొన్నారు.




## ప్రజా సమస్యలపై పోరాటాలు

### సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పబ్బు వీరాస్వామి

**ప్రజాపక్షం/నల్లగొండ (కనగల్) :** ఓట్లు, సీట్లతో సంబంధం లేకుండా ప్రజా సమస్యలపై నిత్యం ప్రజా పోరాటాలు నిర్వహించాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పబ్బు వీరాస్వామి పిలుపునిచ్చారు. కనగల్ మండల పరిధిలోని కురంపల్లి, పొనుగోడు గ్రామ శాఖల మహాసభ గురువారం జరిగింది.మహాసభలో వీరస్వామి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రేస్ ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేయాలన్నారు. మండలంలో సిపిఐ బలోపేతానికి ప్రతి కార్యకర్త సైనికుడిలా పని చేయాలని అన్నారు. గ్రామంలో అర్హులైన ప్రతి పేదకుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని, అదే విధంగా నూతన రేషన్ కార్డులు, ఆసరా పెన్షన్లు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈమహాసభలో మండల కార్యదర్శి గంట సత్యనారాయణ,మండల కార్యవర్గ సభ్యులు దోటి పాండరి,తలారి లచ్చయ్య,దోటి మల్లయ్య,తలారి అంబేద్కర్, మారపాక రాజ మల్లయ్య, పొనుగోడు గ్రామ శాఖ నాయకులు జోగు సురేందర్,కట్ట యాదయ్య, పెరిక లచ్చయ్య,జోగు గిరినాథ్,వెలుగు వెంకన్న,జోగు కృష్ణయ్య,జోగు నాగమ్మ తదితరులు ఉన్నారు.అనంతరం కురంపల్లి గ్రామ కార్యదర్శిగా కట్ట యాదయ్య,సహాయ కార్యదర్శిగా పెరిక లచ్చయ్య, పొనుగోడు గ్రామ శాఖ కార్యదర్శిగా జోగు గిరినాథ్ ,సహాయ కార్యదర్శిగా వెలుగు వెంకన్నను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.


## విద్యార్థులకు ఆటవిడుపు సమ్మర్ క్యాంప్




**ప్రజా పక్షం/నల్లగొండ టౌన్:** వేసవికాలంలో పోలీస్ కుటుంబ పిల్లలకు ఆట విడుపుగా ఉండాలని, ప్రత్యేకంగా విద్యార్థినీ విద్యార్థులకు వ్యాయామం, ఆటలపై శిక్షణ అందించి ఉన్నత స్థానాలకు ఎదగాలనే సదుద్దేశంతో ఈ సమ్మర్ క్యాంపును ప్రారంభించడం జరిగిందని జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవార్ తెలియజేశారు. గురువారం జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీస్ కుటుంబ సభ్యుల పిల్లలకు ఉచిత మెగా సమ్మర్ క్యాంప్‌ను ఎస్ పి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సమ్మర్ క్యాంపులో మొత్తం దాదాపు 100 మంది విద్యార్థులకు నెలరోజుల పాటు ఉదయం, సాయంత్ర నిర్వహించే శిక్షణలో భాగంగా విద్యార్థులకు యోగా, కరాటే, వాలీబాల్ లాంటి తదితర క్రీడాంశాలలో నైపుణ్యం కలిగిన పి.ఈ.టి,యోగా గురువుల చేత ప్రత్యేకంగా శిక్షణను అందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ రమేష్,ఏ.ఆర్ డీఎస్పీ శ్రీనివాస్, ఆర్.ఐ లు సూరప్ప నాయుడు, సంతోష్, శ్రీనివాస్,ఆర్.ఎస్.ఐ రాజీవ్,అశోక్,పి.ఈ.టి నాగరాజు, కరాటే మాస్టర్ వంశీ, యోగ మాస్టర్,కిషన్ కుమార్ సిబ్బంది పాల్గొన్నారు.

## నేడు బాలభవన్ క్యాంప్‌లో గ్రీన్ క్లబ్ అవగాహన సదస్సు

**ప్రజాపక్షం/సూర్యాపేటటౌన్:** నేడు బాలభవన్ సమ్మర్ క్యాంప్‌కి గ్రీన్ క్లబ్ పౌండర్ ముప్పారపు నరేందర్, రామచంద్రయ్య హాజరై ప్రసంగించారు. పర్యావరణ పరిరక్షణ ముఖ్యం అని, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడాకాన్ని నిషేదించాలని, మొక్కలను పెంచాలని, చేతి సంచి అలవాటు చేసుకొని కవర్ల వాడకం మానివేయాలని అవగాహన కల్పించారు. విశ్రాంత అధ్యపకులు కవి హమీద్ ఖాన్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు భాద్యత ప్రకృతిని, పర్యావరణాన్ని రక్షించాలని, వేసవి శిక్షణ క్యాంప్‌కి పిల్లల్ని పంపిస్తే మంచి విషయాలు ఎన్నో తెలుసుకుంటూ జ్ఞానం పెంచుకుంటారని అన్నారు. టివి, మొబైల్ ఫోన్ వీడియో గేమ్స్‌కి అలవాటుఉ పడటం సరికాదని, ఈత సైకిల్, అంటూ ప్రమాదాల బారీన పడకుండా పిల్లల్ని క్యాంప్‌కు పంపాలని కోరారు. ఈ కార్యక్రమంలో బాలభవన్ సూపరిండెంట్ బండి రాధకృష్ణరెడ్డి, సిబ్బంది యల్లయ్య, సత్యనారాయణ, సింగ్, ఉమ, అనిల్, సాయి, వీరయ్య పాల్గొన్నారు.



## కొబ్బరి చెట్టుపై పిడుగు చెలరేగిన మంటలు



**ప్రజాపక్షం/భద్రాచలం:** పట్టణంలో గురువారం సాయంత్రం స్థానిక రాజరాజేశ్వరి ఆలయం సమీపంలోని కొబ్బరి చెట్టుపై పిడుగు పడింది. దీంతో పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. ఒక్కసారిగా వచ్చిన గాలిదుమారంతో ఆకాశం మేఘావృతమైంది. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. భారీ శబ్దాలతో పిడుగులు పడ్డాయి. దీంతో కొద్దిసేపు విద్యుత్ సరఫరాలో కూడా అంతరాయం వాటిల్లింది.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన కూనంనేని



**ప్రజాపక్షం/చింతకాని:** బస్వాపురం మాజీ ఎంపిటిసి మార్గం కొరివీరమ్మ శ్రీనివాసరావు దంపతుల కుమారుడు వేణుఅఖిల దంపతుల వివాహానికి గురువారం సిపిఐ రాష్ట్ర కార్యదర్శి , కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్ సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు జమ్ముల జితేందర్‌రెడ్డి , కొండపర్తి గోవిందరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు సింగు నర్సింహారావు, మండల కార్యదర్శి పావులూరి మల్లికార్జునరావు, వ్యకాస జిల్లా అధ్యక్షుడు తాటి వెంకటేశ్వర్లు , జిల్లా సమితి సభ్యులు , మాజీ ఎంపిపి కన్నెబోయిన విజయమ్మ, తదితరులు పాల్గొన్నారు. అనంతరం బస్వాపురం గ్రామానికి చెందిన సిపిఐ కార్యకర్తలు మామిడాల యాలాద్రి, చేబోలు రవి కి ఇటీవల యాక్సిడెంట్ అవ్వగా వారిని పరామర్శించి త్వరలో కొలుకోవాలని ఆకాంక్షించారు.

## జాలరీకి చిక్కిన వింత చేప...!



**ప్రజాపక్షం/నేలకొండపల్లి:** ఖమ్మం జిల్లా, నేలకొండపల్లి మండలం లోని పైనంపల్లి ఏటిలో జాలరికి వింతైన చేప చిక్కింది. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన ఉపేందర్ అనే జాలరి రోజు మాదిరిగానే స్థానిక ఏటిలో చేపల కోసం వలను విసరగా... అందులో అరుదైన చేప చిక్కింది. దెయ్యంబేరు అనే సముద్రం చేప చిక్కినట్లు మత్స్యకారుదు తెలిపారు. అరుదైన చేపను స్థానికులు పెద్ద సంఖ్యలో తిలకించారు.

## మిర్చి బస్తాలకు దుండగులు నిప్పు



**ప్రజాపక్షం/పినపాక:** మండల పరిధి లోని బోటిగూడెం పంచాయితీ పరిధి లోని సీతంపేట గ్రామంలో గురువారం తెల్లవారుజామున గుడిసెలో ఉన్న 25 మిర్చి బస్తాలను గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. రెండున్నర ఎకరాల మిర్చి పంట గుండారపు మల్లయ్య అనే రైతుకు చెందినదిగా గుర్తించారు. పంటతో పాటు పక్కనేఉన్నపైప్‌లైన్‌కి సైతం నిప్పుఅంటించారని రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. ఈ కేసు విషయమై పోలీసులు దర్యాప్తు చేస్తున్నా రు.

## అంబేద్కర్ ఓపెన్ డిగ్రీ పరీక్షల ఫీజు గడువు పెంపు

**ప్రజాపక్షం/ మధిర:** డాక్టర్ బిఆర్.అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ 2, 4, 6 సెమిస్టర్ల పరీక్ష ఫీజు గడువు ఎటువంటి అపరాధ రుసుం లేకుండా ఈ నెల 31వ తేదీ వరకు గడువు పెంచినట్లు మధిర స్టడీ సెంటర్ కో ఆర్డినేటర్ శీలం ఇందిర గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్ష ఫీజును దగ్గరలోని మీసేవా లేదా టిఎస్ ఆన్‌లైన్‌లో చెల్లించాలని తెలిపారు. పూర్తి వివరాలకు ప్రభుత్వ డిగ్రీ కళాశాల అంబేద్కర్ స్టడీ సెంటర్, 9666 366833, 7382929694నెంబర్లను సంప్రదించాలని ఆమె తెలిపారు.

## 5 కేజిల గంజాయి పట్టివేత

**ప్రజాపక్షం/అశ్వారావుపేట:** విశ్వసనీయ సమాచారం మేరకు అక్రమంగా తరలిస్తున్న నిషేధిత గంజాయిని స్థానిక పోలీసులు దాడి చేసి పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గురువారం అశ్వారావుపేట పోలీసులు భద్రాచలం రోడ్డులోని హెచ్‌పి పెట్రోల్ బంక్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా ఊట్లపల్లి నుండి అశ్వారావుపేట వైపుకు వెళ్తున్న మూడు బైకులపై వెళ్తున్న 7గురు అనుమానితులను పట్టుకుని వారి వద్ద నుండి సుమారు ఐదున్నర కేజిల గంజాయిని పట్టుకుని, 6 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను కోర్టుకు రిమాండ్‌కు పంపనున్నట్లు పోలీసులు తెలిపారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన మంత్రి పొంగులేటి



**ప్రజాపక్షం/నేలకొండపల్లి:** రాష్ట్ర రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మండలం లోని పలు గ్రామాలలో గురువారం పర్యటించారు. ఆచార్లగూడెం, బోదులబండ గ్రామాలకు చెందిన నూతన వధువరులను ఆశ్వీరదించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటి చైర్మన్ , తదితరులు పాల్గొన్నారు.

## సిపిఎస్‌లో ఉచిత వేసవి శిక్షణా శిబిరం ప్రారంభం



**ప్రజాపక్షం/ మధిర:** మధిర పట్టణంలోని సిపిఎస్ ప్రభుత్వ పాఠశాలలో గురువారం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు తెలంగాణ రైసింగ్ కార్యక్రమంలో భాగంగా పాఠశాల విద్యార్థినీ, విద్యార్థులకు ఉచిత వేసవి శిక్షణాశిబిరం ఏర్పాటు చేశారు. గురువారం ఈ ఉచిత శిక్షణా శిబిరాన్ని ఎంఇఒ వై.ప్రభాకర్ ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు తెలంగాణ రైసింగ్ కార్యక్రమంలో భాగంగా డ్రాయింగ్, క్యారం బోర్డ్, వాలీబాల్, డ్యాన్స్ తదితర అంశాల్లో విద్యార్థులకు ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. పాఠశాల ఉపాధ్యాయ బృందం, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## ముత్తయ్యకు ఎమ్మెల్యే కూనంనేని పరామర్శ



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్:** ఖమ్మంరూరల్ మండలం పల్లెగూడెం గ్రామానికి చెందిన సిపిఐ సీనియర్ నాయకులు చుండూరు ముత్తయ్య ఇటీవల అనారోగ్యానికి గురై చికిత్స అనంతరం ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నాడు. విషయం తెలుసుకున్న సిపిఐ రాష్ట్ర కార్యదర్శి.. కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు గురువారం నివాసకం వద్దకు వెళ్లి పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితని ఆయన మేనల్లుడు, సిపిఐ పాలేరు నియోజకవర్గ నాయకుడు లింగ వెంకటనారాయణను అడిగి తెలుసుకున్నారు. అలాగే సత్యనారాయణపురంలోని టిసివిరెడ్డి ఫంక్షన్‌హాల్‌లో మండల సమితి సభ్యుడు గూడా బాబురెడ్డి కుమారుడి వివాహ వేడుకలో పాల్గొని నూతనవధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమాలలో సిపిఐ జిల్లా సహాయకార్యదర్శి దండి సురేష్, సిపిఐ మండల కార్యదర్శి , పలువురు సిపిఐ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఒప్పంద ఉద్యోగాలకు దరఖాస్తులు చేసుకోండి: కలెక్టర్

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం:** ఒప్పంద ఉద్యోగాలకు అర్హతగల వారు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కలెక్టర జితేష్ వి పాటిల్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రపంచ బ్యాంకు సహకారంతో కేంద్రప్రభుత్వం నిర్వహిస్తున్న ర్యాంపుపథకానికి ఒప్పంద పద్ధతిలో మేనేజర్, సహాయ మేనేజర్ పోస్టులు భర్తీ చేస్తారని చెప్పారు. ఆసక్తి గల వారు ఈ నెల 10వ తేదిలోపు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఎన్ఐఎంఎస్ఎంఇ.గవ్.ఇన్ వెబ్‌సైట్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు పరిశ్రమల శాఖ జిఎం తిరుపతయ్యను కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

# ఖమ్మం ఆసుపత్రి అభివృద్ధి పనుల ప్రతిపాదనలను పంపండి

- డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్క
- ప్రభుత్వ ఆసుపత్రులకు బ్రాండింగ్
- వైద్యశాఖపై సమీక్ష నిర్వహించిన డిప్యూటీ సిఎం భట్టి, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ





**ప్రజాపక్షం/ఖమ్మం టౌన్ :** ఆసుపత్రి అభివృద్ధి పనుల ప్రతిపాదనలను సమర్పించాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క తెలిపారు. గురువారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క వైద్య ఆరోగ్య శాఖ పనితీరుపై వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, హెల్త్ ప్రిన్సిపాల్ సెక్రటరీ క్రిస్టినా, జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, పోలీస్ కమిషనర్ సునీల్ దత్, సత్తుపల్లి, వైరా ఎంఎల్ఎలు రాగమయి, రాందాస్ నాయకులతో కలిసి సమీక్ష నిర్వహించారు. ఖమ్మంజిల్లాలో ప్రభుత్వ వైద్య శాఖ పనితీరును జిల్లా కలెక్టర్ పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా భట్టివిక్రమార్క మాట్లాడుతూ ఖమ్మంజిల్లాలో పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందించేందుకు ఆసుపత్రికి అవసరమైన ప్రతిపాదనలు వైద్య కళాశాలలో విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా ఉండేందుకు చేయాల్సిన ఏర్పాట్ల ప్రతిపాదనలను పూర్తి స్థాయిలో తయారు చేసి సమర్పించాలని ఆయన జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు. వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ ఖమ్మంజిల్లాలో జనాభా ఆధారంగా అవసరమైన నూతన పిహెచ్‌సి, సబ్ సెంటర్లు, బస్తీ దవాఖానాలు, ఆసుపత్రి భవనాలు, కూలిపోయే స్థితిలో ఉన్న పిహెచ్‌సి, సబ్ సెంటర్ల ప్రతిపాదనలను అందించాలన్నారు. అప్‌గ్రేడ్ చేసిన ఆసుపత్రుల్లో వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలని ఆయన తెలిపారు. షెడ్యూల్ ట్రైబ్ ఏరియాల్లో రెండు అంబులెన్స్ సౌకర్యాలు ఉండేలా చూడాలన్నారు. సబ్ సెంటర్ నుంచి పిహెచ్‌సికి ఎంత సమయంలో చేరుకుంటామో పరిశీలించి నివేదిక అందిస్తే దాని ప్రకారం అంబులెన్స్‌లను మంజూరు చేస్తామన్నారు. ఖమ్మం వైద్య కళాశాలలో ఉన్న 100 సీట్లను 150 వరకు పెంచుకునేందుకు అనుబంధంగా ఉన్న ప్రభుత్వ జిల్లా ఆసుపత్రిని 600 పడకల విస్తరణ దిశగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. జనరల్ ఆసుపత్రి వద్ద అందుబాటులో ఉన్న స్థలం ఆసుపత్రి ఓపి, ఐపి వివరాలు అడిగి తెలుసుకున్నారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ వైద్య ఆరోగ్య శాఖ మంత్రి చేసిన సమీక్షకనుగుణంగా నివేదికలు పంపాలన్నారు. జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి వద్ద అదనపు ఫ్లోర్ నిర్మాణానికి రూ. 12 కోట్లు, టాయిలెట్ బ్లాక్ నిర్మాణానికి కోటి రూపాయల అంచనాతో ప్రతిపాదనలు సమర్పించామన్నారు. వైద్య కళాశాల వద్ద బాయ్స్ హాస్టల్, కాంపౌండ్ వాల్, అంతర్గత రోడ్లు, రెండు బస్సులు, రెండు 108 సర్వీసులు, నాలుగు పిహెచ్‌సిల వద్ద 102 సర్వీసుల అవసరం ఉందని కలెక్టర్ తెలిపారు. 12 సబ్ సెంటర్ల భవనాల పునర్ నిర్మాణానికి అవసరమైన నిధులు కేటాయించాలని కోరారు. సిపి సునీల్ దత్, రాష్ట్ర హస్తకళల సంస్థ చైర్మన్ నాయుడు సత్యనారాయణ, మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, అదనపు కలెక్టర్లు పి. శ్రీజ, పి. శ్రీనివాసరెడ్డి, డిఎఫ్ఒ సిద్ధార్థ్ విక్రంసింగ్, జిల్లా రెవెన్యూ అధికారిణి పద్మశ్రీ, రెవెన్యూ డివిజనల్ అధికారులు నర్సింహారావు, రాజేందర్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారిణి డాక్టర్ కళావతిబాయి, ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ రాజేశ్వరరావు, జిల్లా సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్‌కుమార్, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

**ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రిని తనిఖీ చేసిన భట్టి, దామోదర రాజనర్సింహ**

రోగులకు మెరుగైన వైద్య సేవలను అందించాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క కోరారు. గురువారం రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో కలిసి ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రిని తనిఖీ చేశారు. రిసెప్షన్, హెల్ప్ డెస్క్, ఓల్డేజ్ క్లినిక్, ఫార్మా విభాగం, ఫిమేల్ వార్డు, ల్యాబ్‌లను పరిశీలించారు. ఎమర్జెన్సీ మందుల స్టాక్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వి క్రమార్క మాట్లాడుతూ మెరుగైన వైద్య సేవల కోసం వ స్తున్న వారికి ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా చ ర్యలు తీసుకోవాలని, ప్రభుత్వం వైద్య రంగ అభివృద్ధికి కట్టుబడి ఉందన్నారు. మంత్రుల వెంట వైద్య ఆరోగ్య శా ఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ క్రిస్టినా, కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, పోలీస్ కమిషనర్ సునీల్ దత్ తదితరులు ఉన్నారు.

## అకాల వర్షంతో అన్నదాతలు ఆగమాగం



**ప్రజాపక్షం/సుజాతనగర్;** సుజాతనగర్ మండలంలో యాస ంగి పంటలు వేసిన రైతులు కొనుగోలు కేంద్రాలలో తూర్పాలు పట్టి తేమ శాతం వచ్చిన కాంటాలు పెట్టక కొనుగోలు జరగక ఎదురుచూస్తున్న రైతులను అకాల వర్షం వచ్చి నిండా ము ంచింది. గురువారం సాయంత్రం వేళలో ఈదురు గాలులతో వర్షం బీభత్సం సృష్టించింది. అందిన కాడికి అప్పులు తెచ్చి వేల రూపాయలు పెట్టుబడి పెట్టి పంటలను కోసి ఆరబెట్టిన తర్వాత అకాల వర్షాలు రావడంతో టార్పాలిన్ పట్టాలు లేక, రైతులకు పట్టాలు కొనే స్తోమత లేక ఇబ్బందులు పడుతున్నారు. వర్షం భారీగా రావడంతో ధాన్యం కొనుగోలు కేంద్రాలలో ధాన్యం తడుస్తావుంటే రైతులు కన్నీరు పర్యంతమవుతున్నారు. ఇంకా ఒక పక్క హార్వెస్టర్ యంత్రాల ద్వారా వరి కోతలు జరుగుతున్నాయి. మొక్కజొన్న, మిర్చి రైతులు చేతికి వచ్చిన పంట వర్షానికి పంట నష్టం జరుగుతుంటే రైతులు గుండె తరుక్కుపోతుంది. మిర్చి రైతులు వేసినప్పటినుంచి ముడత ఎర్రనల్లితో వివిధ కంపెనీల మందులు పిచికారి చేసి వేల రూపాయలను పెట్టుబడి పెట్టారు. పంటను అమ్మకానికి పోతే రైతుకు గిట్టుబాటు ధర లేక కోసిన కూలీల ఖర్చు రాక మిర్చి రైతులు వాపోతున్నారు. ఇటీవల రైతులు తమ ధాన్యాన్ని త్వరగా కాంటాలు పెట్టి కొనుగోలు చేయాలని నిరసన తెలియజేశారు. ఇకనైనా ప్రభుత్వ అధికారులు స్పందించి రైతుల బాధలు తీర్చాలని రైతు సంఘం నాయకులు కోరుతున్నారు.

## అర్హులైన ప్రతి ఒక్కరికి స్కిల్ మాట్రిక్స్



**ప్రజాపక్షం/బూర్గంపాడు:** అర్హులైన ప్రతి ఒక్కరికి స్కిల్ మాట్రిక్స్ అమలు చేయాలని ఐటిసి ఎఐటియూసి గౌరవ అధ్యక్షులు సింగమనేని ప్రసాద్ అన్నారు. గురువారం మండల పరిధిలో గల ఐటిసి పరిశ్రమలో ఎఐటియూసి గౌరవ అధ్యక్షులు సింగమనేని ప్రసాద్, గౌరవ సలహాదారులు తన్నీరు వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి షేక్ జహూర్‌ల ఆధ్వర్యంలో రెండో విడత గేట్ మీటింగ్ ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ స్కిల్ మాట్రిక్ అమల్లో అనేక అవకతవకలు జరిగాయని, చాలా మంది అర్హులైన వారికి స్కిల్ మాట్రిక్స్ అందని ద్రాక్షల మారిందన్నారు. యాజమాన్యం అర్హులైన ప్రతి ఒక్కరికి న్యాయం చేయాలని కోరారు. కార్మికుల శ్రమకు తగ్గ ఫలితం ఇస్తే ప్రొడక్షన్ తీసే దానిలో మరింత భాగస్వాములు అవుతారని అన్నారు. కమ్యూనిస్టు పార్టీ కార్మికుల శ్రమలో నుండి పుట్టిందని వారు పడుతున్న శ్రమకు యాజమాన్యం గుర్తించక తప్పదని లేనిపక్షంలో కార్మికుల ఆగ్రహానికి గురి కావాల్సి వస్తుందని హెచ్చరించారు. శ్రమకు తగ్గ ఫలితం దక్కే వరకు ఎర్ర జెండా నీడన పోరాడుతామని అన్నారు. ఈకార్యక్రమంలో ఎఐటియూసి కాంట్రాక్ట్ వర్కర్స్ అధ్యక్షులు బల్లం నాగయ్య, ఉపాధ్యక్షులు కోటమర్తి శ్రీనివాస్, జాయింట్ సెక్రటరీలు , మహిళా నాయకురాలు, కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులు, కాంట్రాక్ట్ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## టెర్రరిస్టు నిర్మూలనకు భారత్ బాటలు

- ప్రపంచ శాంతికి భారత్ కృషి చేస్తుంది
- సిపిఐ మండల కార్యదర్శి వాసిరెడ్డి మురళి




**ప్రజాపక్షం/కొత్తగూడెంటౌన్ :** భారత్ పై పాకిస్తాన్ పైశాచిక దాడులను నిరసిస్తూ గురువారం నాదు చుంచుపల్లి సిపిఐ పార్టీ కార్యాలయం నందు పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి వాసిరెడ్డి మురళి, దుర్గారాశి వెంకటేశ్వర్లు, సలిగంటి శ్రీనివాస్ లు మాట్లాడుతూ, భారతదేశం భిన్నత్వంలో ఏకత్వమని అన్నారు. సర్వ మత కులాల నిలయంగా భారతదేశం విలసిల్లుతుందని వారు చెప్పారు. టెర్రరిస్టులను పెంచి పోషిస్తున్న పాకిస్తాన్ పెహల్గాం లోని పర్యాటక కేంద్రాలలో సందర్శనకు వెళ్లిన భారతీయులను పాకిస్తాన్ టెర్రరిస్టులు కాల్చి చంపడం మానుషమైన చర్యని అన్నారు. ప్రపంచ మానవ వానికి ప్రమాదకరమైన టెర్రరిస్టులను పెంచి పోషిస్తున్న పాకిస్తాన్ ప్రమాదకరమైన దేశంగా ఉందన్నారు. భారత మిలటరీ, దేశ పౌరుల శక్తి సామర్థ్యాల ముందు పాకిస్తాన్ బలాదూరని చెప్పారు. పాకిస్తాన్‌లోని టెర్రరిస్ట్ స్థా వరాలపై భారత మిలటరీ చేసిన దాడులు న్యాయపరమైనవి చెప్పారు. పాకిస్తాన్‌తో యుద్ధం చేయవలసిన అవసరం వస్తే సిపిఐ పార్టీ భారతదేశ ప్రభుత్వానికి రక్షణ శాఖకు తమ శక్తివంచల కృషిచేసి సహాయ సహకారాలు అందిస్తామని చెప్పసాగారు. ఈ కార్యక్రమంలో, వీర స్వామి, గుండు శ్రీనివాస్ జనార్ధన్, ఉమామహేశ్వరరావు, చల్లగుండ్ల కృష్ణయ్య, రాంజీ,తోట రాజు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ బడుల్లోనే నాణ్యమైన విద్య



**ప్రజాపక్షం/ మధిర రూరల్:** ప్రభుత్వ బడుల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని దెందుకూరు ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం శ్యామలారావు అన్నారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా గురువారం మండల పరిధిలోని దెందుకూరు గ్రామంలో ఉపాధ్యాయులు ఇంటింటికి వెళ్లి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు ఉన్నాయని, అనుభవం కలిగిన ఉపాధ్యాయులచే భోదన, విద్యార్థులకు ఒత్తిడి లేని విద్యను అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాల్లో ఉచిత పాఠ్యపుస్తకాలు, రెండు జతల బట్టలు, అల్పాహారం, మధ్యాహ్న భోజనం, స్కాలర్ షిప్ తదితర సదుపాయలు ఉంటాయని వివరించారు. విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ బడుల్లోనే చేర్పించాలని విజ్ఞప్తి చేశారు. ఉపాధ్యాయులు జి.సునీత,నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్‌హెచ్‌ఒగా బాధ్యతలు స్వీకరించిన ఇన్‌స్పెక్టర్లు



**ప్రజాపక్షం/ఖమ్మం :** ఇటీవల జారీ చేసిన ఇన్‌స్పెక్టర్ల బదిలీల ఉత్తర్వుల నేపథ్యంలో గురువారం ఎస్‌హెచ్‌వోలు ఖమ్మం వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ టి. కరుణాకర్, ఖమ్మం త్రీటౌన్ ఇన్‌స్పెక్టర్ మోహన్‌బాబు, టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ డి. రమేష్ లు బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం పోలీస్ కమిషనర్ కార్యాలయంలో పోలీస్ కమిషనర్ సునీల్ దత్‌ను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా బాధ్యతలు స్వీకరించిన ఇన్‌స్పెక్టర్లకు పోలీస్ కమిషనర్ పలు సూచనలు చేశారు.

# ఇందిరమ్మ ఇండ్లను నిర్మించడానికి సుముఖంగా లేని లబ్ధిదారులు

- ఆర్థికంగా ఉన్న గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసిన వైనం
- ఇందిరమ్మ ఇండ్లు నిర్మించుకోవాలని ప్రాధేయపడుతున్న అధికారులు



**ప్రజాపక్షం/ తిరుమలాయపాలెం:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన ప్రతి పేదవారికి ఇందిరమ్మ ఇండ్లు నిర్మించాలని లక్ష్యంతో విడతలవారీగా ప్రతి నియోజకవర్గానికి ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయగా తిరుమలాయపాలెం మండలానికి 729 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు కాగా పైలెట్ ప్రాజెక్టు కింద ఏలూవారిగూడెం గ్రామానికి మరో 39 ఇండ్లను మంజూరు చేసింది. దానిలో మొదట విడతగా 14 ఇండ్లను నిర్మించాలని అధికారులకు సూచనలు ఇవ్వగా 7గురు లబ్ధిదారులు ప్రారంభించారు. మిగితా 7గురు ప్రభుత్వం నిర్దేశించిన కొలతల ప్రకారం ఇండ్లను నిర్మించడానికి సుముఖంగా లేరు. పైలెట్ ప్రాజెక్టు కింద అన్ని విధాల ఆర్థికంగా ఇండ్లు ఉన్న గ్రామాన్ని ఎంపిక చేయడం లబ్ధిదారులు ఇందిరమ్మ ఇండ్లను నిర్మించుకోవడానికి వివిధ కారణాలు చెప్పి కాలయాపన చేస్తున్నారు. తిరుమలాయపాలెం మండలంలో చిన్న గ్రామపంచాయతీలు జోగులపాడు, తిమ్మక్కపేట, పడమటి తండా, రుమణాతండా, అజ్మీర తండా, శివారు రాకాసి తండా, మంగళిబండ తండా, ఏనుకుంట తండాతో పాటు శివారు గ్రామాలు ఉన్నాయి. కాని అన్ని విధాలుగా ఆర్థికంగా ఉన్న గ్రామాన్ని ఎంపిక చేయటం ఇందిరమ్మ కమిటీలు భూములు, ట్రాక్టర్లు వాహనాలు ఉన్న పేర్లను సూచించడంతో ఇందిరమ్మ ఇండ్లు నిర్మించుకోవడానికి లబ్ధిదారులు సుముఖంగా లేరు. గత ప్రభుత్వం ఇదే గ్రామంలో 23మందికి దళిత బంధు మంజూరు చేసింది. అవిధంగానే ఇందిరమ్మ ఇండ్లను కూడా ఈ గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసినట్లు భావిస్తున్నారు. మంజూరైన లబ్ధిదారుల చుట్టూ అధికారులు తిరుగుతూ ఇండ్లు నిర్మించుకోవాలని ప్రాధేయపడుతున్నా వారు ఇండ్లు నిర్మించుకోవడానికి సుముఖంగా లేరని తెలుస్తుంది. నిర్మాణాన్ని ప్రారంభించిన లబ్ధిదారు ఇండ్లకి ఇప్పటికీ రెంటల్ లెవల్‌కి నిర్మాణం పూర్తయినట్లు అధికారులు తెలిపారు. రెంటల్ లెవెల్ ఇల్లు నిర్మాణం పూర్తి చేసిన లబ్ధిదారుల అకౌంట్లో నగదు జమైనట్లు తెలిపారు.

## రామయ్యను దర్శించుకున్న పొంగులేటి దంపతులు



**ప్రజాపక్షం/భద్రాచలం:** శ్రీ సీతారామ చంద్ర స్వామి వారి ఆలయాన్ని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి దంపతులు గురువారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయమర్యాదల ప్రకారం అర్చక స్వాములు ఘన స్వాగతం పలికారు. వారి పెళ్లిరోజు కావడంతో గర్భగుడిలోప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయం ప్రాంగణంలోని లక్ష్మీ తాయారామ్మ వారి ఆలయంలో పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించిన అనంతరం వేదపండితులు వేదాశీర్వచనాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వారి వెంట ఎంఎల్‌ఏ డా.తెల్లం వెంకట్రావు తంపతులు, ఆర్డిఓ దామోదర్ రావు, ఆలయం ఇఓ ఎల్ రమాదేవి పలువురు పాల్గొన్నారు.

## జాతరకు సౌకర్యాలు కల్పించాలి

**ప్రజాపక్షం/ములుగు ప్రతినిధి:** మండలంలోని రామంజపురం గ్రామంలో గత ఎనిమిది సంవత్సరాలుగా అంగరంగ వైభవంగా నాంచారమ్మ జాతర జరుపుతున్నారు. ఈ సందర్భంగా శుక్రవారం తెలంగాణ ఆదివాసీ ఎరుకల సంఘం ఆధ్వర్యంలో కలెక్టర్ దివాకర టిఎస్‌కి సౌకర్యాలు ఏర్పాటు చేయాలని వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా తెలంగాణ ఆదివాసీ ఎరుకల సంఘం ములుగు జిల్లా అధ్యక్షులు మాట్లాడుతూ గత 812 సంవత్సరాల క్రితం ఎరుకల నాంచారమ్మ పంచకూటాలయం రామాంజపురం గ్రామంలో పంటల పంటల పొలాల మధ్య ఉందని అన్నారు. నాంచారమ్మ జాతర గత ఎనమిది సంవత్సరాల నుండి నాంచారమ్మ ఉత్సవ కమిటీ చైర్మన్ లోకిని రాజు ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. గత సంవత్సరం జాతరకు పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్క హాజరై పూజలు నిర్వహించారన్నారు. అక్కడికి వచ్చే భక్తులకు నీటి సౌకర్యం, వైద్యం, భోజన వసతి, రోడ్డు సౌకర్యం చేయించాలని తెలిపారు. వారి వెంట తెలంగాణ ఆదివాసీ ములుగు జిల్లా ఉపాధ్యక్షులు సల్ల బాబు తదితరులు ఉన్నారు.

## చదువుతోపాటు కళలూ కీలకమే : కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

**ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి:** విద్యార్థులు చదువుతోపాటు వివిధ కళలలో కూడా రాణించేందుకు వేసవి శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నామని వీటిని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ తెలిపారు. యంగ్ ఇండియా వేసవి శిబిరాలను గురువారం గణేష్ వాడలోని ప్రాథమికోన్నత పాఠశాల, అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలలో కలెక్టర్ ప్రారంభించడం జరిగింది. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థుల అంతర్గత సామర్థ్యాలను, సృజనాత్మకత నైపుణ్యాలను గుర్తించి వాటికి పదును పెట్టడమే లక్ష్యంగా తొలిసారిగా రాష్ట్ర విద్యాశాఖ ప్రభుత్వ పాఠశాలల్లో యంగ్ ఇండియా వేసవి శిక్షణ శిబిరాలను నిర్వహించ తలపెట్టిందన్నారు. విద్యార్థులు చదువుతోపాటు అన్ని రంగాలలో రాణించేలా వివిధ అంశాలలో శిక్షణను ఇవ్వనున్నారన్నారు. ఈ కార్యక్రమంలో డీఈవో భోజన్న, ఎంఈవో, తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్ పి. ప్రావిణ్య



**ప్రజాపక్షం/పరకాల :** రైతులు కొనుగోలు కేంద్రానికి తీసుకువచ్చిన వరి ధాన్యాన్ని సకాలంలో తూకం జరిపించి, నిర్ణీత రైస్ మిల్లులకు తరలించాలని జిల్లా కలెక్టర్ పి. ప్రావిణ్య నిర్వాహకులకు సూచించారు. ప్రణాళికాబద్ధంగా వ్యవహరిస్తూ ధాన్యం సేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని అన్నారు. నడికుడ మండలంలోని చర్లపల్లి లలో కొనసాగుతున్న వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను కలెక్టర్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇప్పటివరకు సేకరించిన ధాన్యం నిల్వలు, రైస్ మిల్లులకు పంపించిన ధాన్యం నిల్వల గురించి, రైతుల ఖాతాలలోకి జమ చేసిన బిల్లుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, అకాల వర్షాలు కురిసే ఆస్కారం ఉన్నందున ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని, ధాన్యం తడిసిపోకుండా రైతులకు టార్పాలిన్స్ అందజేయాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో తాగునీరు, నీడ వంటి వసతులు తప్పనిసరిగా అందుబాటులో ఉండేలా చూడాలని, ముఖ్యంగా లారీల కొరత, హమాలీల కొరత లేకుండా చూసుకోవాలని అన్నారు. గన్నీ బ్యాగులు, ఎలక్ట్రానిక్ తూకం యంత్రాలు, తేమ శాతం కొలిచే మీటర్లు, గ్రెయిన్ క్యాలిపర్లు సరిపడా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఏ దశలోనూ రైతులు ఇబ్బందులు పడకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని, క్షేత్రస్థాయిలో ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తేవాలని నిర్వాహకులకు సూచించారు. కలెక్టర్ వెంట ఆర్డీఓ నారాయణ, తహసీల్దార్ నాగరాజు, ఎపిఎం రమాదేవి, ఎఇఓ నాగరాజు తదితరులు ఉన్నారు.

## లైసెన్స్ సర్వేయర్ల శిక్షణకు దరఖాస్తులకు ఆహ్వానం : కలెక్టర్

**ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి:** తెలంగాణ అకాడమీ ఆఫ్ ల్యాండ్ ఇన్ఫర్మేషన్ అండ్ మేనేజ్‌మెంట్ (తాలిమ్) నుండి లైసెన్స్ సర్వేయర్ శిక్షణకు అర్హత కలిగిన అభ్యర్థుల నుండి దరఖాస్తులు కోరుతున్నట్లు జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇంటర్మీడియట్‌లో గణితంతో 60శాతం మార్కులతో, ఐటిఐ డ్రాఫ్ట్స్‌మెన్ (సివిల్), డిప్లమా (సివిల్), బీటెక్, ఇతర సమానమైన అర్హత కలిగి ఉండాలన్నారు. ఈనెల 17వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

## పండుగలు సంస్కృతి సంప్రదాయాలను కాపాడుతాయి



**ప్రజాపక్షం/పాలకుర్తి:** గ్రామీణ ప్రాంతాలలో జరుపుకునే పండుగలు సంస్కృతి, సంప్రదాయాలు కాపాడుతాయని కాంగ్రెస్ నియోజకవర్గ ఇంచార్జి హనుమాండ్ల ఝాన్సిరెడ్డి అన్నారు. గురువారం మండలంలోని మంచుప్పుల గ్రా మంలో యాదవుల కురుమ ఆరాధ్యదైవం గంగాదేవి తల్లి జాతర వేడుకలకు ఆమె హాజరయ్యారు. అనంతరం ఆమె మాట్లాడారు. అన్ని వర్గాల అభ్యున్నతికి కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడు కట్టుబడి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అద్యక్షుడు రాపాక సత్యనారాయణ, మండల పార్టీ అధ్యక్షుడు గిరగాని కుమారస్వామి, నాయకులు పరుశరాములు, వెంకన్న, కొమురయ్య, యాకాంతరావు, రమేష్, యాకయ్య, హరీష్, భాస్కర్, రమేష్, యాకన్న, సుధాకర్ పాల్గొన్నారు.

ఇపుడే అందిన క్రైమ్ వార్త తప్పకుండా వాడుకోగలరు

## ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య

**ప్రజాపక్షం/రఘునాథపల్లి:** ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేక ఓ వ్యక్తి గుర్తు తెలియని రైలు కింద పడి మృతి చెందిన సంఘటన మండలంలో గురువారం చోటుచేసుకుంది. జిఆర్పీ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని గుంటూరు జిల్లాకు చెందిన కె అజయ్ అనే వ్యక్తి బతుకుదెరువు కోసం జనగామకు వచ్చి గత కొంతకాలంగా దయానిలయం వద్ద గల పెట్రోల్ పంపులో పనిచేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఈ క్రమంలో అతనికి కుటుంబ పోషణ భారమై ఆర్థిక ఇబ్బందులు తలెత్తడంతో మానసికంగా ఇబ్బందులకు గురై జీవితంపై విరక్తి చెందిన నిడిగొండ శివారులో గుర్తు తెలియని రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతునికి భార్య ఇద్దరు ఇద్దరు పిల్లలున్నారు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని ధర్యాప్తు చేస్తున్నట్లు జీఆర్‌పీ హెడ్ కానిస్టేబుల్ రమణారెడ్డి, కానిస్టేబుల్ నరేష్ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జనగామ ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు వారు తెలిపారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

## జర్నలిస్టు ఇంటిపై పోలీసుల దాడిని ఖండిస్తున్నాం

### టియుడబ్ల్యుజె (ఐజెయు) జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గడ్డం రాజిరెడ్డి, తోట సుధాకర్

**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** ఎలాంటి నోటీసు లేకుండా విజయవాడలోని సాక్షి ఎడిటర్ ఆర్.ధనుంజయరెడ్డి నివాసానికి వెళ్లి భయభ్రాంతులకు గురిచేసిన ఎపి పోలీసులు తీరును ఖండిస్తున్నామని, ఈ ఘటనను ప్రెస్‌కౌన్సిల్ ఆఫ్ ఇండియా, ఉన్నత న్యాయస్థానాల దృష్టికి యూనియన్ ద్వారా తీసుకువెళ్తామని టియుడబ్ల్యుజె (ఐజెయు) హనుమకొండ జిల్లా అధ్యక్షులు గడ్డం రాజిరెడ్డి, ప్రధాన కార్యదర్శి తోట సుధాకర్ ఒక ప్రకటన లో తెలిపారు. నిజాలను ఎప్పటికప్పుడు ప్రజల్లోకి తీసుకెళుతున్న కారణంగా జర్నలిస్టులను భయపెట్టి అదుపులో పెట్టుకోవాలన్న ఏకైక లక్ష్యంతో ఎపి పోలీసులు కార్డన్ సెర్చ్‌లో భాగంగా బలవంతంగా ఇంట్లో చొరబడి తనిఖీ లు చేశారని, ఆ తనిఖీల్లో ఏమీ లభించలేదని, కేవలం రాజకీయ కక్షపూరిత కుట్రలో భాగంగానే సాక్షి ఎడిటర్ ధనుంజయరెడ్డిని ఇబ్బంది పెట్టాలన్న వ్యూహంలో భాగంగానే తనిఖీలు చేశారని తెలిపారు. పోలీసులను అడ్డుపెట్టుకొని జర్నలిస్టులను, ఎడిటర్లను నియంత్రించుకోవాలనుకోవటం మతిలేని చర్యగా భావిస్తున్నామని, తనిఖీలుగా పేరు చెప్పినా మేం అది దాడిగానే భావిస్తున్నామని, ఎపి పోలీసులతీరుపై అన్ని యూనియన్లు, ప్రెస్‌క్లబ్‌లు ప్రెస్‌కౌన్సిల్ ఆఫ్ ఇండియా కు ఫిర్యాదు చేయాలని కోరుతున్నామని పేర్కొన్నారు. పోలీస్ వేధింపులను తక్షణమే ఆపకపోతే పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చెప్పడతామని, ఏపీలో జరిగిన ఘటనకు నిరసనగా జర్నలిస్టులు, ప్రెస్‌క్లబ్‌ల బాధ్యులు నల్ల రిబ్బన్లు ధరించి విధులు నిర్వహించాలని కోరారు.

### రెవెన్యూ సదస్సులో వచ్చిన దరఖాస్తులను

# త్వరితగతిన పరిష్కరించాలి

### కలెక్టర్ రాహుల్ శర్మ



**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి:** రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. గురువారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండలంలోని దమన్నపేట రైతు వేదిక, తిరుమలగిరి గ్రామంలోని జిల్లా, మండల పరిషత్ పాఠశాలలో జరుగుతున్న రెవెన్యూ సదస్సులను జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూ భారతి నూతన ఆర్ఓఆర్ రెవెన్యూ చట్టంపై పైలట్ ప్రాజెక్టు కింద రేగొండ మండలాన్ని ఎంపిక చేసి రైతుల నుండి సలహాలు, సూచనలు, భూ సంబంధత సమస్యల దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. మండలంలోని 11 గ్రామాలలో రెవెన్యూ సదస్సులు నిర్వహించాల్సి ఉండగా ఇప్పటి వరకు 8గ్రామాల్లో సదస్సులు పూర్తి అయినట్లు తెలిపారు. హెల్ప్ డెస్క్‌ను పరిశీలించి రైతులకు సలహాలు సూచనలు ఇవ్వాలని సూచించారు. దరఖాస్తులను పరిశీలించిన కలెక్టర్, రైతులు భూ సంబంధిత సమస్యలపై ఇచ్చిన దరఖాస్తులను తప్పనిసరిగా రిజిస్టర్‌లో నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. దరఖాస్తు స్వీకరించిన సమయంలోనే సంబంధిత రిమార్క్స్ కూడా నమోదు చేయాలని విచారణకు సులువుగా ఉంటుందని సూచించారు. దరఖాస్తుల విచారణ ప్రక్రియను వేగవంతం చేసి, ప్రజలకు త్వరితగతిన న్యాయం చేకూర్చేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ రాహుల్ శర్మ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డిఓ రవి, తహసీల్దార్లు శ్వే తా, సత్య నారాయణ స్వామి తదితరులు పాల్గొన్నారు.

## సరస్వతి పుష్కరాలకు డ్యూటీ రోస్టర్

**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి :** ఈనెల 15 నుంచి జరగనున్న సరస్వతి పుష్కరాలకు భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అధికారుల ను ఆదేశించారు. గురువారం సరస్వతి పుష్కరాల విధులు, పనులు పర్యవేక్షణపై రెవెన్యూ, పంచాయతీ రాజ్, అన్ని శాఖల జిల్లా అధికారులు, తహసీల్దా ర్లు, ఎంపిడిఒలు, ఎంపిఓలతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భం గా జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ, సరస్వతి పుష్కరాల విధులు నిర్వహణకు డ్యూటీ రోస్టర్ తయారు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. పుష్కరాలకు ముఖ్య అతిథిగా రాష్ట్ర ముఖ్యమంత్రి వస్తున్నారన్నారు. తహసీల్దార్లు, ప్రోటోకాల్ విధులు, ఎంపిడిఒలు పారిశుధ్య విధులు ప ర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. ఘాట్ వద్ద రెండు రోజుల్లో మొత్తం పారిశుద్ధ్య పనులు పూర్తి చేసి పరిశుభ్రం చేయాలని సూచించారు. పారిశుద్ధ్య కా ర్యక్రమాలు పర్యవేక్షణ స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పర్యవేక్షణ చేయాల ని అన్నారు. పుష్కర విధులు కేటాయించిన అధికారులు శుక్రవారం నుండి క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేయాలని తెలిపారు. సమయం చాలా తక్కువ ఉం దని పనులు, ఏర్పాట్లు. ముమ్మరం చేయాలని స్పష్టం చేశారు. సరస్వతి, మాతా విగ్రహం ప్రారంభోత్సవం, భక్తులు గోదావరిలోకి వెళ్లకుండా ప్రమాద హె చ్చరికల బోర్డ్స్, ఉచిత అన్నదానం ఇలా ప్రతి అంశాన్ని పర్యవేక్షణ చేసేందు కు నియమించిన అధికారులు శుక్రవారం నుండి పటిష్ట పర్యవేక్షణ చేయాలని, వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని తెలిపారు. ఈ టెలి కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, ఆర్డిఓ రవి, అన్ని శాఖల జి ల్లా అధికారులు,తహసీల్దార్లు,ఎంపిడిఒలు,ఎంపిఒలుతదితరులుపాల్గొన్నారు.

## ఉత్తమ పనితీరును కనబరిచిన అధికారులకు అవార్డు అందజేత



**ప్రజాపక్షం/ములుగు ప్రతినిధి:** జిల్లాలోని గ్రామీణ ప్రాంతాలలో పేదరికం నిర్మూలించడానికి ఏర్పాటుచేసిన సొసైటీలో ఉత్తమ పని తీరును కనబరిచిన ములుగు జిల్లా సెర్ప్ అధికారులకు ప్రభుత్వం అవార్డు అందజేసింది. గురువారం హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమశాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క చేతుల మీదుగా ఇన్‌చార్జి జిల్లా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు, డిఆర్‌డిఏ ప్రాజెక్టు అధికారి సంపత్‌రావు అవార్డు ప్రశంసాపత్రం అందుకున్నారు. మంత్రి సీతక్క మాట్లాడుతూ జిల్లాలో స్వయం సహాయక సంఘాలకు 2024 ఆర్థిక సంవత్సరంలో 226 కోట్లకు గాను 235 కోట్లను అందించేందుకు గాను రాష్ట్ర స్థాయిలో ఉత్తమ స్థాయిలో ప్రతిభ కనబరిచినందుకు అందించడం జరిగిందని అన్నారు. సర్ప్ సిఈఓ డి దివ్య, ములుగు జిల్లా అదనపు డిఆర్‌డిఓ జి బాలస్వామి, జిల్లాలోని ఎస్‌హెచ్‌జి మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

## కొనుగోలు ప్రక్రియ వేగవంతం



**ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి:** ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగవంతంగా సజావుగా సాగాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. మండలంలోని పెద్దపహాడ్, గోపరాజుపల్లిలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను కలెక్టర్ ఆకస్మికంగా పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ తేమశాతం వచ్చిన ధాన్యాన్ని ఆలస్యం కాకుండా వెనువెంటనే తూకం వేయించి ట్యాగ్ చేసిన మిల్లులకు తరలించాలన్నారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల దృష్ట్యా అన్ని కేంద్రాలలో టార్పాలిన్స్ అందుబాటులో ఉంచుకోవాలని, కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంట వెంటనే తరలించాలని సూచించారు. డిమాండ్‌కు అనుకూలంగా లారీలను సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. మార్కెటింగ్, సివిల్ సప్లై అధికారులు పాల్గొన్నారు.

## 10, 11న రైతులు రెవెన్యూ సదస్సులు



**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి:** ఈ నెల 10, 11న భూపాలపల్లి నియోజకవర్గంలోని రేగొండ మండలంలో జరిగే రైతు రెవిన్యూ సదస్సుకు రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి హాజరుకానున్నట్లు ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు తెలిపారు. గురువారం భూపాలపల్లి నియోజకవర్గం రేగొండ మండలం తిరుమలగిరి గ్రామంలో తహసీల్దార్ శ్వేత ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భూ భారతి రెవెన్యూ అవగాహన సదస్సులో ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భూ భారతి రెవెన్యూ అవగాహన సదస్సులను రైతులందరూ తప్పక సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. గతంలో ఉన్న ధరణిలో అనేక లోపాలు ఉన్నాయని సిఎం రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వం గుర్తించి ధరణి స్థానంలో కొత్త చట్టాన్ని తీసుకువచ్చేందుకు మేధావులు, రైతు సంఘాలు, అందరితో చర్చించి గత చట్టంలోని లోపాలను సవరిస్తూ కొత్త చట్టం భూ భారతిని తీసుకు వచ్చిందన్నారు. లోపభూయిష్టంగా ఉన్న ధరణి వల్ల పట్టాల జారీలో ఏదేని పొరపాటు జరిగితే అప్పీలు చేయడానికి అవకాశం లేదని, రైతులు సివిల్ కోర్టు చుట్టూ తిరగాల్సి వచ్చేదని దానివల్ల ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారని తెలిపారు. ప్రజా ప్రభుత్వం అధికారం లోకి వస్తే ధరణి స్థానంలో భూ భారతి తెస్తామని చెప్పిన ప్రకారం సులువైన, పటిష్టమైన చట్టాన్ని అమల్లోకి తెచ్చినట్లు తెలిపారు. భూ భారతి నూతన ఆర్ఓఆర్ రెవెన్యూ చట్టంపై పైలట్ ప్రాజెక్టు కింద జిల్లాలోనే ఒక్క రేగొండ మండలాన్ని ఎంపిక చేసి రైతుల నుండి సలహాలు, సూచనలు, భూ సమస్యలకు సంబంధించి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. మండలంలోని మొత్తం 11 గ్రామాలలో రెవెన్యూ సదస్సులు నిర్వహించాల్సి ఉండగా, ఇప్పటి వరకు 8 గ్రామాల్లో సదస్సులు పూర్తి అయినట్లు తెలిపారు. హెల్ప్ డెస్క్ ను పరిశీలించి రైతులకు సలహాలు, సూచనలు ఇవ్వాలని ఎమ్మెల్యే సూచించారు. దరఖాస్తు స్వీకరించిన సమయంలోనే సంబంధిత రిమార్క్స్ కూడా నమోదు చేయాలని విచారణకు సులువుగా ఉంటుందని సూచించారు. దరఖాస్తుల విచారణ ప్రక్రియను వేగవంతం చేసి, ప్రజలకు త్వరితగతిన న్యాయం చేకూర్చేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. రేగొండలో జరిగే భూ భారతి సదస్సుకు 10, 11వ తేదీన రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి హాజరుకానున్నట్లు ఈ సదస్సుకు రైతులందరూ నాయకులంతా అధిక సంఖ్యలో పాల్గొని మంత్రి సదస్సును విజయవంతం చేయాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, అధికారులు రైతులు పాల్గొన్నారు.

## సీనియర్ పాత్రికేయుడు వెంపటి శంకరయ్య మృతి

### సంతాపం తెలిపిన సిపిఐ, జర్నలిస్టు సంఘాల నాయకులు



**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** హనుమకొండ జిల్లా కాజీపేటలో సీనియర్ పాత్రికేయుడు, ప్రజాపక్షం రిపోర్టర్ వెంపటి శంకరయ్య గురువారం ఉదయం గుండెపోటుతో అకస్మాత్తుగా మృతి చెందారు. సుమారు రెండు దశాబ్దాలుగా కాజీపేటలో విలేఖరిగా పనిచేస్తున్న శంకరయ్య అందరికీ అందుబాటులో ఉంటూ పనిచేశారు. కాజీపేట రైల్వే స్టేషన్ సమీపంలో మెయిన్ రోడ్డుపై పేపర్ పాయింట్, జనరల్ స్టాల్ నిర్వహిస్తున్నాడు. ఎప్పటిలాగే ఉదయం స్టాల్ నుండి ఇంటికి బైక్‌పై వచ్చిన శంకరయ్య ఒక్కసారిగా ఇంటివద్ద కుప్పకూలి పోయాడు. కుటుంబ సభ్యులు ఆయనను హనుమకొండలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు తెలిపారు. కాగా శంకరయ్యకు భార్య, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. శంకరయ్య మృతి వార్త తెలిసిన వెంటనే టియుడబ్ల్యుజె రాష్ట్ర ఉపాధ్యక్షులు గాడిపెల్లి మధు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గడ్డం రాజిరెడ్డి, తోట సుధాకర్ ఆయన ఇంటికి వెళ్లి శంకరయ్య భౌతిక కాయంపై పూలమాల వేసి నివాళులు అర్పించారు. అలాగే సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు, కాజీపేట మండల కార్యదర్శి మునిగాల భిక్షపతి, మాలోతు శంకర్ భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. శంకరయ్య మృతి పట్ల సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు ఎన్.జ్యోతి, జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్, నాయకులు నేదునూరి రాజమౌళి సంతాపం, సానుభూతి తెలిపారు.

### శంకరయ్య మృతి బాధాకరం: వెంకట్రాములు

కాజీపేట ప్రజాపక్షం విలేఖరి, సీనియర్ జర్నలిస్టు వెంపటి శంకరయ్య మరణించడం అత్యంత బాధాకరమని బిసి హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు తెలిపారు. సుదీర్ఘకాలంగా వివిధ పత్రికలలో రిపోర్టర్ గా ,ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారిధిగా ప్రజా సమస్యలపై ప్రజా ఉద్యమాలపై కథనాలు వ్రాస్తూ ప్రజల మన్ననలు పొందిన శంకరయ్య మృదుస్వభావిగా , కలుపుగోలుతనంతో అందరిలో మంచి గుర్తింపు తెచ్చుకున్నాడని , ఆయన మరణం ప్రజా ఉద్యమాలకు తీరని లోటన్నారు. శంకరయ్య మృతి పట్ల వెంకట్రాములు ప్రగాఢ సంతాపాన్ని వారి కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలియజేశారు.

## పారదర్శకంగా ఇందిరమ్మ ఇండ్ల అర్హుల ఎంపిక


### రాష్ట్ర రవాణా బిసి సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్



**ప్రజాపక్షం/భీమదేవరపల్లి:** రాష్ట్ర ప్రభుత్వం సంవత్సరానికి ప్రతి నియోజకవర్గంలో 3500 ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చేందుకు నిర్ణయించినట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. గురువారం హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం కొత్తకొండ శ్రీవీరభద్రస్వామి ఆలయంలో మంత్రి పుట్టినరోజు సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ గత పదేండ్లలో హుస్నాబాద్ నియోజకవర్గంలో 1237 డబుల్ బెడ్‌రూమ్‌లు మంజూరీ చేయగా 443 మాత్రమే ప్రజలకు అందించారని తెలిపారు. ఆప్పటి సిఎం ముల్కనూర్‌లో 443 ఇండ్లు కూలగొట్టి కేవలం 200 ఇండ్లు మంజూరీ చేసినట్లు చెప్పారు. బిఆర్ఎస్ ప్రభుత్వం పదేండ్లలో నియోజవర్గంలోని భీమదేవరపల్లి, సైదాపూర్, ఎల్కతుర్తి, కొహెడ, అక్కన్నపేట మండలాల్లో ఒక్క ఇల్లు కట్టించలేదన్నారు. ఇందిరమ్మ ఇల్లు పేదల్లో పేదలకు ఇవ్వాలని నిర్ణయించినట్లు, వచ్చే రెండు నెలల్లో మళ్ళీ 3500 ఇందిరమ్మ ఇండ్లు మంజూరీచేస్తామని తెలిపారు. గ్రామాల్లో రాజకీయాలకు అతీతంగా అవినీతి లేకుండా పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపికలు జరుగుతున్నట్లు చెప్పారు. అర్హుల పేర్లను గ్రామ పంచాయితీలలో ప్రదర్శించాలని ఆదేశించినట్లు తెలిపారు. అర్హులకు అన్యాయం జరిగితే చర్యలు తప్పవని హెచ్చరించారు. భూభారతి చట్టం అమలులో భాగంగా నియోజవర్గంలోని అక్కన్నపేట మాడల్ మండలంగా ఎంపిక చేసినట్లు వెల్లడించారు. సన్నబియ్యం పంపిణీ సజావుగా జరుగుతుందని, సిద్ధిపేట జిల్లాలో కొత్తగా 46వేల మందికి రేషన్ ద్వారా సన్నం బియ్యం అందాయన్నారు. ప్రభుత్వం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న అన్ని హామీలు అమలు చేస్తున్నామని చెప్పారు. మంత్రి పుట్టినరోజు సందర్భంగా కాంగ్రెస్ శ్రేణులు, అభిమానులు కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే కఠిన చర్యలు

### వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్



**ప్రజాపక్షం/వరంగల్ క్రైమ్ :** వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఎవరైన ప్రజలు ఇబ్బందులకు గురిచేస్తూ బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే వారిపై కఠిన చర్యలు వుంటాయని వరంగల్ పోలీస్ కమిషనర్ మందుబాబులను హెచ్చరించారు. బహిరంగ ప్రదేశాలతో పాటు, మద్యం దుకాణాల ముందు మద్యం సేవిస్తూ అ ప్రాంతం నుండి వచ్చిపోయే ప్రజలతో పాటు చిన్న పిల్లలు మరింత ఇబ్బందులకు గురౌవున్నట్లుగా పోలీసులకు పలు ఫిర్యాదులు రావడంలో దీనిపై స్పందించిన వరంగల్ పోలీస్ కమిషనర్ బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించే మందుబాబులపై చర్యలు చేపట్టేందుకు సిద్ధమయ్యారు. వరంగల్ పోలీస్ కమిషనర్ పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో పగలు,రాత్రి సమయాల్లో మద్యం దుకాణం పరిసరాలతో పాటు నిర్మానుష్య ప్రదేశాల్లో ముమ్మరంగా పెట్రోలింగ్ నిర్వహించడంతో పాటు నిర్మాణంలో ఉన్న భవనాలు, మనుషులు నివాసం లేని పురాతన భవనాల్లో తనిఖీలు నిర్వహించాల్సిందిగా వరంగల్ పోలీస్‌కమిషనర్ ఆదేశాలు జారీచేయడంతో నిన్నటి రోజు వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తూన్న నిన్న ఒక్కరోజే మొత్తం 221మంది మందుబాబులపై సిటి పోలీస్ యాక్ట్‌క్రింద కేసులు నమోదు చేయడం జరిగింది. ఇందులో అత్యధికంగా జనగామ డివిజనల్ పరిధిలో 57 కేసులు నమోదు కాగా, హన్మకొండ డివిజన్ పరిధిలో 42 కేసులు,ఘన్‌పూర్ 40, కాజీపేట 24, వర్ధన్నపేట 24, నర్సంపేట 24, వరంగల్ 10 చొప్పున కేసులు నమోదు చేయడం చేయడం జరిగిందని. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తూ పట్టుబడిన మందుబాబులపై కేసులు నమోదు చేయడం జరుగుతుందని. అలాగే మద్యం దుకాణాల పరిసరాల్లో ఎవరు కూడా బహిరంగంగా మద్యం సేవించకుండా మద్యం దుకాణా యజమానులు తగురీతిలో చర్యలు తీసుకోవాలని లేకుంటే మద్యం దుకాణాలపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే డయల్ 100 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని పోలీస్ కమిషనర్ ప్రజలకు సూచించారు.

## పేదలకు భూములు పంచాలి

### ఆల్ ఇండియా ప్రోగ్రెసివ్ ఫోరం రాష్ట్ర సమితి సభ్యుడు నేదునూరి రాజమౌళి



**ప్రజాపక్షం/హసన్ పర్తి :** దేశ వ్యవసాయ రంగాన్ని సమీక్షించి సుస్థిర అభివృద్ధి కొరకు సాగు భూమిని భూమిలేని నిరుపేద దళిత బహుజనులకి పంపిణీ చేయాలని ఆల్ ఇండియా ప్రోగ్రెసివ్ ఫోరం రాష్ట్ర నాయకులు నేదునూరి రాజమౌళి పాలకవర్గాలని డిమాండ్ చేశారు. గురువారం హసన్ పర్తి మండలం జయగిరి గ్రామంలో శాఖ సమావేశం నిర్వహించగా ముఖ్యఅతిథిగా హాజరైన నేదునూరి రాజమౌళి మాట్లాడుతూ ప్రొఫెసర్ ఎంఎస్ స్వామినాథన్ నేషనల్ కమిషన్ ఫర్ ఫార్మర్స్ పేరుతో రైతులకు కనీస మద్దతు ధర పంట పండించడానికి అయిన మొత్తం ఉత్పత్తి ఖర్చు వ్యయానికి 50 శాతం లాభం మార్జిన్ కలిపి ఇవ్వాలని 2004లో సూచించినప్పటికీ ఇప్పటికీ ఇవ్వకపోవడం ద్వారా రైతులు, వారిపై ఆధారపడిన వ్యవసాయ కూలీలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. రైతు సంక్షేమం కోసం పెట్టుబడి డబ్బులు, కరెంటు సబ్సిడీ, విత్తనాలు అందచేయడం ద్వారా ఆహార ఉత్పత్తులు పెరిగి వ్యవసాయ రంగం అభివృద్ధి చెంది దేశం వృద్ధి చెందుతుందన్నారు. వ్యవసాయ రంగం మీద ప్రభుత్వ బడ్జెట్ కేటాయింపులు పెరగాలన్నారు. మౌలిక సదుపాయాలను రైతుకు అందుబాటులో తేవాలి బేషరత్తుగా రైతు రుణాలు మాఫీ చేయాలి అని డిమాండ్ చేశారు. సిపిఐ మండల కార్యదర్శి మెట్టు శ్యాంసుందర్ రెడ్డి మాట్లాడుతూ ఈనెల 26,27 తేదీలలో హసన్పర్తి మండల కేంద్రంలో జరుగు హనుమకొండ జిల్లా సిపిఐ మహాసభలను అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. జయగిరి గ్రామ నూతన శాఖ ఎన్నుకొనడం జరిగింది. శాఖ కార్యదర్శిగా గడ్డం చంద్రమౌళి, సహాయ కార్యదర్శిలుగా నన్నే బోయిన జంపయ్య, పిట్టల రవి లను ఎన్ను కొనడం జరిగింది. రేణిగుంట్ల ఎల్ల స్వామి రేణిగుంట్ల సాంబయ్య, రేణిగుంట్ల సంజీవ, గొర్రె ప్రభాకర్, రేణిగుంట్ల కమలాకర్, అశోక్, దండ బోయిన రవీందర్, ఆర్ కిష్టయ్య, యాటకాయల కుమారస్వామి, విజయ తదితరులు పాల్గొన్నారు.

ఫోకస్

# వ్యవసాయం




## 'కంధమాల్' ఆదర్శనం..

ఒడిశాలోని కంధమాల్ అపెక్స్ స్పైసెస్ అసోసియేషన్ ఫర్ మార్కెటింగ్ సంస్థ 61 స్పైస్ డెవలప్‌మెంట్ సొసైటీల ద్వారా కంధమాల్ పసుపును ప్రోత్సహిస్తుంది. ఇది కిసాన్ సాథీతో సహకరిస్తుంది. గుమాపదార్ ఎఫ్‌పిసి లిమిటెడ్ నెదర్లాండ్స్‌లోని నెడ్‌స్పైస్ గ్రూప్‌కు పసుపును ఎగుమతి చేయడంలో సహాయపడుతున్నది. ప్రపంచ మార్కెట్‌లను చేరుకోవడానికి ఎఫ్‌పిఒల సామర్థ్యాన్ని ప్రదర్శిస్తున్నది. ఇలావుంటే, ఎన్నో దేశాల్లో వివిధ దేశాల్లో ఎఫ్‌పిఒలు రైతుకు ప్రయోజనం చేకూర్చే ప్రయత్నం చేస్తున్నాయి. మెక్సికోలో ఎజిడో వ్యవస్థ ఉంది. ఇవిసామూహిక వ్యవసాయ వ్యవస్థలు. ఇక్కడ భూమిని సమిష్టిగా యాజమాన్యం చేసుకుని, సమాజాలు నిర్వహిస్తాయి. ఇవి రైతులకు అంతర్జాతీయ మార్కెట్లను యాక్సెస్ చేయడానికి సహాయపడతాయి. ముఖ్యంగా అవకాడోలు, బెర్రీలు వంటి పంటలకు ఈ వ్యవస్థ విశేషంగా చేయూతనిస్తున్నది. కాగా థాయిలాండ్‌లో 'వన్ టాంబోన్.. వన్ ప్రొడక్ట్' (ఒక గ్రామం.. ఒకే ఉత్పత్తి) వంటి కార్యక్రమాలు ప్రత్యేకమైన స్థానిక వ్యవసాయ ఉత్పత్తులను ప్రోత్సహిస్తున్నాయి. చైనాలో టీ, పండు, ఆక్వాకల్చర్ వంటి రంగాలలోని రైతు వృత్తి సహకార సంస్థల ద్వారా ప్రపంచ మార్కెట్లకు తమతమ ఉత్పత్తులను చేరవేస్తున్నారు. అలీబాబా వంటి వేదికలు వినియోగదారులకు ప్రత్యక్ష అమ్మకాలను అనుమతిస్తున్నాయి.

## జన్యుమార్పిడి వరి రకాలు



విదేశీ డిఎన్‌ఎని ప్రవేశపెట్టకుండా దిగుబడి, వాతావరణ స్థితిస్థాపకత, వనరుల సామర్థ్యాన్ని పెంచే లక్ష్యంతో భారతదేశం తన మొట్టమొదటి జన్యు మార్పిడి లేదా జన్యు సవరణ వరి రకాలను డిఆర్‌ఆర్ ధన్ 100 (కమల), పూసా డిఎస్‌టి రైస్ 1 విడుదల చేయడం భారత వ్యవసాయ రంగంలో పెను మార్పులకు కారణం కానుంది. వీటిని అధునాతన సిఆర్‌ఐఎస్‌పిఆర్‌సిఎఎస్ జీనోమ్‌ఎడిటింగ్ టెక్నాలజీని ఉపయోగించి ఐసిఎఆర్ అభివృద్ధి చేసింది. ఇందులో విదేశీ డిఎన్‌ఎ ప్రవేశపెట్టకపోవడం విశేషం. దీనివల్ల వీటిని సాంప్రదాయకంగా పెంచే పంటలతో పోల్చవచ్చు.

**డిఆర్‌ఆర్ ధన్ 100 (కమల):** దీనిని ప్రసిద్ధ సాంబా మహసూరి రకం ఆధారంగా రూపొందించారు. ధాన్యం సంఖ్యను మెరుగుపరచడానికి సైటోకినిన్ ఆక్సిడేస్ 2 (సికెఎక్స్2) జన్యువు (జిఎన్1ఎ)ను లక్ష్యంగా చేసుకుని సైట్ డైరెక్టెడ్ న్యూక్లిస్ 1 (ఎస్‌డిఎన్1) సాంకేతికతను ఉపయోగించి సవరించారు. ఇది త్వరగా పరిపక్వత చెందడానికి (15 20 రోజుల ముందు పండించినది), కరువును తట్టుకోవడానికి వీలుగా, అధిక నత్రజని వినియోగ సామర్థ్యాన్ని కలిగిస్తుంది.

**పూసా డిఎస్‌టి రైస్1:** దీనిని మారుటెరు 1010 రకం ఆధారంగా తయారు చేశారు. కరువు, ఉప్పును తట్టుకునే శక్తిని పెంచుతుంది. దీని ఫలితంగా తీరప్రాంత లవణీయతలో 30.4% అధిక దిగుబడి, క్షార నేలల్లో 14.66 శాతం, లోతట్టు ప్రాంతాలలో 9.67 శాతం అధిక దిగుబడి లభిస్తుంది.

**సైట్-డైరెక్టెడ్ న్యూక్లియేజ్ టెక్నాలజీ:** ఇది న్యూక్లియేజ్‌లు అని పిలిచే ఎంజైమ్‌లను ఉపయోగించి డిఎన్‌ఎలో ఖచ్చితమైన మార్పులను పరిచయం చేసే జీనోమ్‌ఎడిటింగ్ టెక్నిక్. ఎస్‌డిఎన్1 విదేశీ డిఎన్‌ఎ ని ఉపయోగించకుండా చిన్న మార్పులతో లక్ష్యాలను అందుకుంది. అయితే ఎస్‌డిఎన్2 నిర్దిష్ట కావలసిన మార్పులను పరిచయం చేయడానికి టెంప్లేట్ డిఎన్‌ఎ (హోస్ట్ మాదిరిగానే)ను ఉపయోగిస్తుంది.

# నిరాశపరుస్తున్న ఎఫ్‌పిఒలు




రైతు ఉత్పత్తిదారుల సంస్థలు (ఎఫ్‌పిఒలు)లలో ప్రభుత్వం గణనీయమైన పెట్టుబడి పెట్టినప్పటికీ, వాటి పురోగతి ఊహించిన దానికంటే నెమ్మదిగా ఉంది. దీనితోపాటు, చిన్న రైతుల వ్యవసాయ వ్యాపార కన్సార్టియం (ఎస్ఎఫ్ఎసి), సహకార సంస్థలు, ఇఎన్ఎఎం, వ్యవసాయ సాంకేతిక స్టార్టప్‌లు భారతదేశంలోని చిన్న రైతులను సాధికారపరచడంలో నిర్ణీత లక్ష్యాలను అందుకోలేకపోతున్నాయి. ఎఫ్‌పిఒ అనేది రైతులు సభ్యులుగా ఉండే ఒక రకమైన ఉత్పత్తిదారు సంస్థ. దాని ప్రమోషన్‌కు చిన్న రైతుల వ్యవసాయ వ్యాపార కన్సార్టియం మద్దతు ఇస్తుంది. కంపెనీల చట్టం, 1956 సూచనలను సవరించాలని ఆర్థికవేత్త వైకె అలగ్ సిఫార్సు (2002) నుండి ప్రేరణ పొంది, 2008 లో ఎఫ్‌పిఒలు ఉనికిలోకి వచ్చాయి. ఎఫ్‌పిఒలను కంపెనీల చట్టం, 2013 , సొసైటీల రిజిస్ట్రేషన్ చట్టం, 1860 లేదా ఇండియన్ ట్రస్ట్స్ చట్టం, 1882 కింద పబ్లిక్ ట్రస్ట్‌లుగా నమోదు చేసుకోవచ్చు. ఉత్పత్తిదారుల సంస్థ అనేది వ్యవసాయ, వ్యవసాయేతర లేదా చేతివృత్తుల ఉత్పత్తిదారుల సమూహం, ఇది ఉత్పత్తిదారులు లేదా సహకార సంఘాలు వంటి చట్టపరమైన రూపాలను తీసుకొని సభ్యుల మధ్య లాభాలను పంచుకుంటుంది. భారతీయ వ్యవసాయంలో చిన్న, సన్నకారు రైతులు ఎక్కువ. అయితే వారు వాతావరణం, మార్కెట్ నష్టాలను ఎదుర్కొంటున్నారు. సరసమైన ధరలను పొందడానికి ఇబ్బంది పడుతున్నారు. పెద్దమొత్తంలో ఇన్‌పుట్ కొనుగోళ్లను సులభతరం చేయడం, బేరసారాల శక్తిని మెరుగుపరచడం, తగ్గిన ఖర్చులతో మెరుగైన ధరల సాక్షాత్కారాన్ని నిర్ధారించడం ద్వారా చిన్న రైతులకు ఎఫ్‌పిఒలు సహాయపడతాయి. అవి మార్కెట్ యాక్సెస్‌ను కూడా మెరుగుపరుస్తాయి. ఆదాయాలను రెట్టింపు చేయడం, ప్రపంచ మార్కెట్లలోకి ప్రవేశించడం అనే లక్ష్యానికి మద్దతు ఇస్తాయి. ఇప్పటి వరకూ 45,000 ఎఫ్‌పిఒలు కంపెనీలుగా నమోదయ్యాయి, కానీ 16,000 మాత్రమే సరైన లక్ష్యాలను ప్రకటించాయి. వీటిలో కేవలం 4,000 ఎఫ్‌పిఒలు మాత్రమే వర్కింగ్ క్యాపిటల్ లోన్లు పొందాయి. ప్రతి ఎఫ్‌పిఒకి సగటు నికర లాభం రూ. 3 లక్షలు. రైతుల ఆదాయాన్ని పెంచడానికి ఈ మొత్తం చాలా తక్కువ.




## తీసుకోవాల్సిన చర్యలు



ఎఫ్‌పిఒలను బలోపేతం చేయడానికి ప్రభుత్వాలు యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలి. సమర్థవంతమైన నాయకత్వం, చురుకైన రైతు భాగస్వామ్యం, ఆచరణీయ వ్యాపార నమూనాలతో అధిక సామర్థ్య ఎఫ్‌పిఒలను గుర్తించి, వాటికి మద్దతునివ్వాలి. ఈ ఎఫ్‌పిఒలను ఇతరులు అనుకరించడానికి, ఆదర్శ సంస్థలుగా పెంపొందించడానికి పౌర సమాజ సంస్థలు (సిఎస్ఒలు), దాతృత్వ సంస్థలు, వ్యవసాయసాంకేతిక స్టార్టప్‌లతో భాగస్వామ్యం చేసుకోవాలి. ఎఫ్‌పిఒ కార్యకలాపాలపై వ్యాపార నమూనాలు (ఇన్‌పుట్ సరఫరా, మార్కెటింగ్, విలువ జోడింపు), ఆర్థిక నిర్వహణ (లాభ భాగస్వామ్యం, వర్కింగ్ క్యాపిటల్), డిజిటల్ సాధనాలు (ఇఎన్ఎఎం, ఒఎన్‌డిసి,అగ్రిటెక్) సజావుగా పనిచేయడానికి స్థానిక భాషలో హ్యాండ్ బుక్‌లను రూపొందించడం కూడా తక్షణ అవసరాల్లో ఒకటి. వ్యవసాయ విశ్వవిద్యాలయాలలో స్వల్పకాలిక కోర్సుల ద్వారా గ్రామీణ యువతకు ఎఫ్‌పిఒ నిర్వహణలో శిక్షణ ఇవ్వడం, వారిని ఎఫ్‌పిఒ ప్రమోటర్లుగా, స్వయం ఉపాధి నిపుణులుగా నియమించడం ద్వారా ఎఫ్‌పిఒలను స్థాపించి, నిర్వహించడంలో రుసుము చెల్లించాలి. ప్రాసెసింగ్, బ్రాండింగ్, సర్టిఫికేషన్‌లో ఎఫ్‌పిఒలకు మద్దతు ఇవ్వడం, ప్రత్యక్ష రిటైల్ భాగస్వామ్యాలను (సూపర్ మార్కెట్‌లు, ఎగుమతి మార్కెట్‌లు) సులభతరం చేయడం, ఎఫ్‌పిఒ నేతృత్వంలోని వ్యవసాయపర్యాటకం , రైతు మార్కెట్‌లు, సబ్‌స్క్రిప్షన్ ఆధారిత నమూనాలను (ఉదా., వారపు కూరగాయల పెట్టెలు) ప్రోత్సహించడం వంటి చర్యలు అవసరం.

## ఎన్నో సవాళ్లు

మన దేశంలో సరైన విధానం లేకోవడం, ఉన్న విధానాలు సక్రమంగా అమలుకాకపోవడం వంటి సమస్యలు ఉన్నాయి. ఒక రకంగా చెప్పాలంటే, అందరికీ సరిపోయే విధానం లేదు. వాతావరణ ప్రమాదాలకు రైతుల దుర్బలత్వం, బలమైన గ్రామీణ మౌలిక సదుపాయాలు లేకపోవడం, అనేక పంటలకు కనీస మద్దతు ధరలు (ఎంఎస్‌పి) పరిమితంగా ఉండటం, ప్రపంచ వ్యవసాయ ధరల అస్థిరత, కొన్ని వ్యవసాయ వర్గాలను అణగదొక్కే నిరంతర సామాజిక అసమానతలు వంటి లోతుగా పాతుకుపోయిన సమస్యలను పరిష్కరించడానికి ఎఫ్‌పిఒలు ఒంటరి పోరాటం జరపలేవు. సమస్యలను పరిష్కరించలేవు. 3,500 ఎఫ్‌పిఒలను ఇఎన్ఎఎంతో అనుసంధానించినప్పటికీ, ట్రేడింగ్ విలువ (రూ. 3.19 లక్షల కోట్లు) మొత్తం వ్యవసాయ ప్రస్తుత ధరల వద్ద 50 లక్షల కోట్ల రూపాయల్లో కేవలం ఒక భాగం మాత్రమే. అపనమ్మకం, మార్కెట్ విచ్ఛిన్నం, మౌలిక సదుపాయాల అంతరాలు, ప్రాంతీయ అసమానతల కారణంగా ఇఎన్ఎఎం విస్తృత వ్యవసాయ ఆర్థిక వ్యవస్థను పూర్తిగా చేరుకోవడం లేదని ఈ అసమానత స్పష్టం చేస్తున్నది. చాలా ఎఫ్‌పిఒలు ఇన్‌పుట్/అవుట్‌పుట్ మార్కెటింగ్‌లో నామమాత్రంగా 3 నుంచి 6 శాతం లాభాలపై పనిచేస్తున్నాయి. ఈ తీరు దీర్ఘకాలిక లాభదాయకతపై సందేహాలను లేవనెత్తుతున్నది. పరిమిత లాభాల మార్జిన్‌లతో, ఎఫ్‌పిఒలు కార్యాచరణ ఖర్చులను భరించడానికి, వృద్ధిలో పెట్టుబడి పెట్టడానికి, వారి కార్యకలాపాలను కొనసాగించడానికి ఇబ్బందులు తప్పడం లేదు. రుణాలు, పూచీకత్తు తదితర అవసరాల కోసం ఎక్కువగా మధ్యవర్తులు, భూస్వాములపై ఆధారపడతారు. భూస్వామ్య వ్యవస్థ బలంగా ఉన్న ప్రాంతాల్లో రైతుల అవసరాలను కేవలం ఎఫ్‌పిఒలు పూర్తిగా భర్తీ చేయకపోవచ్చు. కొన్ని ఎఫ్‌పిఒలు సేకరణ ఏజెంట్లుగా లేదా కస్టమ్ నియామక కేంద్రాలుగా పనిచేస్తున్నాయి. రైతులను శక్తివంతం చేయాలనే వారి అసలు ఉద్దేశ్యాన్ని నీరుగారుస్తున్నాయి. సామాజిక మూలధనం లేకపోవడం మరో సమస్య. సామాజిక నెట్‌వర్క్‌లపై ఆధారపడిన సంస్థలు రాత్రికి రాత్రే వేళ్లూనుకోలేవు. కాబట్టి, ఏకాభిప్రాయాన్ని నిర్మించడానికి, అభివృద్ధి చెందడానికి ఎఫ్‌పిఒలకు సామాజిక మూలధనం, అవి కోలుకోవడానికి తగినంత సమయం అవసరం. సామాజిక మూలధనం తగినంత లేకుంటే, ఎఫ్‌పిఒలు స్థిరత్వం, పాలన మరియు వృద్ధిలో సవాళ్లు తప్పవు. ఈ పరిస్థితులు రైతులకు ప్రయోజనాలను ఆలస్యం చేస్తాయి. విస్తరణకు ఆటంకం కలిగిస్తాయి.



## ఫీజుల నియంత్రణ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలి

ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో అడిషనల్ కలెక్టర్ గణేష్ రాథోడ్‌కు వినతి



**ప్రజాపక్షం/హనుమకొండ :** ఈ విద్యా సంవత్సరం ఫీజుల నియంత్రణ చట్టాన్ని పగడ్బందీగా అమలు చేయాలని, ప్రభుత్వ అనుమతులు, కనీస మౌలిక సదుపాయాలు లేని ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలను సీజ్ చేయాలని, ప్రభుత్వ పాఠశాలలో మౌలిక సదుపాయాలకు చర్యలు చేపట్టాలని జిల్లా వ్యాప్తంగా ఉన్న సమస్యలు వివరిస్తూ.. ఎఐఎస్ఎఫ్ హనుమకొండ జిల్లా సమితి ఆధ్వర్యంలో అడిషనల్ కలెక్టర్ గణేష్ రాథోడ్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఎఐఎస్ఎఫ్ హనుమకొండ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఊట్కూరి ప్రణీత్ గౌడు, భాష బోయిన సంతోషం మాట్లాడుతూ ఈ విద్యా సంవత్సరం ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలలో ఫీజుల నియంత్రణ చట్టాన్ని పగడ్బందీగా అమలు చేయాలని, జిఒ నెంబర్ 42 ప్రకారం ప్రభుత్వ నిబంధన ప్రకారం అర్బన్‌లో, రూరల్‌లో ప్రభుత్వ నిర్ణయించిన ప్రకారమే ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలలు ఫీజులు తీసుకోవాలని పెంచుకోవలసి వస్తే కలెక్టర్, డిఇఒ, పేరెంట్స్ కమిటీ నిర్ణయ అధికారం మేరకు మాత్రమే ఫీజులు పెంచుకోవడానికి జిఒ నెంబర్ 42 సూచిస్తుందన్నారు. దీన్ని ప్రతి సంవత్సరం తుంగలో తొక్కి పది నుండి 20 శాతం వరకు ఇష్టానుసారం ఫీజులు పెంచుకోవడం వల్ల పేద బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు చదువు అందని ద్రాక్షలా మారుతుందన్నారు. జిఒ నెంబర్ 1,10,92,42 .. ప్రభుత్వ జిఒలను పగడ్బందీగా అమలు చేసి డిజి, ఒలంపియాడ్, ఇటెక్నో, ప్రభుత్వ అనుమతి లేని తోక పేర్లను తొలగించాలని, ప్రభుత్వ అనుమతి లేని ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలలను సీజ్ చేసి ప్రభుత్వ పాఠశాలలో మౌలిక సదుపాయాల కొరకు చర్యలు చేపట్టాలని వారు డిమాండ్ చేయడం జరిగింది. లేనిపక్షంలో ఎఐఎస్ఎఫ్ హన్మకొండ జిల్లా సమితి ఆధ్వర్యంలో పాఠశాలల ముందు ప్రత్యక్షంగా ధర్నాలకు దిగుతామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ హనుమకొండ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఊట్కూరి ప్రణీత్ గౌడ్ , భాషబోయిన సంతోష్,జిల్లా ఉపాధ్యక్షులు కుక్కల కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## 20న దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మె

ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్

**ప్రజాపక్షం/ ఆసిఫాబాద్ :** ఈ నెల 20న జరిగే దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ పిలుపునిచ్చారు. గురువారం రోజున సమ్మె నోటీసులు రెబ్బెన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు సుజిత్‌కి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బిజెపి ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు కార్మిక సంహితలను వెంటనే రద్దు చేయాలని, 44 కార్మిక చట్టాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) ఉద్యోగులందరినీ 510 జిఒలో నష్టపోయిన వారందరినీ కొత్త జిఒ ద్వారా వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్ వ్యవస్థను రద్దు చేసి అందరినీ ఎలాంటి షరతులు లేకుండా క్రమబద్ధీకరించాలని, వేతన సవరణ సంఘం (పిఆర్‌సి) బకాయిలను వెంటనే చెల్లించాలని, నాలుగో తరగతి ఉద్యోగులకు కనీస వేతనం రూ.26,000లు చెల్లించాలని, రెండవ సహాయ నర్సు మంత్రసానులను (ఎఎన్‌ఎం) ఎలాంటి షరతులు లేకుండా క్రమబద్ధీకరించాలని, ఏజెన్సీ కాంట్రాక్ట్ విధానాన్ని రద్దు చేసి కార్పొరేషన్ ద్వారా ప్రతి నెల 5వ తేదీలోపు వేతనాలు చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా సంయుక్త కార్యదర్శి ప్రమీల, సిబ్బంది తులసి, వనిత, మండల, అరికిల్ల స్వామి తదితరులు పాల్గొన్నారు.



## ఉద్రిక్త పరిస్థితులు మతోన్మాదులకు అవకాశం కావొద్దు

జిల్లా కార్యవర్గ సమావేశంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కలవేన శంకర్ ..



**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** పేద ప్రజల కోసం, బడుగు బలహీన వర్గాల కోసం కార్మికుల కోసం దేశం కోసం పోరాడిన సిపిఐ పార్టీ వైపే ప్రజలు ఉంటారని రాబోయే రోజుల్లో కమ్యూనిస్టుకి మంచి రోజులు రాబోతున్నాయి. కష్టపడి పనిచేసి సిపిఐ పార్టీని ప్రజలలో తీసుకువెళ్లాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు కలవేణి శంకర్ సభ్యులకు సూచించారు. గురువారం నిర్మల్ జిల్లా కేంద్రంలోని సిపిఐ జిల్లా కార్యాలయంలో సిపిఐ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కార్యవర్గ సభ్యులు కలవేన శంకర్ మాట్లాడుతూ మోదీ ఆలోచనలో ఎటువంటి మార్పు లేదని ప్రజల గురించి కాకుండా సంపన్న వర్గాల గురించి మాత్రమే అలోచిస్తున్నారన్నారు. ముఖ్యంగా వ్యవసాయ కార్మికులకు సంబంధించి పని దినాలు తగ్గించడం, వ్యవసాయ రంగాన్ని పూర్తిగా విస్మరించడం జరుగుతుందని ఆయన తెలిపారు. దేశంలో నెలకొన్న ఉద్రిక్తత మత ఉన్మాదులు అవకాశంగా తీసుకోకుండా చూడాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీల ను అమలు చేయడంలో జాప్యం జరుగుతుండడంతో ప్రభుత్వం పట్ల విశ్వసనీయత సన్న గిల్లుతుందని తెలిపారు. రైతు భరోసా విషయంలో ప్రభుత్వం లక్ష్యం దిశగా పని చేయలేదన్నారు. ప్రభుత్వ లెక్కల ప్రకారమే కేవలం 40 శాతం మాత్రమే రుణమాఫీ పూర్తయినట్లు తెలుస్తుందన్నారు. రైతు భరోసా నాలుగు ఎకరాల వరకు రైతుల ఖాతాల్లో వేశామని చెబుతున్నప్పటికీ అది కూడా అమలు కాలేదన్నారు. ధాన్యం కొనుగోళ్ల విషయంలో జరుగుతున్న జాప్యం రైతుల పాలిట శాపంగా మారిందని ఆయన తెలిపారు. కోతలు విధించడంతో పాటు కొనుగోళ్లలో లోపాలు ఉ న్నాయని ఆయన తెలిపారు. రైతుల వద్ద నుంచి ధాన్యం కొనుగోలు చేసే విషయంలో మిల్లర్లు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని ఆయన తె లిపారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై ముఖ్యమంత్రి వ్యాఖ్యలు ఇప్పుడు సర్వత్రా చర్చనీయాంశమయ్యాయని భవిష్యత్తులో ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉందని తెలిపారు. రాష్ట్రంలో వ్యవసాయ కార్మికులకు సంబంధించి కేంద్ర ప్రభు త్వం పని దినాలను తగ్గించిందని సగానికి పని దినాలు తగ్గించడం వ్యవసాయ కార్మికుల జీవనోపాధిని దెబ్బతీయడమేనన్నారు. రాష్ట్ర ప్రభుత్వం దీనిపై స్పందించాల్సిన అవసరం ఉందని ఆయన తెలిపారు. రైతుబీమా, పంటల బీమా విషయంలో ఇబ్బందికర పరిస్థితులు ఎదురవుతున్నాయని కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా పంటల బీమా అమలు కాకపోవడం శోచనీయమన్నారు. శత వసంతాల సిపిఐ ముగింపు సభలో జరగనుందని ఈ మహాసభకు 20 దేశాల నుంచి ప్రతినిధులు హాజరు కానున్నారన్నారు. ఈ సమావేశంలో జిల్లా సిపిఐ కార్యదర్శి ఎస్.విలాస్, ఎల్ ఆర్ ఉప్పొలి జిల్లా సహాయ కార్యదర్శి, ఎఐటియుసి జిల్లా కార్యదర్శి శ్రీనివాస చారి, కామ్రేడ్ బుక్య రమేష్, పెండారి ముత్యం, .రవి, గోపి, అక్రమ్ ఖాన్,నశీర్, జావిద్, ఆనంద రావు, లతీ ఫ్ తదితరులు పాల్గొన్నారు.

## అనుమతి లేని శ్రీ చైతన్య పాఠశాలపై కఠిన చర్యలు తీసుకోవాలి

ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మంద అనిల్ కుమార్



**ప్రజాపక్షం/ఇల్లంతకుంట :** ఇల్లంతకుంట మండలంలో ప్రభుత్వ అనుమతు లు లేకుండా విద్యార్థుల నుంచి అడ్మిషన్లు తీసుకుంటున్న శ్రీ చైతన్య పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మంద అనిల్ కుమార్ అన్నారు. సిరిసిల్ల బ్రాంచ్‌కి చెందిన శ్రీ చైతన్య కార్పొరేట్ యాజమాన్యం ఎలాంటి అనుమతి లేకుండా మండలంలోని పలు గ్రామాలలో అడ్మిషన్లు నిర్వహిస్తున్నారన్నారు. ప్రభుత్వ అధికారులు వెంటనే స్పందించి ఆ పాఠశాలను రద్దుచేసి యాజమాన్యంపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఏలాంటి పర్మిషన్ రాకముందే శ్రీ చైతన్య పాఠశాల ముందస్తు అడ్మిషన్లు ప్రారంభం చేశారని పిఆర్ఒలను పెట్టుకొని ప్రచారం నిర్వహి స్తూ తల్లిదండ్రులకు మాయమాటలు చెప్పి అడ్మిషన్లు తీసుకుంటున్నారని అధికారులు ప్రభుత్వం కార్పొరేట్ పాఠశాలల ఆగడాలకు అడ్డుకట్ట వేయాలని అ న్నారు. నిబంధనలకు విరుద్ధంగా అధిక ఫీజులతో రాష్ట్రంలో విద్యార్థుల బలి తీసుకుంటున్న సంస్థ శ్రీ చైతన్య అని ఎద్దేవా చేశారు. విద్యార్థుల ఆత్మహత్యల కు కారణం అవుతున్న శ్రీ చైతన్య విద్యాసంస్థలను రాష్ట్రవ్యాప్తంగా సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలల మూసివేతకు కారణం ప్రైవేటు కార్పొరేట్ పాఠశాలలు పుట్టగొడుగుల రావటమే అన్నారు. పాఠశాలలో చదువులు చెప్పానికి వెళ్లె వారికి 25 అడ్మిషన్లు తీసుకురావాలని టార్గెట్ పెట్టి ప్రలోభలకు గురి చేస్తున్న పరిస్థితి అన్నారు. ముందస్తు అడ్మిషన్ల కోసం తిరిగితే ఊరుకునేది లేదని ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ప్రత్యక్ష దాడులకు సిద్ధమవుతామని హెచ్చరించారు.

## తిరుపతిలో 15-18 వరకు ఎఐవైఎఫ్ 17వ జాతీయ మహాసభలు

పెద్దపల్లి జిల్లా కేంద్రంలో గోడపత్రికల ఆవిష్కరణ




**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి :** మే 15–18 వరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, తిరుపతిలో జరగనున్న ఎఐవైఎఫ్ 17వ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని అఖిల భారత యువజ న సమాఖ్య (ఎఐవైఎఫ్) జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఆరెపల్లి మానస్ కుమార్ మార్కపురి సూర్య పిలుపునిచ్చారు. గురువా రం రోజున స్థానిక పెద్దపల్లి బస్టాండ్ దగ్గర ఎఐవైఎఫ్ జాతీయ మహాసభల గోడ ప్రతులను ఎఐవైఎఫ్ జిల్లా సమితి ఆధ్వర్యం లో ఆవిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా ఎఐవైఎఫ్ జి ల్లా అధ్యక్ష కార్యదర్శులు ఆరేపల్లి మానస్ కుమార్ మార్కపురి సూర్యలు సంయుక్తంగా మాట్లాడుతూ భారతదేశంలో యువజన సామర్థ్యాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తోంద ని ఆరోపించారు. ప్రధానంగా దేశంలో నిరుద్యోగ సమస్య అధికమయిందని, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో కాలయాపన చేయడం మూలంగానే దేశ ఆర్థిక వ్యవస్థ ముం దుకు పోవడం లేదని వారు విమర్శించారు. ఉపాధి ఉత్పత్తి కేం ద్రాలను ఏర్పాటు చేయకుండా ఏ ప్రభుత్వం కూడా ఉద్యోగ అవకాశాలు కల్పించలేవని వారు అన్నారు. పాలకులు ఎంతసేపటికీ ప్రైవేట్, కార్పొరేట్ పెట్టుబడిదారీ వ్యవస్థలపైనే ఆధారపడటం ద్వారా దేశ ఆర్థిక సమతుల్యత సాధ్యం కాదని వారు అ న్నారు. ఈ చర్యల మూలంగా దేశంలో గత 10సంవత్సరాలు గా వందలాది ప్రభుత్వ రంగ సంస్థలు మూతపడ్డాయని, దే శంలో రోజురోజుకూ నిరుద్యోగ సమస్య పెరుగుతోందని వా రు ఆవేదన వ్యక్తంచేశారు.అందుకే 2025 మే 15–18వరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని తిరుపతి నగరంలో జరగనున్నాయ ని, ఈ మహాసభలలో ప్రధానంగా నిరుద్యోగం, ఉపాధి అవకాశాలు, పాలకుల విధానాలు తదితర అంశాలపై బోధనలు, చర్చలు, తీర్మానాల ద్వారా నిర్ణయాలు ఉంటాయని,ఈ జాతీ య మహాసభలకు దేశం నలుమూలల నుండి సుమారు 800 మంది డెలిగేషన్ నాయకత్వం పాల్గొంటారని,తెలంగాణ రాష్ట్రం నుండి 80మంది డెలిగేషన్ పాల్గొంటున్నట్లు, మే15 న తిరుపతిలో జరగనున్న మహాసభల ర్యాలీ, బహిరంగ సభకు 1000 మంది పాల్గొంటున్నట్లు వారు తెలిపారు. పెద్దపల్లి జిల్లా నుండి సైతం యువతి యువకులు పెద్ద సంఖ్యలో జాతీయ మహాసభలకు హాజరుకావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఎఐవైఎఫ్ మాచర్ల అంజి. చంద్రగిరి ఉదయ్. తాజోద్దీన్. అమాన్. లక్ష్మ ణ్.బండారి సదానందం. మాచర్ల శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ పని నిర్వీర్యానికి కుట్ర

రాష్ట్ర అధ్యక్షులు కలకొండ కాంతయ్య




**ప్రజాపక్షం/నల్లగొండ :** కేంద్ర ప్రభుత్వం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేయడానికి కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఉపాధి హామీ పనికి రూ.80వేల కోట్లు మాత్రమే కేటాయించిందని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం (బికెఎంయు)రాష్ట్ర అధ్యక్షులు కలకొండ కాంతయ్య ఆరోపించారు. స్థానిక సిపిఐ జిల్లా కార్యాలయం మగ్దూం భవన్‌లో గురువారం జరిగిన బికెఎంయు జిల్లా కౌన్సిల్ సమావేశంలో కాంతయ్య ముఖ్యతిధిగా హాజరై మాట్లాడుతూ ఉపాధి కూలీలకు 200 రోజులు పని దినాలు పెంచి పెరుగుతున్న ధరలకు అనుగుణంగా రూ.700లు రోజువారి కూలీవ్వాలని డిమాండ్ చేశారు. మున్సిపాలిటీలలో కూడా ఉపాధి హామీ పనిని ప్రవేశపెట్టి కూలీలకు ఉపాధి పన్నులు కల్పించాలన్నారు. పని ప్రదేశాలలో కనీస సౌకర్యాలు లేక ఉపాధి హామీ కూలీలు నానా అవస్థలు పడుతున్నారని పని ప్రదేశాలలో మంచినీరు టెంట్ సౌకర్యం ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు మెడికల్ కిట్టు తదితర సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ కూలీలకు పారా గడ్డపార తట్ట పనిముట్లు ఇవ్వాలని అదేవిధంగా పని ప్రదేశాలలో ఫొటోస్ స్కానింగ్ విధానాన్ని ఎత్తివేయాలని ఫీల్డ్ అసిస్టెంట్ల పెండింగ్ జీతాలను వెంటనే విడుదల చేయాలని అదేవిధంగా కూలీల కూడా పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారెంటీలని అమలు చేయాలని కొత్త రేషన్ కార్డులు, వృద్ధాప్య, వితంతు, వికలాంగుల, ఒంటరి మహిళల పెన్షన్ ఇవ్వాలని. ఇంటి స్థలాలు లేని వారికి ఇంటి స్థలాలు ఇచ్చి ఇందిరమ్మ ఇల్లు నిర్మాణం కొరకు ఆరు లక్షల ఇవ్వాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు లోడంగి శ్రవణ్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బొలుగురి నరసింహ, మాజీ జెడ్‌పిటిసి గోస్కుండ లింగయ్య, జిల్లా ఉపాధ్యక్షులు వెంగలయ్య, సహాయ కార్యదర్శి రామకోటి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు వేముల బుచ్చయ్య నాయకులు ఏ హుస్సేన్, ఎండి జానీ మియా, కాయితి వెంకన్న, కోరే సత్తయ్య, నేరెళ్ల సైదయ్య, బూషపాక ప్రశాంత్,ఇరిగి సంజీవ,వెంపటి శ్రీను, జి పుల్లయ్య, జిల్లా బాలకృష్ణ,జక్కర్తి అంజయ్య, వంగాల నాగయ్య తదితరులు పాల్గొన్నారు.



# స్థానికం
REGIONAL NEWS
కరీంనగర్, మెదక్ ఆదిలాబాద్, నిజామాబాద్

## కాంగ్రెస్‌తోనే మహిళా సాధికారత సాధ్యం

ప్రజాపక్షం/నేరడిగొండ : నేరడిగొండ మండలంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సోనాల మండలం ఘన్పూర్ చెందిన సీనియర్ మహిళా నాయకురాలు మడవి రమాదేవి,ఆమె అనుయాయులు కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అభివృద్ధి పనులకు మహిళా సాధికారత కాంగ్రెస్‌తోనే సాధ్యమని నమ్ముకంతో కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆడే గజేందర్ వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## 'రాజీవ్ యువవికాసం' ఇంటర్వ్యూలు



ప్రజాపక్షం/ కాగజ్‌నగర్‌రూరల్ : రాజీవ్ యువ వికాసం పథకం కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఇంట ర్వ్యూలు నిర్వహించారు. కాగజ్‌నగర్ మండల పరిషత్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన ఇంటర్వ్యూలకు మండలంలోని చింతగూడ, కోయవాగు గ్రామాల దరఖాస్తు దారులు హాజరయ్యారు. దరఖాస్తు దారులకు ఎంపిడిఓ కోట ప్రసాద్, సంబంధిత అధికారులు ఇంటర్వ్యూలు నిర్వహించి సర్టిఫికెట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ కోట ప్రసాద్ మాట్లాడుతూ ఎంపిడిఓ కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేసి ఆయా గ్రామాల వారిగా ప్రతి రోజు ఇంటర్వ్యూలు నిర్వహించి దరఖాస్తులను పరిశీలిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి ఎడిఎ మనోహర్, యూనియన్ బ్యాంక్ ఫీల్డ్ ఆఫీసర్ సూరజ్, ఇతర బ్యాంకుల మేనేజర్లు, చింతగూడ పంచాయతీ కార్యదర్శి కుమ్మరి హరీష్, కోయవాగు పంచాయతీ కార్యదర్శి సుస్మిత, తదితరులు పాల్గొన్నారు.

## రెవెన్యూ సదస్సులతోనే భూ సమస్యల పరిష్కారం

జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) డేవిడ్



ప్రజాపక్షం/ పెంచికల్‌పేట్ : ప్రభుత్వం భూ సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులలో వచ్చి న దరఖాస్తులను పరిశీలించడం జరుగుతుందని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎం. డేవిడ్ అన్నారు. గురువారం జిల్లాలోని పైలెట్ మండలంగా ఎంపికైన పెంచికల్‌పేట్ మండలం కోటపెల్లి కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో కొనసాగుతున్న రెవెన్యూ సదస్సును సందర్శించి దరఖాస్తుల ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా అద నపు కలెక్టర్ మాట్లాడుతూ భూ సమస్యల పరిష్కారం కోసం ప్రతీ రెవెన్యూ గ్రామంలో రెవెన్యూ సదస్సులు నిర్వ హించడం జరుగుతుందని, ఈ సదస్సులలో భూ సమస్యలు ఉన్న రైతులు నిర్ణీత నమూనాలు దరఖాస్తులను సమ ర్పించాలని, ఈ దరఖాస్తుల వివరాలను నమోదు చేసుకుని తక్షణమే పరిష్కరించే దిశగా సంబంధిత అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కవిత , రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## అర్హులందరికి ఇందిరమ్మ ఇండ్లు


ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే



ప్రజాపక్షం/ఆసిఫాబాద్ : నిరుపేదలకు ప్రభుత్వం అందించే ఇందిరమ్మ ఇండ్ల పథకంలో అర్హత గల లబ్దిదారుల పేర్లు మాత్రమే ఉండాలని జిల్లా కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అన్నారు. గురువారం జిల్లాలోని ఆసిఫాబాద్ పట్ట ణంలో 5వ వార్డు పరిధిలో గల బజార్ వాడిలోని ఇందిరమ్మ ఇండ్ల జాబి తాలో పేరు గల దరఖాస్తు దారులు సాహెరా బేగం ఇం టిని సందర్శించి దరఖాస్తుదారు వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల పథకంలో అర్హత గల లబ్దిదారులకు సొంత ంటి స్థలం కలిగి ఉండాలని, నిబంధనల ప్రకారం 600 చదరపు అడుగుల లోపు ఇంటి నార్మణం చేపట్టాలని తెలిపారు. లబ్దిదారులు తమ ఇండ్లను తామే నిర్మించు కోవాలని, పనులు పూర్తయిన ప్రకారం నిధులు మంజూరు చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికా రులు, దరఖాస్తు దారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రేమ్‌సాగర్ కుటుంబానికి అండగా నిలుస్తాం

నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్



ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ : ఉపాధి కోసం దుబా య్‌కు వెళ్లిన నిర్మల్ జిల్లా సోన్ గ్రామానికి చెందిన ప్రేమ్ సాగర్ ఇటీవలి కాలంలో అక్కడ హత్యకు గురవడం తీవ్ర విషాదా నికి దారి తీసింది.ఈ నేపథ్యంలో బాధిత కుటుం బానికి అండగా నిలుస్తామని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ భరోసా ఇచ్చా రు. గురువారం సాయంత్రం కలెక్టర్ ఛాంబరులో ప్రేమ్ సాగర్ కుటుంబ సభ్యులు కలెక్టర్‌ను కలిసి తమ బాధను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ బాధితులను ఓదార్చి మనోధైర్యం చెప్పారు. ప్రభుత్వం తరపున అవసరమైనా సాయం అందించేందుకు చర్యలు తీసు కుంటామని అని కలెక్టర్ తెలిపారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో ప్రేమ్ సాగర్ భార్య ప్రమీల, పిల్లలు, తల్లి లక్ష్మి, ఇతర కుటుంబ సభ్యులతో పాటు రాష్ట్ర ఎన్‌ఆర్‌ఐ అడ్వైజరీ కమిటీ సభ్యులు స్వదేశ్ పరికిపండ్ల తదితరులు ఉన్నారు.

## గ్రామీణాభివృద్ధి సంస్థకు అవార్డు

ప్రజాపక్షం/నిర్మల్‌ప్రతినిధి: జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ (డిఆర్‌డిఎ) రాష్ట్ర స్థాయి అవార్డును కైవసం చేసుకు ంది. 2024–25 ఆర్థిక సంవత్సరంలో మహిళా సంఘాలకు లక్ష్యానికి మించి బ్యాంకు లింకేజీ రుణాలు మం జూరు చేయ డమేకాక, రుణాల రికవరీలోనూ రాష్ట్రంలో ప్రథమ స్థానాన్ని సాధించింది. ఈ కృషికి గాను హైదరాబాద్ లోని మహాత్మ జ్యోతిబా పూలే ప్రజాభవన్ లో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర గ్రామీణాభి వృద్ధి, మహిళా శిశు సంక్షేమ, పంచాయతీరాజ్ శాఖ మంత్రి డి.అనసూయ (సీతక్క), ప్రధాన కార్యదర్శి లోకేశ్ కుమార్, సెర్ప్ సిఇఒ దివ్యా దేవరాజన్ అవార్డును ప్రదానం చేశారు. అవార్డును జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధి కారి విజయ లక్ష్మి ,జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు గంగామణి, డిపిఎం జ్ఞా ను,ఎపిఎం సుదర్శన్‌లు స్వీకరించారు. జిల్లా కలెక్టర్ గ్రా మీణాభివృద్ధిసంస్థ అధికారులకు, సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు.

# వ్యవసాయ పద్ధతులపై అవగాహన

### వ్యవసాయంలో రైతులు అధునీకరణ పద్ధతులు అవలంబించాలి
### ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్



ప్రజాపక్షం/ముధోల్ : వ్యవసాయంలో ఆధునీక రణ పద్ధతులను అవలంబించి రైతులు అధిక దిగుబడి పొందాలని శాసనసభ్యులు పవార్ రా మారావు పటేల్ అన్నారు. గురువారం మండలం లోని వెంకటాపూర్ గ్రామంలో ప్రొఫెసర్ జయ శంకర్ తెలంగాణ విశ్వవిద్యాలయం,ముధోల్ వ్యవసాయ శాఖ సంయుక్తంగా నిర్వహించిన రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు అనే అవగాహన కా ర్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులకు వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించడం ఒక మంచి కార్యక్రమన్నారు.అధునాతన వ్యవసా యంపై అవగాహన కల్పించి రైతులను చైతన్య వంతులుగా చేయడం ద్వారా రైతులు పంటలో మంచి దిగుబడి సాధిస్తార న్నారు.శాస్త్రవేత్తల సల హాలు,సూచనల మేరకు రసాయనిక ఎరువుల ను,పురుగుల మందులను తగ్గించి పంట పండిం చడం రైతులకు ఎంతో లాభదాయకమని చెప్పా రు. అవసరం మేరకు మాత్రమే రసాయనాలు వినియోగించడం వల్ల భూసారం నష్టపోకుండా పంటలకు అనుకూలంగా ఉంటుందని చెప్పారు. సాగు నీటిని ఆదాచేసి భవిష్యత్ తరాలకు అందిం చడం మన అందరి బాధ్యత అని చెప్పారు.పంట మార్పిడిని పాటించి సుస్థిర ఆదాయాన్ని పొందా లని సూచించారు. చెట్లను పెంచి పర్యావరణాన్ని కాపాడే బాధ్యత ప్రతి ఒక్కరూ నిర్వర్తించాలని కోరారు. ఏడిఏ అంజి ప్రసాద్,ముధోల్ వ్యవ సాయ పరిశోధన కేంద్ర శాస్త్రవేతలు నర్సయ్య, విజ య్ కుమార్, కార్తీక్,భైంసా మార్కెట్ కమిటీ చైర్మ న్ షిందే ఆనంద్ రావు పటేల్,డైరెక్టర్ రాంనాథ్, పిఏసిఎస్ డైరెక్టర్ సుదర్శన్,మాజీ జడ్పీటీసీ నర్సగౌడ్,మాజీ పిఏసిఎస్ చైర్మన్ సురేందర్‌రెడ్డి, మండల సీని యర్ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థ లు, రైతులు తదితరులు ఉన్నారు.

### కల్యాణలక్ష్మి -షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ



ప్రజాపక్షం/లోకేశ్వరం : మండల కేంద్రంలోని రైతు వేదిక నందు 37 మంది అర్హులైన లబ్ధిదారు లకు కల్యాణ లక్ష్మి ,షాదీ ముబారక్ చెక్కులను ముధోల్ శాసనసభ్యులు పవర్ రామారావు పటే ల్ పంపిణీ చేశారు. ఈ సంద ర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సామాజిక న్యాయం సాధనలో భాగంగాప్రతి అర్హులైన కుటుంబానికి అండగా నిలి చేందుకు కళ్యాణలక్ష్మి ,షాదీ ముబారక్ చెక్కులు అందిస్తుందని ఈ సందర్భంగా తెలి పారు. రేంవత్ సర్కార్ ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్క హామీలు కూడా సరిగ్గా నెరవేర్చడం లేదని ప్రజ లకు ఇచ్చిన హామీలు నెరవేరేవరకు ప్రజల పక్షాన పోరాడుతామని ఎమ్మెల్యే తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల తహసిల్దార్ మోతిరాం ఎంపీడీవో రమేష్,మండలం బిజెపి అధ్యక్షుడు సాయన్న,మెండే శ్రీధర్ దడిగే భోజన్న లింగన్న చిన్నారావు శంకర్ గౌడ్,మండల సీనియర్ నాయకులు, ప్రజాప్రతినిధులు, సంబధిత అధి కారులు,లబ్ధిదారులు,తదితరులు పాల్గొన్నారు.

# సమ్మె నోటీసు అందజేత



ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ : కార్మిక సంఘాలు(టియుసిఐ) ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో గల సోఫీ నగర్ బీడి ప్యాక్ట రీలో బీడీ యాజమాన్యాలకు 20న దేశవ్యాప్తంగా జరిగే సార్వత్రిక సమ్మె నోటీసును అందజేసినట్లు కార్మికులు తెలిపారు. ఈ సందర్భంగా (టియుసిఐ) రాష్ట్ర క్యాదర్శి కే.రాజన్న మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా,కనీస వేతనాలు అమలు కోసం,కనీస పెన్షన్ 9వేల అమలు కోసం,కార్మిక వ్యతిరేక నాలు గు లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా,పనిగంటల పెంపుదలకు వ్యతిరేకంగా జాతీయ కార్మిక సంఘాలు ఈనెల 20న దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెకు పిలుపునిచ్చాయన్నారు.ఈ సమ్మెలో బీడీ కార్మి కులు,బీడీ ప్యాకర్స్,నెలసరి ఉద్యోగులు, మున్సిపల్ కార్మికులు, డ్రైవర్లు,సిబ్బంది పాల్గొంటురన్నారు. మున్సిపల్ గ్రామపంచాయతీ అంగ న్వాడీ ఆశ వర్కర్స్, కార్మికులకు కనీస వేతనాలు రూ.26,000 ఇవ్వా లని, ఉద్యోగ,ఆరోగ్య భద్రత కల్పించాలని, కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ కార్మి కులందరిని పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘం నాయకులు, కిషన్,పోశెట్టి, రాజేందర్, లక్ష్మ ణ్,రవి, ఎల్లయ్య, గంగామణి, కమల, గంగాధర్, లక్ష్మి ,తదితరులు పాల్గొన్నారు.

# మహిళల రక్షణకు సఖి కేంద్రాలు

### మండల అభివృద్ధి శాఖ అధికారి రాజేశ్వర్




ప్రజాపక్షం/మందమర్రి: మహిళల రక్ష ణలో సఖి కేంద్రాలు ముఖ్య భూమిక పోసిస్తున్నాయని మందమర్రి మండల అభివృద్ధి శాఖ అధికారి ఎన్. రాజేశ్వర్ అన్నారు. గురువారం మహిళా హెల్ప్ లైన్ 181 సఖి సెంటర్లపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఎంపిడిఓ మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో స్త్రీలు బాలికలు ఎదుర్కొం టున్న వివిధ రకాల వేధింపులు గృహహింసల నుండి రక్షణ కల్పించడానికి వారికి అవస రమైన సహాయ సహకారాలు అందించడానికి సఖి సెంటర్ కృషి చేస్తుందని తెలిపారు. గృహహింస పనిచేసే చోట లైంగిక వేధింపులు స్త్రీల పిల్లల అక్రమ రవాణా విద్యాసంస్థల్లో లైంగిక వేధింపులు అత్యాచారాలు యాసిడ్ దాడులు వంటి హింసల నుండి రక్షణ కల్పించ డానికి వారికి అవసరమైన సహాయ సహకారాలు ఒకే చోట నుండి అందించడం కోసమే సఖి సెంటర్‌ను ఏర్పా టుచేశారని ఆయన వివరించారు. హఠాత్తుగా కట్టుబట్ట లతో ఇళ్ల నుండి బయటకు వచ్చిన బాధిత స్త్రీల కోసం ఐదు రోజుల వరకు తాత్కాలిక వసతి వారికి అవసర మైన వైద్య సేవలు వారి తరపున కేసులు నమోదు నష్టప రిహారం ఎఫ్ఐఆర్ చేయించడం లాంటి సదుపాయా లను బాధిత స్త్రీలకు అందించి వారు ఎదుర్కొంటు న్న హింస నుండి రక్షణ కల్పించడమే సఖి సెంటర్ ప్రధా న లక్ష్యం ఉద్దేశమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్ర మంలో ఎంపిఓ, ఇజిఎస్, పంచాయతీ కార్యదర్శులు, సఖి కేంద్రం అడ్మినిస్ట్రేటర్ అజ్మీరా శ్రీలత కేస్ వర్కర్ లావణ్య సైకో సోషల్ కౌన్సిలర్ ఎం. జ్యోతి పాల్గొన్నారు.

### కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ
# సార్వత్రిక సమ్మె పోస్టర్ విడుదల



ప్రజాపక్షం/నిర్మల్‌టౌన్: కేంద్రకార్మిక సంఘాల దేశవ్యాప్త సర్వత్రిక సమ్మె పిలుపు మేరకు ఈనెల 20న జరిగే సమ్మెను విజయ వంతం చేయాలని సిపిఐ కార్యాలయంలో జరిగిన సమావేశం అనంతరం సమ్మెకు పో స్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా కల వేన శంకర్ మాట్లాడుతూ కేంద్రంలో కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక,రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ దేశవ్యాప్తంగా సంఘటిత,అసంఘటిత రంగ కార్మికులు సమ్మెతో ప్రభుత్వానికి ఓహెచ్చరిక పంపాలన్నారు. కేంద్ర ప్రభుత్వం పూర్తిగా కార్పొరేట్, పెట్టుబడిదారీ వర్గాలకు అనుకూ లమైన చట్టాలను తెచ్చి పూర్తిగా కార్మి కులను బానిసలుగా చేయాలనే ప్రరయత్నం చేస్తొ ందని ఆరోపించారు. కార్మికులు ఎన్నో పోరాటాలు, ఉద్య మాలు త్యాగాలతో సాధించుకున్న 29 చట్టాలను నాలు గు కోడ్లుగా మలచి కార్మిక హక్కులను కాలరాసే ప్రర యత్నం చేస్తూ మరోపక్క రైతులను పాలేరులుగా మలిచే ప్రయత్నం చేస్తోందన్నారు. పెట్రోల్, డీజిల్, నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెంచి సా మాన్య ప్రజల బతుకులను భారంగా మలుస్తోంద న్నా రు. ఈ సమ్మెతోనైనా కేంద్రప్రభుత్వం దిగిరావాలని అన్నారు.ఈ కార్యక్రమంలో ఎఐటియుసి రాష్ట్ర కార్య దర్శి ఎస్.విలాస్, ఎఐటియుసిజిల్లా కార్యదర్శి శ్రీనివాస్ చారి, సిపిఐ జిల్లాసహాయ కార్యదర్శి భూక్యా రమే ష్, దళిత సంఘం నాయకులు ఆనందరావు,సిపిఐ నాయ కులు,ఆయా కార్మిక సంఘం నాయకులు పాల్గొన్నారు.

## దూద్‌గాం, సోన్‌పేట్‌లలో భూభారతి రెవెన్యూ సదస్సులు



ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి: భూభారతి పైలట్ ప్రాజె క్టు రెవెన్యూ సదస్సులలో భాగంగా గురువారం మెండోరా మండలం దూద్‌గాం, సోన్‌పేట్ గ్రామాల్లో నిర్వహించిన సద స్సుల లో కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు పాల్గొన్నారు. సద స్సుకు హాజరైన రైతులతో భేటీ అయి వారు ఎదుర్కొంటున్న భూ సంబంధిత సమస్యలపై అడిగి తెలుసు కున్నారు. రైతు గుర్తింపు కార్డుల రిజిస్ట్రేషన్ ప్రక్రియ, హెల్ప్ డెస్క్, దరఖాస్తుల స్వీకరణ కౌంటర్ వద్ద సదుపా యాలు, సిబ్బంది పనితీరును కలెక్టర్ పరిశీలన జరిపి, అధికారులకు సూచనలు చేశారు. ఒకే దరఖాస్తులో రైతులు రెండు, మూడు రకాల భూ సమస్య లను పేర్కొనే సమయంలో వాటిని క్షుణ్ణంగా పరిశీ లిస్తూ ఆన్ లైన్‌లో జాగ్రత్తగా ఎం ట్రీ చేయాలన్నారు. వివరాల నమో దులో తప్పిదాలకు ఆస్కారం కల్పించకూడ దని ఏవైనా సందే హాలుంటే సంబంధిత అధికారులను సంప్రదించి నివృత్తి చేసు కోవాలని డేటా ఎంట్రీ ఆపరేటర్లకు హితవు పలికారు. దరఖా స్తుల పరిశీలన ఆన్‌లైన్ నమోదు ప్రక్రియలపై పరిపూర్ణమైన అవగాహన ఏర్పర్చు కోవాలన్నారు. భూ రికార్డులలోని వివరా లను పక్కాగా సేకరిస్తూ ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించా లని సూచించారు. ఈచట్టంలో పొందుపర్చిన మార్గదర్శకాల ప్రకారం పరిష్కరించేలా రెవెన్యూ బృందాలకు మార్గనిర్ధేశం చేశామన్నారు. పైలట్ ప్రాజెక్టు కింద మెండోరా మండలంలో రెవెన్యూ సదస్సులలో వచ్చిన దరఖాస్తులను పరిష్కరించిన మీదట, జిల్లాలోని మిగతా మండలాల్లో రెవెన్యూ గ్రా మాల వారీగా సదస్సులు నిర్వహిస్తామన్నారు. రైతులు రెవె న్యూ సద స్సులను సద్వినియోగం చేసుకుని భూ సమస్యలను పరిష్కరిం చుకోవాలని సూచించారు. ఈ సదస్సులలో ఆర్డీఓ రాజాగౌడ్, తహసీల్దార్ సంతోష్‌రెడ్డి, రెవెన్యూ అధికారులు పాల్గొప్నారు.

## చదువుతోనే గ్రామీణ కుటుంబాల్లో వెలుగు

జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



ప్రజాపక్షం/కాసిపేట: చదువుతోనే గ్రామీణ ప్రాం త కుటుంబాల్లో వెలుగు ఉంటుందని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం కాసిపేట మండలం వెంకటాపూర్ గ్రా మంలో జిల్లా వయోజన విద్యాశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అక్షరాస్యత కేంద్రాలను జిల్లా వయోజన విద్యాశాఖ అధికారి పురుషోత్తం నా యక్, మం డల తహసిల్దార్ భోజన్నలతో కలిసి పరిశీలించా రు.కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా వయోజన విద్యా శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాత్రి తరగతుల ద్వారా నిరక్షరాస్యులైన వయోజనుల ను అక్షరా స్యులుగా తీర్చిదిద్దడం జరుగుతుందని తె లిపారు. కాసిపేట మండలంలో ముందుగా ప్రారంభిం చడం ద్వారా ఈ కార్యక్రమం మరిన్ని ప్రాంతాల్లో చేసేందుకు ఆదర్శంగా నిలుస్తుందన్నారు. మండ లంలోని గ్రామ పంచాయతీలకు 2 కుట్టు మిషన్ల చొప్పున అందించనున్నట్లు తెలిపారు. దాదాపు జిల్లాలోని 50 పాఠశాలల్లో వేసవి శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేయడం జరిగిందని, రాత్రి తరగతుల్లో వలంటీర్లు, పంచాయతీ సెక్రటరీలు అందరూ మంచిగా పని చేశారని అభినందించారు. ఈ కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి సఫ్దర్ అలీ, పంచాయతీ కార్యద ర్శులు, డిఆర్‌పి లు కొండు జనార్ధన్, సుమన్, బం డ శాంకారి, అ శోక్ రావు, సంబంధిత అధికా రులు, అక్ష రా స్య త కేంద్రాల మహిళా నిర్వాహకులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు విద్యాఫలాలు అందాలి

జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్. యాదయ్య




ప్రజాపక్షం/మంచిర్యాల : పాఠశాల విద్యాశాఖ కార్యక్రమాలను ప్రతి విద్యార్థి పూర్తిస్థాయిలో వినియోగించుకునేలా చూడాలని, రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు నాణ్యమైన, గుణాత్మక విద్యను అందించడానికి పూర్తిస్థాయి మౌలిక సదుపాయాలు కల్పిస్తూ అనేక కార్యక్రమాలను అమలు చేస్తోందని జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్. యాదయ్య అన్నారు. గురువారం మంచిర్యాల జిల్లాలోని మండల విద్యాధికారులు, స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులకు జిల్లా సైన్స్ కేంద్రం మంచిర్యాలలో నిర్వహించిన ఒకరోజు శిక్షణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ, ప్రతి విద్యార్థికి గుణాత్మక విద్య, నాణ్యమైన విద్య, డిజిటల్ విద్యను అందించడానికి ప్రభుత్వం నిర్వహిస్తున్న పలు కార్యక్రమాల పట్ల పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. విద్యార్థులు ఎలాంటి భయం, ఒత్తిడి లేకుండా విద్య నేర్చుకునే అవకాశం కల్పించడానికి మండల స్థాయిలో, స్కూల్ కాంపౌండ్ స్థాయిలో అధికారులు సమన్వయంతో పనిచేస్తూ ప్రణాళికాబద్ధంగా విధులు నిర్వర్తించాలని ఆదేశించారు. రాబోయే విద్యా సంవత్సరంలో అమలు చేయాల్సిన వివిధ వినూత్న కార్యక్రమాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష కోఆర్డినేటర్లు చౌదరి, యశోదర, శ్రీనివాస్, సత్యనారాయణమూర్తి, డిసిఇబి సెక్రెటరీ మహేశ్వర్ రెడ్డి, ఎఎస్‌సి రాజ్ కుమార్ పాల్గొన్నారు.

# లైసెన్స్ ల్యాండ్ సర్వేయర్ల శిక్షణకు దరఖాస్తులు



ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి : లైసెన్స్ సర్వేయర్ల శిక్షణ కోసం ఆసక్తి అర్హత కలిగిన అ భ్యర్థులు మీ సేవ కేంద్రాలలో ఈనెల 17లోగా ఆన్‌లైన్ ద్వా రా దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు సూచించారు. రాష్ట్ర ప్ర భుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశ పెట్టిన భూభారతి చట్టం అమలులో భాగంగా భూమి సర్వే అంటే భూమి రిజిస్ట్రేషన్ కోసం వెళ్లే ప్రతి దరఖాస్తు దా రుడు సిఎస్ఎస్ఎల్ఆర్ ద్వారా తెలియజేసిన తేది నుండి సర్వే సబ్‌డివిజన్ మ్యాప్‌ను కూడా సమ ర్పించాల్సి ఉంటుందన్నారు. 2025–26 ఆర్థిక సంవత్సరానికి గాను రాష్ట్రవ్యాప్తంగా ఐదువేల మంది లైసెన్స్ సర్వేయర్లను అర్హత ప్రాతిపదికన ఎంపిక చేసి వారికి శిక్షణనివ్వాలని ప్రభుత్వం నిర్ణ యించదన్నారు.26 నుండి జూలై 26 వరకు రెం డు నెలల పాటు శిక్షణ ఉంటుందని, శిక్షణ ము గింపులో పరీక్ష ఉంటుం దని,ఈ పరీక్షలు థియరీ, ప్లాటింగ్ అండ్ ప్రాక్టికల్ అనే మూడు భాగాలుం టాయన్నారు. పరీక్షలోని ప్రతి విభాగంలో 60 శాతం ఉత్తీర్ణత సాధించాలని మొత్తం 3 పేపర్లలో ఉత్తీర్ణత సగటున 70 శాతానికి తక్కువ కాకుండా ఉండాలని తెలిపారు. శిక్షణ పొంది పరీక్షలలో ఉత్తీర్ణత సాధించిన ప్రభుత్వ సర్వేయర్ కింద 40 పని దినాల పాటు శిక్షలో భా గంగా అప్రెంటిస్ షిప్ చేయాల్సి ఉంటుందన్నారు. అప్రెంటిస్‌షిప్ శిక్షణ పూర్తయిన తర్వాత లైసెన్స్ పొందటానికి డిపార్ట్‌మెంట్ నిర్వహించే అసెస్‌మెంట్ టెస్ట్‌లో అభ్యర్థులు ఉత్తీర్ణులు కావలన్నారు. టెస్ట్ ఉత్తీర్ణత సాధించిన తర్వాత అభ్యర్థికి లైసెన్స్ ఇవ్వబడు తుందని కలెక్టర్ తెలిపారు. మొదటగా మూడు సంవత్సరాల కాలనికి లైసెన్స్ జారీ కోసం అభ్య ర్థులు నిర్ణీత రుసుము చెల్లించి సిఎస్ఎస్ఎల్ఆర్ కార్యాలయానికి దరఖాస్తు సమర్పించాల్సి ఉం టు ందన్నారు. ఎంపికైన వారు నెలకు 30 లకు పైగా ఆదాయంతో కూడిన ఉపాధి పొందవచ్చన్నారు. శిక్షణ కోసం ఒసి అభ్యర్థులు రూ.10 వేలు, బిసి లు రూ. 5వేలు, ఎస్సీ, ఎస్టీలు రూ. 2500 రుసుం చెల్లించాలన్నారు. శిక్షణ నిమిత్తం నమోదు కోసం మీసేవా కేంద్రం నుండి డౌన్‌లోడ్ చేసుకున్న దర ఖాస్తు ఫారం కాపీ, టెన్త్ ఇంటర్మీడియట్ కాపీలు, ఐటిఐ (సివిల్స్) డిప్లొమా బిటెక్ (సివిల్) వంటి మార్కుల మెమోతో పాటు నిర్ధేశిం చిన విధంగా సాంకేతిక అర్హత సర్టిఫికెట్లు సమర్పిం చాల్సి ఉం టుందన్నారు. చిరునామా రుజువుగా ఆధార్ కార్డు కాపీ, బిసి, ఎస్‌సి, ఎస్‌టి అభ్యర్థులు తహ సీల్దార్ జారీ చేసిన కుల ధృవీకరణ పత్రం సమర్పిం చా లన్నారు. లైసెన్స్ సర్వేయర్ కో సం ఆసక్తి అర్హత గల అభ్యర్థులు 17 లోగా మీ సేవ కేంద్రాల ద్వా రా దరఖాస్తుల చేసుకోవాలని సూచించారు.

## ఆపరేషన్ సిందూర్ ద్వారా ఉగ్రవాదాన్ని అంతమొందించాలి



ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి :ఆపరేషన్ సింధూర్ ద్వారా ఉగ్రవాదాన్ని అం తమొందించా లని సిపిఐ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్ అన్నారు. గురువారం సిపిఐ జిల్లా కార్యాలయంలో విలేక రుల సమావేశం సుధాకర్ మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం కాశ్మీర్‌లోని పహాల్గంలో 26 మంది పౌరులపై ఉగ్రవాదుల స్థావరాలపై భారత్ సిందూ ర్‌ను ప్రారంభించిందని ఇట్టి సంఘ టనపై భారత సైనికులకు సంఘీభావంగా ఐక్యంగా నిలబడుదా మని ఉగ్రవా దం నిర్మూలన కోసం భారత సైన్యం చేపట్టిన ఈ దైర్యవంతమైన చర్య దేశ భద్రతకు నిదర్శనమని సహనానికి మారుపేరైన భారత్‌లో ఉగ్రవాదాన్ని శాశ్వతంగా నిర్మూలించాల్సిందేనని దీనికి కేంద్ర ప్రభుత్వం ఖచ్చితమైన కార్యాచర ణతో ముందుకు సాగాలని కోరారు. సమావేశంలో నగర కార్యదర్శి ఓమయ్య, నాయకులు సురేష్, భాను, సత్యం, తదితరులు పాల్గొన్నారు.



# స్థానికం REGIONAL NEWS
కరీంనగర్, మెదక్ ఆదిలాబాద్, నిజామాబాద్

## ఎస్‌హెచ్‌డి బ్యాంకు లింకేజీలో జిల్లాకు ప్రథమ స్థానం



**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి:** 2024–25 ఆర్థిక సంవత్సరానికి గాను ఎస్‌హెచ్‌జి బ్యాంకు లింకేజీలో కరీంనగర్ జిల్లా రాష్ట్రంలోనే ప్రథమస్థానంలో నిలిచింది. అందుకు గాను జరిగిన రాష్ట్రస్థాయి కార్యక్రమంలో పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ పమేలా సత్పతి జిల్లా డిఆర్‌డీఏ టీంను అభినందించారు. గత సంవత్సం 771 కోట్ల లక్ష్యానికి గాను 787 కోట్ల రునాలు ఎస్‌హెచ్‌జి గ్రూపులకు ఇప్పించి కరీంనగర్ జిల్లా 102 శాతం ప్రగతి సాధించింది. 2025 26లోనూ ఇదే విధంగా లక్ష్యాలను సాధించాలని సూచించారు.

## క్రీడా మైదానం కోసం ప్రభుత్వ భూమిని పరిశీలించిన ప్రభుత్వ విప్



**ప్రజాపక్షం/గొల్లపల్లి :** జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండల కేంద్రంలోని 735 సర్వేనెంబర్ లో గల ప్రభుత్వ భూమిని కొంత క్రీడా మైదానానికి (మినీ స్టేడియం )కొరకు కేటాయించాలని ప్రభుత్వ విప్ ,ఎమ్మెల్యే లక్ష్మ ణ్ కుమార్ ను మండలానికి చెందిన క్రీడాకారులు కోరగా గురువారం ఆర్డీవో మధుసూదన్ ,తహసిల్దార్ వరందన్ ,మండల సర్వేయర్ లతో వచ్చి 735 సర్వేనెంబర్ లో గల ప్రభుత్వ భూమిని పరిశీలించి భూమి యొక్క హద్దులు పెట్టి క్రీడా మైదానానికి కేటాయించాలని రెవిన్యూ అధికారులను ప్రభుత్వ విప్ లక్ష్మ ణ్ కుమార్ ఆదేశించారు .ఈ కార్యక్రమంలో ఆర్డీవో మధుసూదన్ ,తహసిల్దార్ వరందన్ ,ఆర్ ఐ అనూష , మార్కెట్ కమిటీ చైర్మన్ భీమ సంతోష్ ,వైస్ చైర్మన్ ,పురపాటి రాజిరెడ్డి ,మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ముస్కు నిశాంత్ రెడ్డి ,రేవెల్ల సత్యనారాయణ గౌడ్,చిర్ర గంగాధర్,రేవెల్ల లింగయ్య,బుచ్చిరెడ్డి,అరవింద్ గౌడ్,అనిల్,వినోద్,రంగు శ్రీనివాస్ గౌడ్ ,కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు,క్రీడాకారులు యువకులు,తదితరులు పాల్గొన్నారు.

## సైలెన్సర్లు మారిస్తే కఠిన చర్యలు



**ప్రజాపక్షం/జగిత్యాల ప్రతినిధి :** శబ్ద కాలుష్యాన్ని నిరోధించేందుకు చేపట్టిన ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా, అధిక శబ్దం కలిగించే మాడిఫైడ్ సైలెన్సర్లను వినియోగిస్తున్న ద్విచక్ర వాహనాలపై జిల్లా పోలీసులు కఠిన చర్యలు తీసుకుంటమాని జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ అన్నారు.గత కొన్ని రోజులుగా స్పెషల్ డ్రైవ్ లు నిర్వహిస్తూ ద్విచక వాహనదారులు అధిక శబ్దం కలిగించే సైలెన్సర్ మాడిఫై చేసి అధిక శబ్దాలతో సౌండ్‌పొల్యూషన్ చేస్తూ, సామాన్య ప్రజానికానికి ఇబ్బందులకు గురి చేస్తున్న 130 వాహనాల సైలెన్సర్స్ లను జిల్లా ఎస్పి అశోక్ కుమార్ ఆధ్వర్యంలో రోడ్డు రోలర్ తో గురువారం ధ్వంసం చేశారు. ఈ సందర్బంగా ఎస్పి అశోక్ కుమార్ మాట్లాడుతూ.. నిబంధనలకు విరుద్ధంగా ద్విచక్ర వాహనాల సైలెన్సర్లను మార్పు చేయడం చట్టరిత్యా నేరమని,శబ్ద కాలుష్య నియంత్రణతో పాటు ప్రజాఆరోగ్యాన్ని దృష్టిలో వుంచుకోని అధికంగా శబ్దం చేసే ద్విచక్రవాహనలపై ప్రత్యేక దృష్టి సారించి జిల్లా వ్యాప్తంగా తనీఖీలు చేపట్టడం జరిగిందన్నారు. మాడిఫైడ్ సైలెన్సర్లను వాడితే ఆ వాహనాలపై క్రిమినల్ కేసులు నమోదు చేసి, వాహనాన్ని సీజ్ చేస్తాం. డ్రైవింగ్ లైసెన్సును కూడా రద్దు చేయొచ్చు. ప్రజల ఆరోగ్యం, శాంతి భద్రతల పరిరక్షణ కోసం జిల్లా పోలీస్ శాఖ స్పెషల్ డ్రైవ్‌ను కొనసాగిస్తూనే ఉంటుంది. ఎవరైనా మాడిఫైడ్ సైలెన్సర్లు వినియోగిస్తున్న వాహనాలను గమనిస్తే సమీప పోలీసు అధికారులకు సమాచారం ఇవ్వాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ రఘు చందర్ ,టౌన్ ఇన్స్పెక్టర్ వేణు గోపాల్, ఐటీ కోర్ ఇన్స్పెక్టర్ రఫీక్ ఖాన్ ,ట్రాఫిక్ ఎస్.ఐ మల్లేష్ , సిబ్బంది పాల్గొన్నారు.

## అటవీ కార్యాలయం ముందు నిరసన

పెట్రోల్ పోసుకొని చస్తానంటూ ఆవేదన



**ప్రజాపక్షం/వేములవాడ టౌన్:** వేములవాడ అటవీ కార్యాలయం ముందు న్యాయం చేయాలంటూ లేదంటే, పెట్రోల్ పట్టుకొని నిరసన వ్యక్తం చేసిన సంఘటన గురువారం కలకలం సృష్టించింది. వివరాలకు వెళితే.. కోనరావుపేట మండలం వట్టిమల్ల గ్రామానికి చెందిన లకావత్ ప్రశాంత్, ఇషావత్ తిరుపతి గత కొంత కలం క్రితం గ్రామంలోని అటవీ భూమిలో చేదును చేస్తూ ఉండగా ఫారెస్ట్ ఆఫీసర్లు తనకు చెందిన ట్రాక్టర్ ను తీసుకువెళ్లారని వాపోయారు. అయితే ఆదే క్రమంలో వట్టిమల్ల గ్రామానికి చెందిన భూక్యా రాజు ఆనునాతని ట్రాక్టర్ ను కూడా ఫారెస్ట్ ఆఫీసర్స్ పట్టుకున్నారని తెలిపారు. అయితే బుక్యరాజు అనే వ్యక్తి నేను చెయ్యటం వల్లనే తన ట్రాక్టర్ పట్టుకున్నారని నాకు ఫారెస్ట్ ఆఫీసర్స్ నీ పేరు చెప్పారు అంటూ బెదిరిస్తున్నారని వాపోయాడు. దీనిపై తగు న్యాయం చెయ్యాలని లేదా పెట్రోల్ పోసుకొని చస్తానని ఫారెస్ట్ ఆఫీస్ ముందు బాధిత కుటుంబం నిరసన వ్యక్తం చేయడంతో కలకలం రేపింది.

## పశువులకు ఉచిత గాలికుంటు వ్యాధి టీకాలు



**ప్రజాపక్షం/గొల్లపల్లి :** రైతులు విధిగా తమ పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలను వేయించాలని పశువైద్యాధికారి తెలిపారు. జగిత్యాల జిల్లాలోని గొల్లపల్లి మండలంలోని మల్లన్న పేట, శంకరరావు పేట గ్రామాల్లో పశు వైద్యాధికారి డా: రవీందర్ ఆధ్వర్యంలో గురువారం గాలి కుంటు వ్యాధి టీకాల కార్యక్రమంలో నిర్వహించారు.ఈ కార్యక్రమని పశు సంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ బోనగిరి నరేష్ ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మల్లన్న పేట ,శంకరరావు పేట గ్రామాల్లో 350 పశువులకు ఉచిత గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయడం జరిగిందాని ఆయన తెలిపారు.ఇప్పటి వరకు మండలంలోని 20 గ్రామాలలో టీకాల కార్యక్రమం పూర్తి చేయడం జరిగిందని,ఇంకా మిగిలిన గ్రామాలలో చేయాల్సి ఉందని ఆయన తెలిపారు.వ్యాధి ప్రమాదకరమైనదని పశువులకు ఒకదాని నుండి ఒకదానికి సంక్రమిస్తుందని అన్నారు.ప్రభుత్వం పశువైద్య శాఖ ద్వారా ఉచితంగా గాలికుంటు వ్యాధి టీకాలు వేయించడం జరుగుతుందని ఈ అవకాశాన్ని రైతాంగం సద్వినియోగం చేసుకుని గాలికుంటు వ్యాధి టీకాలు వేయించి తమ పశువులను వ్యాధి బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో పశువైద్యధికారి డాక్టర్ రవీందర్ లివస్టాక్ అసిస్టెంట్ రాజశ్రీ ,స్టాఫ్ నర్సయ్య ,రవీందర్, శ్రీకాంత్ నిశాంత్, రమేష్,తదితరులు పాల్గొన్నారు.

# రాజకీయాలకు అతీతంగా సంపూర్ణ మద్దతు



మంత్రి పొన్నం ప్రభాకర్



**ప్రజాపక్షం/కరీంనగర్/చిగురుమామిడి:** దేశ సరిహద్దుల్లో దాయాది దేశం కవ్వింపు చర్యలను గట్టిగా తిప్పి కొడుతున్న భారత సైన్యం, ప్రధాని మోడీకి రాజకీయాల కతీతంగా అభినందనలు తెలుపుతూ మద్దతు పలుకుతున్నట్లు రాష్ట్ర రవాణా సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలంలోని సుందరగిరి శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామి వారిని గురువారం తన జన్మదినం సందర్బంగా దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సంధర్బంగా ఆలయ నిర్వహణాధికారి రాజ్ కుమార్, అర్చకులు నవీనాచార్యులు మంత్రికి పూర్ణకుంభ స్వాగతం పలికారు. మంగళ వాయిద్యాల నడుమ పొన్నం స్వామి వారికి పట్టువస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అభిమానుల అభినందనలు, సన్మానాల నడుమ పొన్నం కేక్ కట్ చేసి స్థానిక నేతలకు తినిపించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశ సరిహద్దుల్లో దాయాది దేశానికి తగిన గుణపాఠం చెబుతున్న ప్రధాని మోడీకి అభినందనలు తెలిపారు. దేశ ఆంతర్గత సరిహద్దు భద్రత విషయంలో పార్టీలకతీతంగా తన సంపూర్ణ మద్దతు ఉంటుందన్నారు.

కార్యక్రమంలో ఆలయ ఈవో కె.రాజ్ కుమార్, అర్చకులు శేషం నరసింహచార్యాలు, నవీన్ కుమార్ ఆచార్యులు, అడిషనల్ కలెక్టర్ లక్ష్మి కిరణ్, ఆర్డీవో మహేశ్వర్, రికార్డు అసిస్టెంట్ గూట్ల కవిత, రాష్ట్ర మాజీ హౌస్‌ఫెడ్ చైర్మన్ బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి, హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి, డిసిసి ప్రధాన కార్యదర్శి చిట్టిమల్ల రవీందర్, మాజీ జడ్పిటిసి గీకురు రవీందర్, సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, ఆలయ కమిటీ మాజీ చైర్మన్ తాళ్లపల్లి రాజయ్య గౌడ్, చిత్తారి రవీందర్, బస్వరాజుల శంకర్, ఎనగందుల లక్ష్మ ణ్, వడియాల సుధాకర్ రెడ్డి, వంగర మల్లేశం, జీల సంపత్, తాళ్లపెల్లి సంపత్, కాంగ్రెస్ కార్యకర్తలు, అభిమానులు, తదితరులున్నారు.

## సర్వేయర్ల శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

17లోగా సమర్పించాలి

కలెక్టర్ పమేలా సత్పతి



**ప్రజాపక్షం/కరీంనగర్‌ప్రతి–నిధి:** భూమికి సంబంధించిన సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం తీసుకువచ్చిన ప్రతిష్టాత్మకమైన భూభారతి రెవెన్యూ చట్టంలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా 5 వేల మంది లైసెన్స్ సర్వేయర్లకు శిక్షణ ఇవ్వనున్నట్లు కలెక్టర్ పమేలా సత్పతి తెలిపారు. రెవెన్యూ అడ్మినిస్ట్రేషన్, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ డిపార్ట్‌మెంట్ ఆద్వర్యంలో రాష్ట్రంలో దాదాపు 5వేల మంది లైసెన్స్ పొందిన సర్వేయర్లకు ఈ శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. శిక్షణ అనంతరం ఈ లైసెన్స్‌డ్ సర్వేయర్లను జిల్లాలో నియమిస్తారని తెలిపారు. సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ డిపార్ట్‌మెంట్ ఇప్పటికే నోటిఫికేషన్ ప్రచురించిందని తెలిపారు. ఈ నెల 5 నుంచి 17 వరకు రాష్ట్రవ్యాప్తంగా మీ సేవా కేంద్రాల ద్వారా ధరఖాస్తులను స్వీకరించనుందని పేర్కొన్నారు. ఈ నెల 26 నుంచి జులై 7 వరకు శిక్షణ ఉంటుందని తెలిపారు. జిల్లాలో సర్వే, ల్యాండ్ రికార్డ్స్ అధికారి సహాయంతో ప్రభుత్వం మార్గదర్శకాల ప్రకారం సర్వేయర్ల శిక్షణను అత్యంత జాగ్రత్తగా నిర్వహించనున్నామని పేర్కొన్నారు.

## టిజి పాలిసెట్ పై సమీక్ష

కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల ప్రతినిధి :** జిల్లాలో మే 13న సజావుగా టిజి పాలిసెట్ ప్రవేశపరీక్ష నిర్వహించాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. గురువారం జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సమికృత జిల్లా కలెక్టరేట్‌లో టిజి పాలిసెట్ ప్రవేశ పరీక్ష నిర్వహణపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సులలో ప్రవేశాల నిమిత్తం మే 13న ఉదయం 11 గంటల నుండి 1.30 వరకు జరిగే టిజి పాలిసెట్ ప్రవేశపరీక్ష సజావుగా నిర్వహించేందుకు అవసరమైన సకల ఏర్పాట్లను పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. సిరిసిల్ల జిల్లాలో మొత్తం 2136 మంది విద్యార్థులు టిజి పాలిసెట్ ప్రవేశ పరీక్ష రాస్తున్నారని, వీరి కోసం 7 పరీక్ష కేంద్రాలను సిద్ధం చేసినట్లు కలెక్టర్ తెలిపారు.

పరీక్ష కేంద్రాలలో సిసి టివి కెమెరా తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని అన్నారు. ప్రశ్నా పత్రాల తరలింపు అవసరమైన బందోబస్తు కల్పించాలని అన్నారు. పరీక్షా సమయంలో పరీక్ష కేంద్రాల వద్ద కరెంట్ కోతలుఉండ వద్దని అన్నారు. ఈ సమావేశంలో సిరిసిల్ల రెవెన్యూ డివిజన్ అధికారి వెంకటేశ్వర్లు, అదనపు ఎస్పీ చంద్రయ్య, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రభాకర్ చారి, జిల్లా వైద్యాధికారి డా. రజిత, సెస్, ఆర్‌టిసి, విద్యా, మున్సిపల్ శాఖల అధికారులు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రైవేటు హాస్పిటల్‌కు దీటుగా పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రి

వంద పడకల ఆసుపత్రి భవన నిర్మాణానికి శంకుస్థాపన

ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు



**ప్రజాపక్షం/పెద్దపల్లిప్రతినిధి:**పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో ప్రజలకు ఆధునిక వసతులతో కూడిన మెరుగైన వైద్య సదుపాయాలను ప్రైవేట్ హాస్పిటల్ కు దీటుగా అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు అన్నారు.గురువారం రోజున పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిని 50 పడకల నుండి 100 పడకలకు అప్‌గ్రేడ్ చేసేందుకు మంజూరు చేయించిన రూ.51 కోట్ల వ్యయంతో నిర్మించిన తలపెట్టిన ఆసుపత్రి నూతన భవన నిర్మాణానికి ఆరోగ్య శాఖ అధికారులతో, స్థానిక నాయకులతో కలిసి భూమి పూజ, శంకుస్థాపన చేసిన అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో వంద పడకల ఆసుపత్రి నిర్మాణమునకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అడగగానే 51 కోట్లు మంజూరు చేశారని , ఆసుపత్రిలో ఈ 15 నెలల్లో అన్ని సౌకర్యాలు కల్పించడం జరిగిందని, ఆస్పత్రికి వివిధ మండలాల నుంచి రోజు 800 మంది ఆ పైన వచ్చి పరీక్షలు చేసుకుంటున్నారని అన్నారు. ప్రవేట్ హాస్పటల్‌కు దీటుగా ప్రభుత్వ ఆసుపత్రి ఉండాలని ఉద్దేశంతో నిరుపేదలకు అన్ని రకాల వైద్యం అందించాలని ఉద్దేశంతో ఈ 15 నెలల కాలంలో అన్ని రకాల పరీక్షలు చేసే విధంగా పరికరాలను సమకూర్చడం జరిగిందని, దీంతో నెలలో 200 ప్రసవాలు జరుగుతున్నాయని అన్నారు.ప్రైవేట్ ఆస్పత్రులలో గుండె పరీక్షలు చేయించుకుంటే సుమారు 4,500 రూపాయల వరకు ఖర్చు అవుతుందని ప్రస్తుతం పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో గుండెకు సంబంధించిన పరీక్షలు కూడా ఉన్నాయి అన్నారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపర్డెంట్ డాక్టర్ శ్రీధర్ ,మార్కెట్ చైర్మన్ ఈర్ల స్వరూప, ఆరోగ్య శాఖ అధికారులు, కాంట్రాక్టర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## సమ్మర్ క్యాంప్‌లను సద్వినియోగం చేసుకోవాలి

జిల్లా విద్యాశాఖ అధికారి రాము

**ప్రజాపక్షం/ధర్మపురి:** ప్రభుత్వం ద్వారా ఏర్పాటు చేసిన సమ్మర్ క్యాంపులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని జగిత్యాల జిల్లా విద్యాశాఖ అధికారి కే. రాము అన్నారు. ధర్మపురి పట్టణంలోని జెడ్పి ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన వేసవి శిబిరాన్ని గురువారం ఆయన సందర్శించారు.

ఈ సందర్భంగా విద్యాశాఖ అధికారి రాము మాట్లాడుతూ 6 నుండి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థిని విద్యార్థులు వేసవి సెలవుల్లో ఎలాంటి అడ్మిషన్ రుసుము లేకుండా ప్రభుత్వం ద్వారా సమ్మర్ క్యాంప్‌లను నిర్వహిస్తున్నామని ఈ క్యాంపు ద్వారా విద్యార్థులు పై తరగతులు చదువుటకు కనీస అభ్యాసన చిత్రలేఖనం క్రీడా నైపుణ్యాలు పెంపొందించేందుకు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఆర్. శ్రీనివాస్, కాశెట్టి రమేష్, ఎస్. సంజీవ్, స్వప్న, సత్యనారాయణ, శ్రీనివాస్, విద్యార్థులు పాల్గొన్నారు.

## నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి



**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి:** సింగరేణి లో కొత్త గనుల కోసం, సంస్థ పరిరక్షణ కోసం, నాలుగు లేబర్ కోడ్ ల రద్దు కోసం, కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనాలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ, ఈనెల 20 న సింగరేణిలో జరగబోయే ఒక రోజు టోకెన్ సమ్మెను విజయవంతం చేయాలని సింగరేణి కార్మికులకు సింగరేణి జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) నాయకులు పిలుపునిచ్చారు. గురువారం గోదావరిఖని భాస్కర్ రావు భవన్ లో జరిగిన ప్రెస్ మీట్ లో ఏఐటియుసి, ఐఎన్టీయుసి, సిఐటియు, టిబిజికేఎస్ సంఘాల నాయకులు కొరిమి రాజ్ కుమార్, దేవులపల్లి రాజేందర్, తుమ్మల రాజిరెడ్డి, మాదాసు రాంమూర్తిలు పాల్గొని మాట్లాడుతూ కేంద్రం లోని బిజెపి ప్రభుత్వం మూడవ సారి అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను రద్దు చేసి, నాలుగు లేబర్ కోడ్ లుగా మార్చి పరిశ్రమ యాజమాన్యాలకు అనుకూలంగా ఉంటూ, ప్రభుత్వ, ప్రైవేటు పరిశ్రమ లలో పని చేస్తున్న సంఘటిత, అసంఘటిత కార్మికులకు తీవ్ర నష్టం చేసే విధానాలను అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటుందని, కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 20న దేశవ్యాప్తంగా కార్మిక సంఘాలు చేపట్టిన టోకెన్ సమ్మె కు పిలుపు నిచ్చాయని వారు పేర్కొన్నారు. అందులో భాగంగా సింగరేణిలో సైతం ఈ టోకేన్ సమ్మె ను నిర్వహిస్తున్నామని వారు పేర్కొన్నారు . ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ, కార్మిక హక్కుల సాధన కొరకు సమ్మె చేస్తున్నామని అన్నారు. ఇంకా ఈ సమావేశంలో ఏఐటియుసి నాయకులు ఎల్ ప్రకాష్, మడ్డి ఎల్లా గౌడ్, కవ్వంపల్లి స్వామి, జీగురు రవిందర్, ఎం.ఎ. గౌస్, బి అన్నారావు, సయ్యద్ సోహేల్, సిఐటియు నాయకులు మెండె శ్రీనివాస్, నరహరి, సారయ్య , టిబిజికేఎస్ నాయకులు వడ్డెపెల్లి శంకర్, పి.శ్రీనివాస్ తో పాటు ఏఐటియుసి ఆర్జీ వన్ బ్రాంచి ఆఫీస్ కార్యదర్శి తొడుపునూరి రమేశ్ కుమార్,తదితరులు పాల్గొన్నారు.

## తల్లీ, తండ్రిని కోల్పోయిన పిల్లలకు అధికారుల అండ

కలెక్టర్ కోయ శ్రీ హర్ష



**ప్రజాపక్షం/పెద్దపల్లిరూరల్:** జిల్లాలో తల్లీ తండ్రిని కోల్పోయినపిల్లలకు జిల్లా యంత్రాంగం అండగా ఉంటుందని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. గురువారం సమీకృత జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో తల్లి తండ్రినీ కోల్పోయిన పిల్లలు వారి సంరక్షకులతో స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష పాల్గొన్నారు. పిల్లలందరూ వారి సమస్యలను తమకు వదిలేసి తమ చదువు తాము చదువుకోవాలని కోరారు. పిల్లలు ఏదైనా సమస్య ఉంటే వెంటనే 1098 కి ఫోన్ చేసి చెపితే తమ సిబ్బంది వెంటనే స్పందిస్తారని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి వేణు గోపాల్, జితేందర్, కనకరాజు, రజిత, అనిల్ ,తదితరులు పాల్గొన్నారు.

**మే 17 లోపు లైసెన్స్ సర్వేయర్ల శిక్షణకు దరఖాస్తులు**

మే 17 లోపు లైసెన్స్ సర్వేయర్ల శిక్షణకు దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.లైసెన్స్ సర్వేయర్ల శిక్షణ కోసం అర్హత గల అభ్యర్థుల నుంచి తెలంగాణ అకాడమీ ఆఫ్ ల్యాండ్ ఇన్ఫర్మేషన్ అండ్ మేనేజ్మెంట్ దరఖాస్తులు ఆహ్వానిస్తుందని, మే 5 నుంచి మీ సేవా కేంద్రాలలో 100 రూపాయలు చెల్లించి దరఖాస్తు, ప్రాస్పెక్టస్ పొందవచ్చని, మే 17లోపు ఆసక్తి గల అభ్యర్థులు తమ దరఖాస్తులను మీసేవ కేంద్రాల్లోని సమర్పించాలని కలెక్టర్ తెలిపారు. ఇంటర్ లో గణితం లో 60 శాతం మార్పులు సాధించిన వారు, ఐటిఐ డ్రాఫ్ట్స్ మెన్(సివిల్), డిప్లమా (సివిల్), బీటెక్ (సివిల్) లేదా సమానమైన అర్హత గలవారు దరఖాస్తు చేసుకోవచ్చని వెల్లడించారు. ఎంపికైన అభ్యర్థులకు 50 పని దినాలలో శిక్షణ ఇస్తామని, శిక్షణ కోసం ఓసి అభ్యర్థులు పదివేల రూపాయలు బీసీ అభ్యర్థులు 5000 రూపాయలు ఎస్సీ ఎస్టీ అభ్యర్థులు 200, 500 ఫీజు చెల్లించాల్సి ఉంటుందని, మరిన్ని వివరాలకు 9849081489,7032634404,9441947339 ఫోన్ నెంబర్ల నందు సంప్రదించాలని కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## ధాన్యం తరలింపులో ఇబ్బందులు లేకుండా చూడాలి

కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



**ప్రజాపక్షం/రాజన్నసిరిసిల్లప్రతినిధి:** కొనుగోలు కేంద్రాలలో కొనుగోలు చేసిన ధాన్యం తరలింపులో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. గురువారం జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సమికృత జిల్లా కలెక్టరేట్ లో సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ సిరిసిల్ల జిల్లాలో ఇప్పటివరకు 244 కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి 1లక్షా 28వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని అన్నారు. గంభీరావుపేట, రుద్రంగి, వీర్నపల్లి మండలాల్లో ధాన్యం కొనుగోలు ఇబ్బందులు వస్తున్నాయని, అకాల వర్షాల కారణంగా తడిసిన ధాన్యాన్ని ఆరబెట్టిన తరువాత పూర్తి స్థాయిలో కొనుగోలు చేయాలని కొనుగోలు కేంద్రాల వద్ద అవసరమైన మేర రవాణా వాహనాలు, హమాలీలు సమస్య రాకుండా చూసుకోవాలని అన్నారు. ఈ సమావేశంలో డిఆర్‌డివో శేషాద్రి, డిటివో వి. లక్ష్మ ణ్, జిల్లా సహకార అధికారి రామకృష్ణ, పౌర సరఫరాల శాఖ అధికారులు రజిత, వసంతలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం రవాణాకు లారీల కొరత లేకుండ పర్యావేక్షించాలి

తడిసిన ధాన్యం ప్రభుత్వం కొనుగోలు చేస్తుంది..

రైతులు ఆదైర్య పడవద్దు :కలెక్టర్ మనుచౌదరి



**ప్రజాపక్షం/సిద్దిపేటప్రతినిధి:** వరిధాన్యం రవాణాకు లారీల కొరత లేకుండ పర్యావేక్షించాలని తహశీల్దార్లకు జిల్లా కలెక్టర్ మనుచౌదరి ఆదేశించారు. సిద్దిపేట వ్యవసాయ మార్కెట్ కమిటిలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ మనుచౌదరి పరిశీలించారు. ఈసందర్భంగా ధాన్యం తేమ శాతం పరిశీలించారు. ఎన్ని ట్రక్కుల ధాన్యం రవాణాకు సిద్ధంగా ఉందన్నారు. వర్షంతో ధాన్యం ఏమైన తడిసిందా ? అని కొనుగోలు నిర్వాహణదారులను పరిశీలించారు. నాలుగు ట్రక్కుల ధాన్యం సిద్దంగా ఉందని, గత సంవత్సరం ఈ కేంద్రం నుండి 60 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయటం జరిగిందన్నారు. ఇప్పటి వరకు 28వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించి మిల్లులకు పంపించినట్లు నిర్వాహకులు తెలిపారు. రైతులకు ఏలాంటి ఇబ్బంది కలుగకుండ కొనుగోలు కేంద్రాలను నిర్వ హిస్తున్నట్లు తెలిపారు. ఆకాల వర్షానికి తడిసిన ధాన్యం కొనుగోలు చేసి బాయిల్డ్ రైస్ మిల్లులకు పంపించనున్నట్లు తెలిపారు. కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ధాన్యం తేమ పరిశీలించి తూకం వేసి రైస్‌మిల్లులకు పంపించాలన్నారు.

**ఈవిఎం గోదాంలను పరిశీలించిన కలెక్టర్ మనుచౌదరి**

సిద్దిపేట జిల్లా కలెక్టర్ మనుచౌదరి గురువారం సమీకృత కలెక్టరేట్ ప్రక్కన ఉన్న ఈవిఎం గోదాంలను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. నెలవారి పరిశీలనలో భాగంగా గోదాం చుట్టు కలియతిరిగారు. లాగ్‌బుక్ చెక్ చేసి విజిటర్ బుక్ రిజిస్టర్‌లో సంతకం చేశారు. ఎలక్షన్ కమిషన్ మార్గదర్శకాల ప్రకారం చుట్టు సిసి కెమెరాల పనితీరు, పోలీసు అధికారులు 24/7 గట్టి బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. రెవెన్యూ అధికారులు తరుచుగా గోదాం పరిసర ప్రాంతాన్ని పర్యావేక్షణ చేయాలన్నారు.

# క్రీడ

## ఆపరేషన్ సిందూర్ ఎఫెక్ట్..

## బిసిసిఐ కీలక నిర్ణయం!

భారత త్రివిధ దళాలు చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్' నేపథ్యంలో భారత క్రికెట్ నియంత్రణ మండలి(బిసిసిఐ) కీలక నిర్ణయం తీసుకుంది. ఐపిఎల్ 2025 సీజన్‌లో భాగంగా పంజాబ్ కింగ్స్, ముంబై ఇండియన్స్ మధ్య ఆదివారం ధర్మశాల వేదికగా జరగనున్న మ్యాచ్‌ను అహ్మదాబాద్ వేదికకు తరలించింది. ఈ మేరకు సోషల్ మీడియా వేదికగా ఐపిఎల్ నిర్వాహకులు ఓ ప్రకటనను విడుదల చేశారు. విమానాశ్రయాల మూసివేతతో ఈ నిర్ణయం తీసుకున్నాం.'అని ఆ ప్రకటనలో పేర్కొన్నారు. వీటిని గుజరాత్ క్రికెట్ అసోసియేషన్ సెక్రటరీ అనిల్ పటేల్ ధృవీకరించాడు. ఉగ్రమూకల నిర్మూలనలో సైన్యం చూపిన తెగువను కీర్తిస్తూ వారికి సంఘీభావం తెలిపేందుకు బిసిసిఐ నడుం బిగించింది. అందుకోసం గురువారం పంజాబ్–ఢిల్లీ మ్యాచ్ సమయంలో ధర్మశాలలో ఓ ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ప్రముఖ గాయకుడు బి ప్రాక్ (పత్రీక్ బచన్) ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేసింది.



### భద్రతా కారణాలతో

## పంజాబ్ – ఢిల్లీ మ్యాచ్ రద్దు..!



ఐపిఎల్ 2025 సీజన్‌లో భాగంగా పంజాబ్ కింగ్స్, ఢిల్లీ క్యాపిటల్స్ మధ్య ధర్మశాల వేదికగా జరగాల్సిన మ్యాచ్ రద్దయ్యింది. జమ్మూ కశ్మీ, రాజస్థాన్, పంజాబ్ ప్రజల శ్రేయస్సు కోసం ఈ మ్యాచ్‌ను అర్ధాంతరంగా రద్దు చేసినట్లు తెలుస్తోంది. భారత సాయుధ దళాలు చేపట్టిన ఆపరేషన్ సింధూర్‌కు ప్రతీకారంగా పాకిస్థాన్ నుంచి దాడులు జరగుతాయనే ఇంటెలిజెన్స్ రిపోర్ట్‌ల నేపథ్యంలో ఈ మ్యాచ్‌ను నిలిపివేసినట్లు తెలుస్తోంది. ఫ్లడ్ లైట్స్ ఆపేసి ప్రేక్షకులను మైదానం నుంచి బయటకు తరలిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే ఈ విషయాన్ని ఐపీఎల్ నిర్వాహకులు అధికారికంగా ప్రకటించాల్సి ఉంది. మ్యాచ్ ఆగిపోయే సమయానికి పంజాబ్ కింగ్స్ 10.1 ఓవర్లలో వికెట్ నష్టానికి 122 పరుగులు చేసింది. ప్రియాన్ష్ ఆర్య(34 బంతుల్లో 5 ఫోర్లు, 6 సిక్స్‌లతో 70), ప్రభ్‌సిమ్రాన్ సింగ్(50) హాఫ్ సెంచరీలతో రాణించారు.



## రోహిత్ ఔట్.. కెప్టెన్‌గా రాహుల్?

టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ టెస్ట్ క్రికెట్‌కు వీడ్కోలు పలికాడు. సింపుల్‌గా ఇన్‌స్టాగ్రామ్ వేదికగా బుధవారం తన నిర్ణయాన్ని వెల్లడించాడు. వన్డే ఫార్మాట్‌లో మాత్రమే కొనసాగుతానని తెలిపాడు. రోహిత్ శర్మ ఆకస్మిక నిర్ణయంతో టీమిండియా తదుపరి టెస్ట్ కెప్టెన్ ఎవరా? అనే చర్చ జోరుగా సాగుతోంది. ఐపిఎల్ 2025 సీజన్ అనంతరం టీమిండియా ఐదు టెస్ట్‌ల సిరీస్ కోసం ఇంగ్లండ పర్యటనకు వెళ్లనుంది. డబ్ల్యూటీసీ 202527 సైకిల్ ఈ సిరీస్‌తోనే ప్రారంభం కానుంది. ఈ క్రమంలోనే ఈ సిరీస్‌కు ప్రాధాన్యత ఏర్పడింది. అంతేకాకుండా ఇటీవల టెస్ట్ ఫార్మాట్‌లో టీమిండియా ఘోర పరాజయాలను చవిచూసింది. సొంతగడ్డపై న్యూజిలాండ్‌తో మూడు టెస్ట్‌ల సిరీస్‌లో క్లీన్ స్వీప్ అయిన టీమిండియా.. ఆస్ట్రేలియా గడ్డపై 13తో బోర్డర్ గవాస్కర్ ట్రోఫీని కోల్పోయింది. ఈ వైఫల్యంతో డబ్ల్యూటీసీ 2025 ఫైనల్ బెర్త్‌ను దక్కించుకోలేక పోయింది. ఈ వరుస వైఫల్యాల నేపథ్యంలోనే భారత సెలెక్టర్లు టెస్ట్ ఫార్మాట్‌లో కొత్త జట్టును తయారు చేయడంపై ఫోకస్ పెట్టారు.

**కెప్టెన్‌గా కెఎల్ రాహుల్..?**


టీమిండియా టెస్ట్ కెప్టెన్సీ రేసులో శుభ్‌మన్ గిల్, కేఎల్ రాహుల్, రిషభ్ పంత్‌తో పాటు జస్‌ప్రీత్ బుమ్రా పేర్లు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం బుమ్రా.. టీమిండియా టెస్ట్ వైస్ కెప్టెన్‌గా కొనసాగుతున్నాడు. కానీ గాయాల బెడద, వర్క్‌లోడ్ మేనేజ్‌మెంట్‌లో భాగంగా అతన్ని లీడర్‌షిప్ గ్రూప్ నుంచి తప్పించే యోచనలో సెలెక్టర్లు ఉన్నట్లు వార్తలు వచ్చాయి. అంతేకాకుండా ఇంగ్లండ పర్యటనలో బుమ్రా ఐదు మ్యాచ్‌లకు ఐదు ఆడలేని పరిస్థితి. వర్క్‌లోడ్‌లో భాగంగా అతను రెండు టెస్ట్‌ల వరకు దూరమయ్యే ఛాన్స్ ఉంది. కాబట్టి శుభ్‌మన్ గిల్, కేఎల్ రాహుల్, రిషభ్ పంత్‌లో ఒకరి టెస్ట్ కెప్టెన్సీ దక్కవచ్చు. అనుభవానికి ప్రాధాన్యత ఇస్తే కేఎల్ రాహుల్‌కు టెస్ట్ కెప్టెన్సీ దక్కుతుంది. అలా కాకుండా భవిష్యత్తు దృష్టిలో పెట్టుకుంటే శుభ్‌మన్ గిల్‌కు సారథ్య బాధ్యతలు దక్కుతాయి.

**సాయి సుదర్శన్‌కు ఛాన్స్**

ఓపెనర్‌గా రోహిత్ శర్మ స్థానంలో సాయి సుదర్శన్ భారత జట్టులోకి రావచ్చు. అతనితో పాటు యశస్వి జైస్వాల్, శుభ్‌మన్ గిల్, విరాట్ కోహ్లీ, రిషభ్ పంత్, నితీష్ కుమార్ రెడ్డి, ధ్రువ్ జురెల్, సర్ఫరాజ్ ఖాన్‌లు బ్యాటర్లుగా అవకాశం అందుకోనున్నారు. స్పెషలిస్ట్ స్పిన్నర్‌గా కుల్దీప్ యాదవ్ ఆడనుండగా.. స్పిన్ ఆల్‌రౌండర్లు రవీంద్ర జడేజా, వాషింగ్టన్ సుందర్కు అవకాశం దక్కవచ్చు. పేసర్లుగా జస్‌ప్రీత్ బుమ్రా, మహమ్మద్ షమీ, మహమ్మద్ సిరాజ్, అర్ష్‌దీప్ సింగ్‌తో పాటు హర్షిత్ రాణా ఎంపికవచ్చు. జూన్ 20 నుంచి భారత్‌ఇంగ్లండ్ టెస్ట్ సిరీస్ ప్రారంభం కానుంది. 2007 తర్వాత భారత్ ఇప్పటి వరకు ఇంగ్లండ్ గడ్డపై టెస్ట్ సిరీస్ గెలవలేదు.

## చిరు కోసం బాలీవుడ్ హీరోయిన్..?





మెగాస్టార్ చిరంజీవి ప్రస్తుతం వరుసగా సినిమాలు అనౌన్స్ చేసి వాటిని తెరకెక్కిస్తున్నాడు. ఇప్పటికే 'విశ్వంభర' చిత్రాన్ని రిలీజ్‌కు రెడీ చేసిన మెగాస్టారు, తన నెక్స్ట్ చిత్రాన్ని దర్శకుడు అనిల్ రావిపూడి డైరెక్షన్‌లో తెరకెక్కించేందుకు సిద్ధమవుతున్నాడు. ఇక ఈ సినిమా తర్వాత మెగాస్టార్ తన నెక్స్ట్ చిత్రాన్ని యంగ్ డైరెక్టర్ శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో తెరకెక్కించేందుకు సిద్ధమవుతున్నాడు. ఈ సినిమాను ఇప్పటికే అఫీషియల్‌గా అనౌన్స్ చేశాడు. ఈ చిత్ర షూటింగ్‌ను కూడా త్వర లో ప్రారంభించేందుకు సిద్ధమవుతున్నారు. అయితే, ఈ సినిమాలో హీరోయిన్‌గా బాలీవుడ్ భామను తీసుకొచ్చేందుకు శ్రీకాంత్ ప్లాన్ చేస్తున్నాడట. తొలుత బాలీవుడ్ హీరోయిన్ రాణి ముఖర్జీని ఈ సినిమాలో హీరోయిన్‌గా తీసుకోవాలని శ్రీకాంత్ ప్లాన్ చేశాడట. అయితే, ఇప్పుడు ఈ సినిమా కోసం దీపిక పదుకొనె పేరు వినిపిస్తోంది. 'కల్కి' మూవీలో నటించిన దీపిక టాలీవుడ్ ప్రేక్షకులకు దగ్గరయ్యింది. మరి చిరంజీవి కో సం దీపిక ఈ సినిమాను ఓకే చేస్తుం దా లేదా అనేది వేచి చూడాలి.

# రీల్

## రామ్ పోతినేని టైటిల్ గ్లింప్స్ డేట్ ఫిక్స్

యంగ్ అండ్ ఎనర్జిటిక్ స్టార్ రామ్ పోతినేని నటిస్తున్న లేటెస్ట్ మూవీ ఇప్పటికే శరవేగంగా షూటింగ్ జరుపుకుంటోంది. ఈ సినిమాను దర్శకుడు పి.మహేష్ బాబు డైరెక్ట్ చేస్తుండగా రాపో22 అనే వర్కింగ్ టైటిల్‌తో ఈ మూవీ రూపొందుతోంది. ఈ సినిమా నుంచి ఇప్పుడు మేకర్స్ ఓ సాలిడ్ ట్రీట్ అందించేందుకు సిద్ధమయ్యారు. ఈ మూవీకి సంబంధించిన టైటిల్ గ్లింప్స్‌ను మే 15న రిలీజ్ చేయబోతున్నట్లు చిత్ర యూనిట్ వెల్లడించింది. దీంతో ఈ సినిమాకు ఎలాంటి ఇంట్రెస్టింగ్ టైటిల్ పెడతారా అని అభిమానులు ఆసక్తిగా చూస్తున్నారు. ఈ సినిమాలో రామ్ సరికొత్త లుక్‌తో ప్రేక్షకులను ఆకట్టుకునేందుకు సిద్ధమవుతున్నాడు. ఇక ఈ సినిమాలో అందాల భామ భాగ్యశ్రీ బొర్సే హీరోయిన్‌గా నటిస్తుండటంతో ఈ సినిమాలో వారిద్దరి కెమిస్ట్రీ ఏ విధంగా ఉంటుందా అని అందరూ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ చిత్రానికి మెర్విన్‌వివేక్ ద్వయం సంగీతం అందిస్తుండగా మైత్రి మూవీ మేకర్స్ ప్రొడ్యూస్ చేస్తున్నారు.








## రష్మిక – ధనుష్ మెస్మరైజ్ చేస్తారా..?

టాలీవుడ్‌లో తెరకెక్కుతున్న చిత్రాల్లో 'కుబేర' ఇప్పటికే ప్రేక్షకుల్లో సాలిడ్ అంచనాలు క్రియేట్ చేసింది. ఈ సినిమాను దర్శకుడు శేఖర్ కమ్ముల డైరెక్ట్ చేస్తుండటంతో ఈ అంచనాలు రెట్టింపు అయ్యాయి. ఇక ఈ సినిమాలో తమిళ స్టార్ ధనుష్, నేషనల్ క్రష్ రష్మిక మందన్న, కింగ్ అక్కినేని నాగార్జున ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు. దీంతో ఈ సినిమా కోసం అభిమానులు ఎంతో ఆసక్తిగా చూస్తున్నారు. అయితే, ఈ సినిమా నుంచి ఎలాంటి అప్డేట్ వచ్చినా ఫ్యాన్స్ ఫాలో అవుతూ సినిమాపై బజ్ క్రియేట్ చేస్తున్నారు. తాజాగా ఈ చిత్ర కౌంట్‌డౌన్ పోస్టర్ ఒకటి రిలీజ్ చేశారు. ఈ పోస్టర్‌లో ధనుష్, రష్మిక మనకు కనిపిస్తున్నారు. ఈ సినిమాలో ఈ జోడీ ప్రేక్షకులను మెస్మరైజ్ చేయడం ఖాయమని ఈ పోస్టర్ చూస్తే అర్ధమవుతోంది. ఇక తనదైన మార్క్ శేఖర్ కమ్ముల ఈ సినిమాను రూపొందిస్తుండటంతో ఈ మూవీ ఎలాంటి విజయాన్ని అందుకుంటుందా అని అందరూ ఆసక్తిగా చూస్తున్నారు. ఈ చిత్రానికి దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తుండగా జూన్ 20న ఈ చిత్రాన్ని వరల్డ్‌డ్‌గా గ్రాండ్ రిలీజ్ కు రెడీ చేస్తున్నారు.

# రాజీవ్ యువ వికాసంలో సిబిల్ స్కోర్ తొలగించాలి

### ఎఐవైఎఫ్ డిమాండ్



ప్రజాపక్షం/హైదరాబాద్ : నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కల్పించేందుకు కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న రాజీవ్ యువ వికాసం పథకానికి సిబిల్ స్కోర్ ను కీలకం చేయడం సరికాదని, ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ అఖిల భారత యువజన సమాఖ్య(ఎఐవైఎఫ్) రాష్ట్ర సమితి ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. రాజీవ్ యువ వికాసం పథకంలో సిబిల్ స్కోర్ నిబంధనను తొలగించాలని డిమాండ్ చేస్తూ గురువారం ఎఐవైఎఫ్ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో హిమాయత్ నగర్ లోని సత్య నారాయణ రెడ్డి భవన్ నుండి వై జంక్షన్ వరకు ఎఐవైఎఫ్ నేతలు చెవిలో పూలు, చేతిలో చిప్ప పట్టుకుని వినూత్న రీతిలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వలి ఉల్లా ఖాద్రీ, ప్రధాన కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర లు మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలని రాజీవ్ యువ వికాసం పథకానికి దరఖాస్తు చేసుకోవాలని చెబితే రాష్ట్ర వ్యాప్తంగా 16.25 లక్షల మంది నిరుద్యోగ యువత దరఖాస్తు చేసుకున్నారన్నారు . దరఖాస్తు చేసుకున్న తర్వాత ఇప్పుడు కొత్తగా సిబిల్ స్కోర్ తప్పకుండ ఉండాలనే నిబంధనన పెట్టడంతో లక్షల మంది యువతను ఈ పథకానికి దూరమయ్యే అవకాశం ఉందని తెలిపారు. గతంలో ఏవైనా లోన్లు తీసుకుని కట్టనివారి అప్లికేషన్లు రిజెక్ట్ అయ్యే అవకాశం ఉందని, దరఖాస్తుదారుల లోన్ హిస్టరీ, సిబిల్ స్కోర్ వివరాలను బ్యాంకుల నుంచి సేకరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. వాటి ఆధారంగా 40 శాతం అప్లికేషన్లు రిజెక్ట్ అయ్యే అవకాశముందన్నారు. ఉపాధి లేకపోవడం వల్లనే యువత ప్రైవేట్ లోన్స్, బెట్టింగ్ ఇతర యాప్స్ ల రూపంలో అప్పులు తీసుకుంటున్నారనీ, ఇలాంటి వారికి సిబిల్ స్కోర్ తగ్గుతుందని ప్రభుత్వానికి తెలియదా అన్ని వారు ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం సిబిల్ స్కోర్ ఆలోచన విధానాన్ని విరమించుకోవాలని,. బేషరతుగా అందరికి ఉపాధి కల్పనకు ఈ స్కీమ్ ద్వారా డబ్బులు ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నెర్లకంటి శ్రీకాంత్, ఏఐవైఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు టి. సత్య ప్రసాద్, హైదరాబాద్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మహమూద్, హైదరాబాద్ జిల్లా ఉపాధ్యక్షుడు మాజీద్ అలీ ఖాన్, హేమంత్, జానీ, వెంకట్,ఖాజా పాషా, సతీశ్ కుమార్,జగన్... సీపీఐ హైదరాబాద్ జిల్లా నాయకులు చెట్టుకింది శ్రీనివాస్ పాల్గొన్నారు.

# ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా

### తెలంగాణ ఎంప్లాయిస్ అసోసియేషన్ చైర్మన్ వి.లచ్చి రెడ్డి



ప్రజాపక్షం/హైదరాబాద్ : ఉద్యోగులు, కార్మికుల దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ ఎంప్లాయిస్ అసోసియేషన్ చైర్మన్ వి.లచ్చి రెడ్డికి గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్(జిహెచ్‌ఎంఇయు) అధ్యక్షుడూ ఊదరి గోపాల్ విజ్ఞప్తి చేశారు. గురువారం లచ్చిరెడ్డిని కలిసి జిహెచ్ఎంసి రెగ్యులర్ ఉద్యోగులు, కార్మికులు, కాంట్రాక్టు ఔట్‌సోర్సింగ్ విధానంలో వివిధ విభాగాల్లో పనిచేస్తున్న కార్మికుల సమస్యలపై వినతిపత్రం అందచేశారు. జిహెచ్ఎంసి కార్మికుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకేళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఈ సందర్భంగా లచ్చిరెడ్డి గోపాల్ బృందనికి హామీనిచ్చారు. లచ్చిరెడ్డిని కలిసిన వారిలో యూనియన్ ప్రధాన కార్యదర్శి డి.నర్సింగ్ రావు, వర్కింగ్ ప్రెసిడెంట్ బి.కన్నా తదితరులు ఉన్నారు.

## సరిహద్దుల్లో ఉద్రిక్తం (మొదటి పేజీ తరువాయి)

మావోయిస్టు మృతి చెందినట్లు ప్రచారం సాగుతోంది. దీంతో తెలంగాణఛత్తీస్‌గఢ్ సరిహద్దు ప్రాంతాల్లో ఉద్రిక్త వాతావరణం చోటు చేసుకుంది. గత 18 రోజులుగా ఆపరేషన్ కగార్‌లో భాగంగా కర్రెగుట్టలను చుట్టుముట్టిన సంయుక్త 20వేలకు పైగా భద్రతా బలగాలు ఆ గుట్టలను తమ ఆదీనంలోనికి తీసుకున్నాయి. బుధవారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో 22 మంది మావోయిస్టులను ముట్టు పెట్టాయి. మావోయిస్టుల స్థావరాలను కనిపెట్టి యుద్ధతంత్రాలతో ముందుకు దూసుకుపోతున్న బలగాలు పరిస్థితులను తమకు అనుకూలంగా మలుచుకుంటూ ముందుకు సాగుతున్నాయి. కర్రెగుట్టల పొడవునా కూంబింగ్ /// వచ్చే ఏడాది మార్చి నెలాఖరు నాటికి మావోయిస్టులను అంతంచేస్తామని కేంద్రమంత్రి అమీత్‌షా ప్రకటించిన నేపథ్యంలో గత 18 రోజులుగా కర్రెగుట్టల్లో భద్రతా బలగాలు మకాం వేసి, అనువునా సోదాలు చేసుకుంటూ ముందుకు సాగుతున్నాయి. ఇప్పటికే 20 వేల మందికిపైగా బలగాలను మోహరించిన ప్రభుత్వాలు అధునాతన ఆయుధసంపత్తితో తూటాల వర్షం కురిపిస్తున్నట్లు చెబుతున్నారు. తాము శాంతి చర్చలకు సిద్ధమే అంటూ మావోయిస్టు పార్టీ పలుమార్లు లేఖలు పంపినప్పటికీ ప్రభుత్వాలు తోసిపుచ్చాయి. కయ్యానికి కాలుదువ్వతున్నట్లు కేంద్రం, ఇటు ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వ తీరు ఉండటంతో యుద్ధవాతావరణం నెలకొంది. కర్రెగుట్టల ఎన్‌కౌంటర్ జరిగిన ఒక్కరోజు గడవక ముందే మావోయిస్టులు మందుపాతర పేల్చడంతో పరిస్థితులు మరింత భయానకంగా మారాయి. తెలంగాణ రాష్ట్ర నుండి పెద్ద ఎత్తున బలగాలను సమీప అడవుల్లో మోహరిస్తున్నట్లు తెలుస్తోంది. చర్ల ప్రాంతంలో ఉన్న సిఆర్‌పిఎఫ్ బెటాలియన్ల నుండి కూడా జవాన్లను పెద్ద ఎత్తున తరలిస్తున్నట్లు సమాచారం. తెలంగాణ సరిహద్దుల్లో మావోయిస్టులు ఉన్నరాని తేలిపోవడంతో గాలింపు చర్యలు ముమ్మరమయ్యాయి. ఇలాంటి పరిస్థితుల్లో సమీప అటవీ గ్రామాల్లో భయానక పరిస్థితులు నెలకొన్నాయి. ఏ క్షణం ఏం జరుగుతుందో అంతుపట్టక సమీప అటవీ గ్రామాల ప్రజలు బిక్కుబిక్కుమంటూ కాలంవెల్లదీస్తున్నారు. భద్రాచలం ఏజెన్సీ ప్రాంతాన్ని తమ ఆదీనంలోనికి తీసుకున్న బలగాలు అడుగడుగునా సోదాలు మొదలుపెట్టారు. వాహనాల తనిఖీలతో పాటు అనుమానితులను ప్రశ్నిస్తున్నారు. తెలంగాణ ప్రాంతంలోనికి మావోయిస్టులు చొరబడుతున్నారనే వార్తల నేపథ్యంలో నేడు చోటు చేసుకున్న ఘటనతో మావోయిస్టు పార్టీ ఈ ప్రాంతంలో బలంగానే ఉన్నట్లు పోలీసులు నిర్ధారించుకున్నారు. అడవుల్లో నుండి ప్రధాన రహదార్లకు చేరుకునే అటవీ మార్గాలను, గోదావరి ఫెర్రీ పాయింట్ల వద్ద నిఘా పెంచారు. మావోయిస్టుల ఏరివేతే లక్ష్యంగా కొనసాగుతున్న యుద్ధ వాతావరణం అటు భద్రతాబలగాలు, మావోయిస్టులతో పాటు ఇటు ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది.

## 11,482 కోట్లు (మొదటి పేజీ తరువాయి)

చేశారు. రూ.130 కోట్లతో కళాశాల భవనాలను నిర్మించనున్నారు. ఈ సందర్భంగా జరిగిన సభలో భట్టివిక్రమార్క మాట్లాడుతూ వైద్య కళాశాల భవనాలకు శంకుస్థాపన జరగడం శుభ పరిణామమన్నారు. భవన నిర్మాణం పూర్తయితే మెడికల్ కళాశాలకు అనుబంధంగా ఒక సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని ఏర్పాటు చేస్తామని తద్వారా ప్రజలకు మెరుగైన వైద్య సౌకర్యం అందుతుందన్నారు. రాష్ట్రంలో ఎనిమిది వైద్య కళాశాలలను మంజూరు చేయించుకోవడం జరిగిందని గత ప్రభుత్వం కంటే ప్రస్తుత ప్రభుత్వం విద్య, వైద్య రంగాలకు నిధులు అధికంగా ఖర్చు చేస్తుందన్నారు. 2014 నుంచి 2024 వరకు వైద్య రంగంపై రూ. 5959 కోట్లు ఖర్చు చేస్తే 2024 25 ఆర్థిక సంవత్సరంలో రూ.11,482 కోట్లు ఖర్చు చేయడం జరిగిందని విక్రమార్క తెలిపారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితిని ఐదు లక్షల నుంచి పది లక్షలకు పెంచడం జరిగిందని తద్వారా 90 లక్షల కుటుంబాలకు లబ్ది చేకూరుతుందన్నారు. వైద్యంతో పాటు విద్యకు ప్రాధాన్యతనిస్తున్నామని తెలిపారు. డైట్ ఛార్జీలు 40 శాతం, కాస్మోటిక్ ఛార్జీలు 200 శాతం పెంచడం జరిగిందని తెలిపారు. 58 యంగ్ ఇండియా సమీకృత గురుకుల పాఠశాలలను మంజూరు చేసి రూ. 11,600 కోట్లతో పనులు చేపట్టడం జరిగిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా రూ. 22,500 కోట్లతో 4.5 లక్షల ఇందిరమ్మ ఇండ్లను నిర్మిస్తున్నామని భట్టి విక్రమార్క తెలిపారు. రైతులకు రుణమాఫీ ద్వారా రూ. 22వేల కోట్లు అందించామన్నారు. ఫాంహౌజ్‌లో పడుకున్న వారు చేసే విమర్శలు, ప్రేలాపనలను తాము పట్టించుకోబోమన్నారు. ఏడువేల కోట్ల రూపాయలు అప్పులు చేసిన వారు ఈ రాష్ట్రానికి ఏమి చేయకపోగా ఒకటిన కనీసం వేతనాలు ఇవ్వలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. ప్రజల అవసరాలను తీర్చడంలో తాము ముందు వరుసలో ఉన్నామని ఆయన తెలిపారు. ఉద్యోగులకు 15వ తేదీ తర్వాత వేతనాలు ఇచ్చిన వారు ఏనాడు సంక్షేమం గురించి పట్టించుకోని వారు ఇప్పుడు అనవసర విమర్శలు చేస్తున్నారని భట్టివిక్రమార్క తెలిపారు. ప్రజల కోసమే పాలన చేస్తున్నాం తప్ప దొరల కోసం పనిచేసే ప్రభుత్వం కాదని ఆయన తెలిపారు. అనవసరమైన విమర్శలు చేసే వారికి మా ప్రభుత్వం చేతలే సమాధానం చెబుతాయన్నారు. కోరి కొట్లాడి రాష్ట్రాన్ని తెచ్చుకున్న వారి ఆశలను గత ప్రభుత్వం నెరవేర్చలేదన్నారు. ఉద్యోగుల అవసరాలను తీర్చడంలో ముందుంటామని ఆయన తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాటలను కొందరు వక్రీకరించారని భట్టివిక్రమార్క తెలిపారు. సభలో మంత్రి తుమ్మల మాట్లాడుతూ ఎన్నికల కోడ్ ఇతరత్రా కారణాలతో వైద్య కళాశాల భవన శంకుస్థాపన కార్యక్రమం వాయిదాపడిందని నేడు ఆ కార్యక్రమాన్ని పూర్తి చేయడం జరిగిందన్నారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ప్రజా ప్రభుత్వమని విద్య, వైద్యానికి ప్రాధాన్యతనివ్వడం జరుగుతుందన్నారు. మెడికల్ కళాశాలకు అనుబంధంగా నర్సింగ్ కళాశాల ఏర్పాటు అవుతుందని నర్సింగ్ కళాశాలను కూడా మంజూరు చేయాలని తుమ్మల కోరారు. మెడికల్ కళాశాల పక్కనే నాగపూర్ అమరావతి హైవే వస్తుందన ఏడాది కాలంలో దీని నిర్మాణాన్ని పూర్తి చేయాలని ఆయన కోరారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ రింగు రోడ్డు పక్కన వైద్య కళాశాలను ఏర్పాటు చేయడం వల్ల భవిష్యత్తులో ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందన్నారు. గత ప్రభుత్వంలో వెయ్యి కోట్లు పెండింగ్‌లో ఉండగా వాటిని చెల్లిస్తూ వైద్య కళాశాలలు, నర్సింగ్ కళాశాలలు, మౌలిక వసతుల కల్పన చేయడం జరుగుతుందన్నారు. వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ ఖమ్మంజిల్లాలో ఆరు పిహెచ్‌సిలను మంజూరు చేస్తామన్నారు. హైదరాబాద్ పై ఆధారపడకుండా ఖమ్మం, కరీంనగర్‌ను మెడికల్ హబ్‌గా తయారు చేస్తామన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే రోగుల సంఖ్య రోజు రోజుకు పెరుగుతుందని ఆయన తెలిపారు. ఆదివాసీల వైద్యం కోసం అంబులెన్స్‌లను ఏర్పాటు చేయడం జరుగుతుందని ఖమ్మంలో నర్సింగ్ కళాశాల ఏర్పాటుకు మిడ్ వైఫరీ కోర్సులను అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య ఆరోగ్యశాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ క్రిస్టినా, జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, పోలీస్ కమిషనర్ సునీల్ దత్, ఎంఎల్‌ఏలు రాందాస్ నాయక్, రాగమయి, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, వివిధ శాఖల అధికారులు డాక్టర్ నరేంద్రకుమార్, ఫణీందర్ రెడ్డి, మేయర్ పునుకొల్లు నీరజ, డిసిసిబి ఛైర్మన్ వెంకటేశ్వర రావు, వైద్య కళాశాల ప్రిన్సిపాల్ రాజేశ్వరరావు, జెడ్పిసిఈవో దీక్షారైనా తదితరులు పాల్గొన్నారు.




Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Baddam Yella Reddy Bhavan, Ganesh Nagar, KARIMNAGAR - 505001 Telangana State. RNI TELTEL /2018/76746, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com